www.velthuru.com RNI TEL TEL/ 2019 / 78609 బుధవారం

# వెలుతురు

రంగారెడ్డి। 21, ఫిబ్రవరి 2024
తెలుగు దిన పత్రిక
సంపుటి: 5 సంచిక: 273, పేజీలు: 12, వెల: రూ.5/-

వెలుతురు TV NEWS

## ఆర్టికల్ 370 రద్దుతో

# రాష్ట్రంలో నవ్యపథం

- దశాబ్దాలుగా వారసత్వ రాజకీయాల్లో మగ్గిన కాశ్మీర్
- అడ్డుగోడ తొలగడంతో పురోగామి దిశగా పయనం
- దేశాభివృద్ధి అంటే.. కాశ్మీర్ అభివృద్ధి కూడా
- కాశ్మీర్‌లో పలు అభివృద్ధి పనులకు మోడీ శ్రీకారం
- వారసత్వ రాజకీయాలపై ఘాటు విమర్శలు
- 370 ఆర్టికల్ సినిమాపై ప్రస్తావన



**జమ్మూ,ఫిబ్రవరి20 (వెలుతురు):** దశాబ్దాల తరబడి వంశపారంపర్య రాజకీయాల భారాన్ని జమ్మూకశ్మీర్ భరించాల్సి వచ్చిందని ప్రధాని మోడీ అన్నారు. ఆ రాజకీయ నేతలు వారి కుటుంబాల గురించి మాత్రమే ఆలోచించేవారని, అయితే ..ఇప్పుడు అలాంటి పరిస్థితుల నుంచి విముక్తి లభిస్తున్నందుకు సంతోషంగా ఉందని వ్యాఖ్యలు చేశారు. కొన్నేళ్లుగా జమ్ము కశ్మీర్‌ను ఎవరూ పట్టించుకోలేదని.. ఇవాళ ఇక్కడి నుంచి అభివృద్ధి పనుల్ని ప్రారంభించడం సంతోషంగా ఉందని దేశ ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. మంగళవారం జమ్మూ నుంచి ఐఐటీ, ఐఐఎం, నవోదయ లాంటి విద్యాసంస్థలను ప్రారంభించి జాతికి అంకితం చేశారు.
జమ్ముకశ్మీర్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తాం. త్వరలో వికసిత్ కశ్మీర్‌కల సాకారం అవుతుంది. మోదీ గ్యారెంటీ అంటే ఇలా ఉంటుంది అని అన్నారు. అభివృద్ధి చెందిన భారత్ అంటే అభివృద్ధి చెందిన జమ్మూకశ్మీర్ కూడా అని తెలిపారు. గత పదేళ్లలో ఈ ప్రాంతంలో కొత్తగా 50 డిగ్రీ కళాశాలలు

వివరాలు 2లో...



## అమాయకురాలు కాదు..

# అవినీతి తిమింగలం

### జగ జ్యోతి ఇంట్లో

### 65 లక్షల నగదు స్వాధీనం

- 4 కిలోల బంగారు ఆభరణాల గుర్తింపు
- అరెస్ట్ చేసి జైలుకు తరలించిన అధికారులు
- సోదాలు కొనసాగుతున్నాయని ఏసిబి వెల్లడి

**హైదరాబాద్,ఫిబ్రవరి20(వెలుతురు):** మాసబ్‌ట్యాంక్‌లోని ట్రైబల్ వెల్ఫేర్ కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీరుగా పని చేస్తున్న జగ జ్యోతిని ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. ఆమెను కోర్టులో ప్రవేశపెట్టారు. జగజ్యోతి రూ.84 వేల లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా ఏసీబీ అధికారులకు సోమ వారం దొరికిపోయిన సంగతి తెలిసిందే. అనంతరం ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ జగజ్యోతి ఇంట్లో ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఇంట్లో ఎక్కడపడితే అక్కడ నగదు ఉన్నట్లుగా అధికారులు గుర్తించారు. అలా మొత్తం ఆమె ఇంట్లో రూ.65 లక్షల నగదుతో పాటు 4 కిలోల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లుగా అధికారులు తెలిపారు. జ్యోతి ఇంట్లో ఇంకా సోదాలు కొనసాగు తున్నట్లు అధికారులు చెప్పారు. మాసబ్‌ట్యాంక్‌లోని ట్రైబల్ వెల్ఫేర్ ఇంజినీరింగ్ ఆఫీస్‌లో జగజ్యోతి ఇంచార్జి సూపరింటెండెంట్‌గా పని చేస్తున్నారు. ఓ బిల్డింగ్ కాంట్రాక్టర్ నుంచి రూ.84 వేలు లంచం తీసుకుంటూ సోమవారం రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి కోర్టులో ప్రవేశపెట్టారు. ఆమె లంచం డిమాండ్ చేయడంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. అనంతరం పక్కా ప్రణాళికతో డబ్బు తీసుకుంటుండగా ఆమెను అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని అదుపులోకి తీసుకున్నారు. అధికారులు పట్టుకున్న అనంతరం ఆమె కన్నీళ్లు పెట్టుకున్నారు. ఆమె కార్యాలయంతో పాటు ఇంట్లోనూ సోదాలు నిర్వహించారు. కొద్ది రోజుల క్రితమే నల్గొండ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కిన సంగతి తెలిసిందే. ఔషధాల టెండర్ కోసం వెంకన్న అనే వ్యాపారి నుంచి సూపరింటెండెంట్ లచ్చు నాయక్ డబ్బులు డిమాండ్ చేశారు. దీంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించగా.. పక్కా ఎలాన్‌తో వెంకన్న నుంచి లచ్చు నాయక్ ఆయన నివాసంలో డబ్బులు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు దాడి చేసి రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. వారం రోజుల క్రితం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా శామీర్పేట తహసీల్దార్ ను సైతం ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.

వివరాలు 2లో...

- అమిత్ షాపై వ్యాఖ్యల కేసులో బెయిల్
- సుల్తాన్‌పూర్ కోర్టుకు హాజరైన కాంగ్రెస్ నేత



### పరువు నష్ట కేసులో

# రాహుల్‌కు ఊరట

**లక్నో,ఫిబ్రవరి20(వెలుతురు):** కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన పరువు నష్టం కేసులో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి ఊరట లభించింది.

వివరాలు 2లో...

### మార్చిలో ఎన్నికల

# నోటిఫికేషన్..!

- సర్వసన్నద్ధంగా కేంద్ర ఎన్నికల సంఘం




**న్యూఢిల్లీ,ఫిబ్రవరి20(వెలుతురు):** సార్వత్రిక ఎన్నికల తేదీలపై కేంద్ర ఎన్నికల సంఘం కసరత్తు దాదాపు పూర్తయినట్లు తెలుస్తోంది. ఎన్నికలకు సిద్ధంగా ఉన్నామని ఇప్పటికే చీఫ్ ఎలక్షన్ కమిషనర్ ప్రకటించారు. ఈ క్రమంలో త్వరలోనే నోటిఫికేషన్ వెలువడుతుందని ప్రచారం సాగుతోంది.

వివరాలు 2లో...

### నేడు యధావిధిగా

# రైతుల నిరసనలు

- ఢిల్లీ సరిహద్దుల్లోనే మకాం వేసిన నేతలు
- శాంతియుత నిరసనకు మాత్రమే దిగుతామని వెల్లడి

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి20(వెలుతురు):** తమ డిమాండ్లను పరిష్కరించలేదనే కారణంతో ఢిల్లీ సరిహద్దులో రైతుల పోరాటాలు ఉధృతం అయ్యే అవకాశం ఉంది. మూడు రకాల పప్పు ధాన్యాలు, మొక్కజొన్న, పత్తిని పాత ఎంఎస్‌పీకి కొనుగోలు చేయాలన్న ప్రభుత్వం ఐదేళ్ల ప్రతిపాదనను తిరస్కరించిన

వివరాలు 2లో...

# విజయమే లక్ష్యంగా...

### బిజెపి విజయ సంకల్పయాత్ర ప్రారంభం

**నారాయణపేట,ఫిబ్రవరి20 (వెలుతురు):**

- కృష్ణానది ఒడ్డున కిషన్ రెడ్డి ప్రత్యేక పూజలు
- ఉమ్మడి వరంగల్ మినహా అన్ని జిల్లాల్లో యాత్రలు
- ఎవరితోనూ పొత్తు ఉండదని మరోమారు స్పష్టీకరణ



పార్లమెంటు ఎన్నికలు ముంచుకొస్తున్న వేళ తెలంగాణలో అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల యుద్ధానికి సిద్ధమవుతున్నాయి. అధికార కాంగ్రెస్‌తో పాటు ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ ఎన్నికల రణభేరి మోగిస్తోంది. మరోవైపు మొన్న జరిగిన అసెంబ్లీ ఎన్నికలో 14 శాతం ఓట్లు, 8 అసెంబ్లీ సీట్లు సాధించి జోష్ మీదున్న బీజేపీ కూడా ఎన్నికల సమర సన్నాహాలు చేస్తోంది. తెలంగాణలో పార్లమెంట్ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా చేపట్టిన భాజపా విజయ సంకల్పయాత్రలు ప్రారంభం

వివరాలు 2లో...

## సుప్రీంలో బిజెపికి చెంపదెబ్బ

- చండీఘడ్ మేయర్ ఎన్నిక రద్దు
- ఆప్ అబ్యర్థిని విజేతగా ప్రకటించి ధర్మాసనం
- రిటర్నింగ్ అధికారి తీరుపై ధర్మాసనం ఆగ్రహం



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి20(వెలుతురు):** చండీగఢ్ మేయర్ ఎన్నిక చెల్లదంటూ దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెల్లడించింది. ఈ మేరకు చండీగఢ్ మేయర్ ఎన్నిక ఫలితాలపై సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ఆప్ అభ్యర్థిని విజేతగా ప్రకటిస్తూ తీర్పు వెలువరించింది. రిటర్నింగ్ అధికారి బ్యాలెట్ పత్రాలను తారుమారు

వివరాలు 2లో...

# వన జాతరకు సర్వం సిద్ధం

- మేడారంలో సందడే సందడి
- భారీగా తరలివస్తున్న భక్తులు
- నేటినుంచి నాలుగురోజుల జాతర
- పూనుగొండ్ల పగిడిద్దరాజు గుడిలో ప్రత్యేక పూజలు
- గద్దెల వద్దకు బయలుదేరిన పగిడిద్దరాజు
- భారీగా ఏర్పాట్లు చేసిన ప్రభుత్వం



**ములుగు, ఫిబ్రవరి20 (వెలుతురు):** సమ్మక్క, సారలమ్మ జాతర బుధవారం ప్రారంభం కానున్న నేపథ్యంలో.. వనదేవరుడు, సమ్మక్క భర్త పగిడిద్దరాజును, ఆయన తనయుడు జంపన్నను మంగళవారం మేడారం తీసుకెళ్లేందుకు పూజారులు ఏర్పాట్లు చేశారు. గిరిజన సంప్రదాయాలు, శివసత్తుల పూనకాల మధ్య మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం పూనుగొండ్లలోని దేవాలయం నుంచి పగిడిద్దరాజును, ములుగు జిల్లా కన్నెపల్లి నుంచి జంపన్నను మేడారం తీసుకెళ్లనున్నారు. బుధవారం నాడు కన్నెపల్లి నుంచి సారలమ్మను గద్దె పైకి తీసుకురానున్న నేపథ్యంలో... అమ్మవార్లను దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. అమ్మ వార్లకు తులాభరంతో బంగారం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అదే విధంగా వడిబియ్యం, చీర, సారెతో పూజలు చేశారు. భక్తులు పూనకాలతో పరవశిస్తు అమ్మవార్ల దీవెనల కోసం గద్దెల వద్దకు చేరుకుంటున్నారు మేడారం జన సందోహంతో ఆధ్యాత్మిక భక్తి భావనతో పులకించి పోతోంది. మహబూబాబాద్ జిల్లాలోని గంగారం మండలం పూనుగొండ్లలో పగిడిద్దరాజు గుడిలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం పగిడిద్దరాజు మేడారం బయలుదేరారు. పగిడిద్దరాజును తీసుకుని కోయ పూజారులు అటవీ మార్గంలో కాలినడకన మేడారంకు బయలుదేరి వెళ్లనున్నారు. రాత్రికి పగిడిద్దరాజు మేడారంకు రానున్నారు. తెలంగాణ కుంభమేళాగా పేరుగాంచిన సమ్మక్క - సారలమ్మ మేడారం జాతర ఈనెల 21 నుంచి నాలుగు రోజుల పాటు ఘనంగా జరుగనుంది. ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో రెండేళ్లకోసారి జరుగుతుంది. జాతరకు ఒకరోజు ముందే పగిడిద్దరాజును మేడారంకు తీసుకువస్తారు. అనంతరం సారలమ్మ, గోవింద రాజును గ్దదెకు

వివరాలు 2లో...

# తెలంగాణలో 3 రాజ్యసభ సీట్లు ఏకగ్రీవం

- రేణుకాచౌదరి, అనిల్, వద్దిరాజుల ఎన్నిక



**హైదరాబాద్,ఫిబ్రవరి20(వెలుతురు):** రాజ్యసభ ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ గడువు మంగళవారం సాయంత్రం ముగియడంతో తెలంగాణ నుంచి పోటీలో ఉన్న ముగ్గురు అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్రంలో 3 స్థానాలకు కాంగ్రెస్ నుంచి ఇద్దరు, బీఆర్ఎస్ నుంచి ఒకరు బరిలో నిలవగా.. ఎన్నిక ఏకగ్రీవమైంది. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులుగా రేణుకా చౌదరి, అనిల్ కుమార్ యాదవ్, బీఆర్ఎస్ నుంచి వద్దిరాజు రవిచంద్ర నామినేషన్లు దాఖలు చేశారు. అలాగే శ్రమజీవి పార్టీ తరఫున జాజుల భాస్కర్, భోజరాజు కోయల్కర్, స్వతంత్ర అభ్యర్థిగా కిరణ్ రాథోడ్ లు నామినేషన్లు వేశారు. అయితే, రాజ్యసభ అభ్యర్థిగా పోటీ చేయాలనుకునే ఒక్కో అభ్యర్థికి కనీసం 10 మంది ఎమ్మెల్యేలు సంతకాలు చేయాల్సి ఉంటుంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులకు మినహా మిగిలిన ముగ్గురికీ మద్దతుగా ఎమ్మెల్యేలెవరూ సంతకాలు చేయలేదు. ఈ క్రమంలో ఆ ముగ్గురి నామినేషన్లను రిటర్నింగ్ అధికారి తిరస్కరించారు. కేంద్ర ఎన్నికల సంఘం అనుమతి తర్వాత కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రిటర్నింగ్ అధికారి ప్రకటించనున్నారు. రేణుకాచౌదరి రాజకీయాల్లో ఫైర్ బ్రాండ్‌గా పేరు పొందారు. 1984లో టీడీపీ ద్వారా

వివరాలు 2లో...

# రూ.8,437 కోట్ల

## జీహెచ్‌ఎంసీ వార్షిక బడ్జెట్

- వాడీవేడిగా రెండోరోజు సమావేశాలు
- అధికారుల తీరుపై మండిపడ్డ కార్పోరేటర్లు

**హైదరాబాద్,ఫిబ్రవరి20(వెలుతురు):** ఆర్థిక సంవత్సరం 2024 -25కి సంబంధించిన బడ్జెట్‌ను జీహెచ్‌ఎంసీ మేయర్ విజయలక్ష్మి ప్రవేశపెట్టారు. రూ.8,437 కోట్ల వార్షిక బడ్జెట్‌ను జీహెచ్‌ఎంసీ కౌన్సిల్‌లో ఆమె సమర్పించారు. సాధారణ బ్జడెట్ రూ.7937 కోట్లు కాగా డబుల్ బెడ్ రూం ఇళ్ల కోసం రూ.500 కోట్ల బడ్జెట్ కేటాయించినట్టు ఆమె వివరించారు. జీహెచ్‌ఎంసీ కౌన్సిల్‌లో బ్జడెట్‌పై చర్చ

వివరాలు 2లో...

GeneralNEWS

## మార్చిలో ఎన్నికల నోటిఫికేషన్..!

మొదటిపేజీ తరువాయి..

గత లోక్‌సభ ఎన్నికలకు 2019 మార్చి 10న షెడ్యూల్‌ను ప్రకటించారు. ఏప్రిల్ 11 నుంచి మే 19వ తేదీ వరకు ఏడు దశల్లో పోలింగ్ జరిగింది. మే 23న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను ప్రకటించారు. ఈసారి కూడా ఏప్రిల్-మే నెలల్లోనే ఎన్నికలు నిర్వహించేలా ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేస్తోంది. షెడ్యూల్ ప్రకటించగానే ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుంది. ఈ నేపథ్యంలో లోక్‌సభ, పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు ఈసీ గత కొన్ని రోజులుగా రాష్ట్రాల్లో వరుస పర్యటనలు చేస్తున్న విషయం తెలిసిందే. రాజకీయ పార్టీలు, స్థానిక అధికారులతో సమావేశాలు నిర్వహించిన అధికారులు షెడ్యూల్‌ను సిద్ధం చేసినట్లు సమాచారం. మార్చి 9వ తేదీ తర్వాత ఈసీ ఎన్నికల తేదీలను ప్రకటించే అవకాశాలు కన్పిస్తున్నాయి. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. దేశవ్యాప్తంగా లోక్‌సభతోపాటు ఆంధ్రప్రదేశ్, ఒడిశా, అరుణాచల్‌ప్రదేశ్, సిక్కిం అసెంబ్లీలకు ఈ ఏడాది మేలోగా ఎన్నికలు జరగాల్సి ఉంది. వీటితో పాటు జమ్మూకశ్మీర్‌లోనూ అసెంబ్లీ ఎన్నికలను నిర్వహించాలని ఈసీ భావిస్తోంది. ఇందుకోసం మార్చి 8-9 తేదీల్లో కేంద్ర ప్రభుత్వ అధికారులతో ఈ బృందం సమావేశం కానున్నట్లు సదరు వర్గాలు పేర్కొన్నాయి. జమ్మూకశ్మీర్‌లో భద్రతా పరిస్థితులు, బలగాలపై అందులో చర్చించనున్నారు. ఆ తర్వాత మార్చి 12-13 తేదీల్లో ఈసీ బృందం జమ్మూకశ్మీర్‌లో పర్యటించి క్షేత్రస్థాయిలోని పరిస్థితులను పరిశీలించనుంది. లోక్‌సభతో పాటే స్థానిక అసెంబ్లీ ఎన్నికలను నిర్వహించే అవకాశాలపై ఒక అంచనాకు రానున్నట్లు తెలుస్తోంది. ఆ తర్వాత మార్చి రెండోవారంలో సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించనున్నట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.

## నేడు యథావిధిగా రైతుల నిరసనలు

మొదటిపేజీ తరువాయి..

రైతులు బుధవారం తమ నిరసనలను పునఃప్రారంభించనున్నారు. ఈ తరుణంలో పోలీసులు మోహరించిన టియర్ గ్యాస్ షెల్స్‌ను ఎదుర్కొనేందుకు ఇనుప కవచాలు, జనపనార బస్తాలతో శంభు సరిహద్దులో - పంజాబ్, హర్యానా రైతులు మోహరించారు. పోలీసులు తమ పోరాటాన్ని అడ్డుకుంటున్నారని భావించిన రైతులు ఈ ఏర్పాట్లు చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో దేశ రాజధానిలో జర్నలిస్టులకు అధికారులు ఐడీ కార్డులు జారీ చేశారు. శాంతియుతంగా ఢిల్లీ వైపు పాదయాత్ర కొనసాగిస్తామని రైతులు చెబుతున్నారు. మాపై బల ప్రయోగం చేయవద్దని ప్రభుత్వానికి



విజ్ఞప్తి చేస్తున్నాం. మేము శాంతి యుతంగా నిరసన తెలియ జేయాలనుకుంటున్నాం' అని రైతులు చెప్పారు. ప్రభుత్వం రెండు లేదా మూడు పంటలకు మాత్రమే కనీస మద్దతు ధరను వర్తింపజేయడం, మిగతా పంటలు పండిస్తున్న రైతులను పట్టించుకోక పోవడం సరైనది కాదు అని రైతు సంఘాల నేత సర్వన్ సింగ్ పంధేర్ అన్నారు. 200 సంఘాల మద్దతుతో రైతులు ఫిబ్రవరి 13న ఢిల్లీలో పాదయాత్ర ప్రారంభించారు. శంభు సరిహద్దు వద్ద గుమిగూడిన నిరసనకారులపై పోలీసులు టియర్ గ్యాస్ ప్రయోగించారు. మార్కెట్‌లోని అస్థిరతల నుంచి రైతులను రక్షించేందుకు ఉద్దేశించిన ఎంఎస్‌పీపై చట్టం చేయాలనే ప్రధాన డిమాండ్‌తో రైతులు నిరసనలు తెలుపుతున్నారు.

రుణమాఫీ, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని, రైతులు, రైతు కూలీలకు పెన్షన్ ఇవ్వాలని, గతంలో జరిగిన నిరసనలో తమపై పెట్టిన పోలీసు కేసులను ఉపసంహరించు కోవాలని, ఉత్తరప్రదేశ్‌లోని లఖింపూర్ ఖేరీలో మృతి చెందిన రైతులకు న్యాయం చేయాలని కర్షకులు కోరుతున్నారు.

## అమాయకురాలు కాదు... అవినీతి తిమింగలం

మొదటిపేజీ తరువాయి..

పట్టాదార్ పాస్ బుక్ జారీ చేసేందుకు ఓ వ్యక్తి నుంచి తహసీల్దార్ సత్యనారాయణ లంచం డిమాండ్ చేయగా.. బాధితుని ఫిర్యాదుతో పక్కా ప్రణాళికతో ఏసీబీ అధికారులు ఆ అధికారి పని పట్టారు. ఎమ్మార్వో డ్రైవర్ రూ.10 లక్షలు లంచం తీసుకుంటుండగా అదుపులోకి తీసుకున్నారు. ఎమ్మార్వో తీసుకోమంటేనే తాను డబ్బు తీసుకున్నట్లు డ్రైవర్ అంగీకరించినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు.

## సుప్రీంలో బిజెపికి చెంపదెబ్బ

మొదటిపేజీ తరువాయి..

చేసేందుకు ఉద్దేశపూర్వంగా వ్యవహరించారని స్పష్టంగా తెలుస్తోందని తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ఆ ఎన్నికలో అక్రమాలు జరిగాయంటూ దాఖలైన పిటిషన్‌ను విచారించిన కోర్టు.. ఆ ఎన్నిక చెల్లుబాటు కాదని వ్యాఖ్యానించింది. రిటర్నింగ్ అధికారి అనిల్ మసీహ్ వ్యవహరించిన తీరుపై తీవ్రంగా స్పందించింది. జనవరి 30న నిర్వహించిన చండీగఢ్ మేయర్ ఎన్నికలో తగినంత సంఖ్యా బలం(16) లేకపోయినా భాజపా మేయర్ అభ్యర్థి మనోజ్ సోంకర్ అనూహ్య విజయం సాధించారు. మెజారిటీకి అవసరమైన కౌన్సిలర్ల బలం(20) ఉన్నప్పటికీ ఆప్- కాంగ్రెస్ కూటమి అభ్యర్థి కుల్దీప్ కుమార్ ఓటమి పాలయ్యారు. ఎన్నికల్లో పట్టపగలే మోసం జరిగిందని దిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ విమర్శించారు. ఎన్నికల అధికారి బ్యాలెట్ పత్రాలపై పెన్నుతో ఏదో రాసి.. వాటిలో కొన్నింటిని చెల్లకుండా చేశారని కాంగ్రెస్, ఆప్‌లు ఆరోపించాయి. ఆప్ కౌన్సిలర్ వేసిన పిటిషన్‌ను విచారించిన భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్, జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాల ధర్మాసనం ఈ తీర్పు వెలువరించింది. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి కొట్టివేత గుర్తు పెట్టిన బ్యాలెట్ పేపర్లను పరిశీలించింది. 'ఈ బ్యాలెట్ పత్రాలు పాడైపోయినవని మీరు చెప్పారు. అది ఎక్కడో చూపించగలరా..?' అంటూ మసీహ్‌ను ప్రశ్నించింది. 'అవి ఆప్ అభ్యర్థి పేరిట వచ్చాయి. వీడియోలో కనిపిస్తున్నట్లు వాటిపై ఈ అధికారి గీత గీశారు ' అని వెల్లడించిన సీజేఐ.. ఆ పేపర్లను కోర్టులోని ఇరుపక్షాల న్యాయవాదులకు చూపించారు. అలాగే లెక్కింపు ప్రక్రియకు సంబంధించిన వీడియోను మరోసారి వీక్షించారు. మాసిహ్ చర్యలపై తీవ్ర అసహనం వ్యక్తం చేసిన సీజేఐ.. లెక్కింపు వీడియోను మరోసారి ప్లే చేయమన్నారు. 'అందరినీ ఈ వీడియో చూడనివ్వండి. జీవితంలో వినోదం మంచిదే. అయితే కౌంటింగ్ వీడియో మొత్తం వేయాల్సిన పనిలేదు. అంతా వేస్తే.. సాయంత్రం 5.45 గంటల వరకు ఇక్కడే ఉంటాం' అని సరదాగా మాట్లాడారు. ఎనిమిది చెల్లిన ఓట్లు ఉన్నాయని, కాబట్టి మళ్లీ లెక్కించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. చండీగఢ్ మేయర్ ఎన్నికల్లో ఓట్ ట్యాంపరింగ్ ఆరోపణలపై మంగళవారం విచారణ జరిపిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. జనవరి 30న చండీగఢ్ మేయర్ ఎన్నికలు జరిగాయి. కార్పొరేషన్‌లో 35 మంది కౌన్సిలర్లు ఉండగా అందులో ఆప్-కాంగ్రెస్ కూటమికి 20, బీజేపీకి 14, ఎస్ఏడీకి ఒక కౌన్సిలర్ ఉన్నారు.

మేయర్ ఓటింగ్ సందర్భంగా ఆప్-కాంగ్రెస్ కూటమికి చెందిన 8 మంది కౌన్సిలర్ల ఓట్లను చెల్లనివిగా ఆర్వో అనిల్ మాసిహ్ ప్రకటించారు. బీజేపీ మేయర్ అభ్యర్థి మనోజ్ సోంకర్‌ను విజేతగా ప్రకటించారు. బ్యాలెట్ పేపర్లపై రిటర్నింగ్ అధికారి అనిల్ మాసిహ్ ఎక్స్ మార్క్ పెడుతున్నట్లు అక్కడే ఉన్న సీసీటీవీ ఫుటేజీలో రికార్డ్ అయింది. ఈ వీడియో బయటకు రావడంతో రాజకీయంగా తీవ్ర కలకలం రేగింది. దీంతో ఆప్ కౌన్సిలర్ సుప్రీం కోర్టును ఆశ్రయిం చారు. ఈ వ్యవహారం పై మంగళవారం మరోసారి విచారణ జరిపిన ధర్మాసనం అనిల్ మాసిహ్ పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఉద్దేశపూర్వకంగానే బ్యాలెట్ పేపర్లను కొట్టివేశారని మండిపడింది. ఈ క్రమంలో ఆ 8 ఓట్లను కూడా లెక్కలోకి తీసుకుని మరోసారి మొత్తం ఓట్ల లెక్కింపు చేపట్టాలని ఆదేశాలు జారీ చేసింది.

# ఆర్టికల్ 370 రద్దుతో రాష్ట్రంలో నవ్యపథం

మొదటిపేజీ తరువాయి..

ఏర్పాటయ్యాయని వెల్లడించారు. అప్పట్లో పాఠశాలలకు నిప్పంటించేవారని, ఇప్పుడు అలంకరిస్తున్నారని అన్నారు. బాలీవుడ్ నటి యామీ గౌతమ్ నటించిన ఆర్టికల్ 370 గురించి ప్రధాని మోదీ ప్రస్తావించారు. మంగళవారం జమ్మూ పర్యటనకు వెళ్లిన ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈసందర్భంగా ప్రభుత్వ పథకాల లబ్దిదారులతో సంభాషించారు. అలాగే మౌలానా ఆజాద్ స్టేడియంలో నిర్వహించిన సభలోనూ ప్రసంగించారు. ఆర్టికల్ 370పై ఈ వారంలో ఒక సినిమా విడుదల కానుందని విన్నాను. అది మంచి విషయం. ప్రజలు వాస్తవాలు తెలుసుకునేందుకు ఆ చిత్రం ఉపకరించనుంది. జమ్మూ కశ్మీర్ అభివృద్ధికి ఆర్టికల్ 370 ప్రధానమైన అవరోధంగా ఉండేది. దానిని భాజపా తొలగించడంతో ఇప్పుడు ఈ ప్రాంతం సమతుల్యత దిశగా కదులుతోంది. దాని రద్దు తర్వాతే ఇక్కడి ప్రజలు రాజ్యాంగంలో పేర్కొన్న సామాజిక న్యాయాన్ని పొందుతున్నారని మోదీ అన్నారు. అలాగే వారసత్వ రాజకీయాలపైనా విమర్శలు చేశారు. ఈ క్రమంలో జమ్మూ కశ్మీర్‌లో ఈరోజు 32 వేల కోట్ల రూపాయల విలువైన ప్రాజెక్టులను ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన బహిరంగ సభలో ప్రసంగిస్తూ కుటుంబ రాజకీయాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. జమ్మూకశ్మీర్ అనేక దశాబ్దాలుగా రాజవంశ రాజకీయాల బాధితురాలిగా ఉందన్నారు. వంశపారంపర్య రాజకీయాలు చేస్తున్న వారు తమ ప్రయోజనాల కోసం మాత్రమే చూసుకున్నారు తప్ప మీ ప్రయోజనాలను పట్టించుకోలేదని పేర్కొన్నారు. వంశపారంపర్య రాజకీయాల వల్ల ఎక్కువగా నష్టపోయింది యువతేనని వెల్లడించారు. తమ కుటుంబం గురించి మాత్రమే ఆలోచించే వ్యక్తులు మీ కుటుంబం గురించి చింతించరని చెప్పారు. ఆర్టికల్ 370ని ప్రధాని మోదీ గోడతో పోల్చారు. ఆ గోడను బీజేపీ ప్రభుత్వం తొలగించిందని చెప్పారు. ఇప్పుడు జమ్మూ కాశ్మీర్ సమతుల్య అభివృద్ధి దిశగా కొనసాగుతోందన్నారు. ఈరోజు వందలాది మంది యువతకు ప్రభుత్వ నియామక పత్రాలు అందజేశామని మోదీ గుర్తు చేశారు. ఈ క్రమంలోనే జమ్మూకశ్మీర్ ఈ వంశపారంపర్య రాజకీయాల నుంచి విముక్తి లభిస్తుందన్న సంతృప్తి ఉందన్నారు. జమ్మూకశ్మీర్‌కు ప్రధానమంత్రి నరేంద్రమోదీ మంగళవారం భారీ కానుకలు అందించారు. సంగల్దాన్ స్టేషన్- బారాముల్లా స్టేషన్ మధ్య మొదటి ఎలక్ట్రిక్ రైలును ప్రధాని ప్రారంభించారు.

బారాముల్లా- శ్రీనగర్-బనిహాల్-సంగల్దాన్ సెక్షన్ (185.66 కి.మీ) మధ్య కొత్త రైలు మార్గంతో సహా జమ్మూ, కాశ్మీర్‌లో వివిధ రైల్వే ప్రాజెక్టులను మోదీ ప్రారంభించారు. ఎంఎ స్టేడియంలో పదేళ్ల క్రితం డిసెంబర్ 2013లో జమ్మూలోని ఇదే స్థలంలో లాల్కర్ ర్యాలీని ఉద్దేశించి ఇచ్చిన హామీలను గుర్తు చేశారు. జమ్మూలో కూడా ఐఐటీ, ఐఐఎం వంటి విద్యాసంస్థలు ఎందుకు నిర్మించలేరని అప్పుడు ప్రశ్నించామని... ఇప్పుడు ఆ హామీలను నెరవేర్చామని స్పష్టం చేశారు. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన రైల్వే వంతెనను ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో నిర్మించామని చెప్పారు. జమ్మూ కాశ్మీర్‌కు రాష్ట్రానికి చెందిన రెండు ఎయిమ్స్, ఐఐటి, ఐఐఎంలు వచ్చాయి. జమ్మూ కాశ్మీర్‌లో సామాజిక న్యాయం కొత్త అధ్యాయం ప్రారంభమైంది. గుజ్జర్లు, పహారీలు, ఎస్టీలు, ఎస్సీలు, కాశ్మీరీ పండిట్లు, పశ్చిమ పాకిస్తాన్ నుంచి వచ్చిన శరణార్థులు రాష్ట్రంలో తమ హక్కులను పొందారని గుర్తు చేశారు. ఆర్టికల్ 370' సినిమా విషయానికొస్తే.. ఆదిత్య సుహాస్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఆర్టికల్ 370 నేపథ్యంలో కశ్మీర్‌లో జరిగిన పరిస్థితుల ఆధారంగా ఈ సినిమా రూపొందుతోంది. ఇటీవల విడుదలైన ట్రైలర్ ఆకట్టుకుంటోంది. ఇందులో ఓ పవర్‌ఫుల్ ఇంటెలిజెన్స్ ఏజెంట్‌గా యాక్షన్ అవతారంలో కనిపిస్తూ ఆకట్టుకోనుంది యామీ. జియో స్టూడియోస్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో ప్రియమణి కీలకపాత్ర పోషిస్తున్నారు. ఈనెల 23న ఈ చిత్రం విడుదల కానుంది.

# విజయమే లక్ష్యంగా...

మొదటిపేజీ తరువాయి..

అయ్యాయి. రాష్ట్రంలోని అత్యధిక లోక్‌సభ స్థానాల్లో గెలుపే లక్ష్యంగా పార్టీ నేతలు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. నారాయణపేట జిల్లా కృష్ణాలో భాజపా రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఈ యాత్రను ప్రారంభించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మక్తల్‌లో కృష్ణా నది వద్ద కృష్ణమ్మ విగ్రహానికి పూజలు చేసి బీజేపీ విజయ సంకల్ప యాత్రను పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నేతలు డీకే అరుణ, ఏపీ జితేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ప్రధాని మోదీ తెలంగాణకు వచ్చి సమ్మక్క, సారక్క గిరిజన యూనివర్సిటీకి శంఖుస్థాపన చేస్తారని తెలిపారు. పదేళ్ళలో 102 రోడ్ షోలు ఇతర కార్యక్రమాలు ఉంటాయి. మార్చి 2న ఇవి ముగియనున్నాయి. కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం సాధించిన విజయాలతో పాటు కాంగ్రెస్ కుంభకోణాలు, భారాస ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు తెలియజేస్తామని భాజపా నేతలు తెలిపారు. ఈ సందర్భంగా జైశ్రీరామ్ నినాదాలు మిన్నంటాయి. మోదీ నినాదాలు కూడా మిన్నంటాయి. ఇదిలా వుంటే రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ పొత్తు పెట్టుకుంటాయని జోరుగా ప్రచారం జరుగుతోంది. అయితే బీఆర్ఎస్‌తో బీజేపీ పొత్తు ఉండదని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మరోమారు స్పష్టం చేశారు. ఈ కీలక సమయంలో బీజేపీ, బీఆర్ఎస్ పొత్తు పెట్టుకుని పార్లమెంటు ఎన్నికల్లో పోటీ చేస్తాయంటూ కొద్ది రోజులుగా ఓ ప్రచారం జోరుగా జరుగుతోంది. బీజేపీ, బీఆర్ఎస్‌లు ఈ పొత్తు



ప్రచారానికి ఎంత గట్టిగా బ్రేకులు వేయాలని చూస్తున్నా అది ఆగడం లేదు. రెండు పార్టీలు ఈ వార్తలను కొట్టి పారేస్తున్నప్పటికీ అది ఇప్పటికే జనంలోకి బలంగా వెళ్లిపోయింది. డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటేనన్న ప్రచారం, నినాదం ఆ రెండు పార్టీలను బాగా దెబ్బ తీసింది. ఇప్పుడు ఏకంగా పొత్తు వరకు ప్రచారం వెళ్లిపోవడంతో రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో డ్యామేజ్ మరింత ఎక్కువగా ఉంటుందని బీఆర్ఎస్, బీజేపీ భయపడుతున్నాయి. బీఆర్ఎస్‌తో పొత్తు ఉండదని బీజేపీ చాలా బలంగా చెబుతోంది. ఈ పొత్తుల ప్రచారానికి ఎలాగైనా ఫుల్‌స్టాప్ పెట్టాలని బీజేపీ భావిస్తోంది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్‌తో పొత్తు వార్తలపై తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మండిపడ్డారు. ఇదంతా కుట్రపూరిత ప్రచారం అంటూ ఆయన ఆరోపించారు.

కేంద్రం చేసిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను యాత్రల్లో ప్రజలకు వివరిస్తామని చెప్పారు. గతంలో బీఆర్ఎస్ చేసిందేమీ లేదు. కాంగ్రెస్ చేయబోయేది ఏమీ లేదు. బీజేపీపై ప్రజలకు విశ్వాసం ఉంది. తెలంగాణలో ఒంటరిగా పోటీ చేసి మెజార్టీ ఎంపీ సీట్లు గెలుస్తాం. కంటి వైద్యం కోసమో కాంగ్రెస్ అధిష్టానాన్ని కలవడం కోసమో కేసీఆర్ ఢిల్లీ వెళ్తున్నట్లు ఉంది. బీఆర్ఎస్‌తో మాకు పొత్తు ప్రసక్తే లేదు' అని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఒక్క వరంగల్ తప్ప రాష్ట్రంలోని 17 ఎంపీ నియోజకవర్గాల్లో బీజేపీ విజయసంకల్ప యాత్రలు క్లస్టర్ల వారిగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన శంఖారావం పూరించారు. ఆ పార్టీ రాష్ట్రాన్ని ఐదు క్లస్టర్లుగా విభజించి యాత్రలను కొనసాగించనుంది. 17 పార్లమెంటు నియోజకవర్గాలు, 114 అసెంబ్లీ సెగ్మెంట్లలో 5,500 కి.మీ మేర యాత్రలు నిర్వహించనున్నారు. 106 సమావేశాలు,

## రూ.8,437 కోట్ల జీహెచ్ఎంసీ వార్షిక బడ్జెట్

మొదటిపేజీ తరువాయి..

జరిగింది. జీహెచ్ఎంసీ బ్జడెట్ లెక్కలో స్పష్టత కనిపించడం లేదని ఎంఐఎం ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్ విమర్శించారు. రూ.3,646 కోట్లు ఆదాయం చూపిస్తున్నారు. ఇందులో అన్ని ఖర్చులు కలిపి రూ.3,500 కోట్లు అవుతుంది. అన్ని ఖర్చులు పోగా మిగిలిన రూ.450 కోట్ల నిధులతో మాత్రమే జీహెచ్ఎంసీ నడుస్తుందా?' అని ప్రశ్నించారు. జీహెచ్ఎంసీలో ఆదాయం కంటే ఖర్చులు ఎక్కువగా ఉన్నాయని, రూ.3 వేల కోట్లు జీహెచ్ఎంసీకి ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయించాలని డిమాండ్ ఉన్నా రూ.1100 కోట్లు మాత్రమే తక్కువ పెట్టారు.

జీహెచ్ఎంసీలో అదనపు ఖర్చుల కోసం ఆదాయ మార్గాలు ఏమైనా ఉన్నాయా అని ప్రశ్నించారు. జీహెచ్ఎంసీ రూ.128 కోట్లు మాత్రమే లోన్స్ రూపంతో తెచ్చే పరిస్థితి ఉందని లెక్కలు చెప్తున్నాయని మ్మెల్యే మాజీద్ హుస్సేన్ ప్రస్తావించారు. జీహెచ్ఎంసీ బ్జడెట్ పుస్తకం అనేది లెక్కల కోసం మాత్రమేనా?. రూ.6 వేల కోట్ల లోన్ బకాయిలు ఉన్నాయి వాటి పరిస్థితి ఏంటి?. అప్పులు, లోన్స్ చూశాక జీహెచ్ఎంసీ పటిష్ఠంగా ఉందని ఎలా నమ్మాలి. ఆయా డివిజన్లకు 11వందల కోట్ల బిల్లులు చెల్లించాల్సి ఉందని మ్మెల్యే మాజీద్ హుస్సేన్ అన్నారు. నిర్లక్ష్యంగా ఉన్న అధికారుల చర్యలు తీసుకునేందుకు జీహెచ్ఎంసీ సిద్ధమైంది. వివరాలు సేకరించాలని మేయర్ విజయలక్ష్మి నిర్ణయం తీసుకున్నారు. ఎక్కువకాలం పనిచేస్తున్న, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న వారి లెక్కలు తయారు చేయాలని మేయర్ ఆదేశించారు. లిస్ట్ రెడీ అయ్యాక ప్రభుత్వానికి అందించాలని లేదా ఇతర శాఖలకు పంపాలని జీహెచ్ఎంసీ యోచిస్తోంది. మరోవైపు జీహెచ్ఎంసీలో పని చేస్తున్న 45 మంది రిటైర్డ్ ఉద్యోగులను తొలగిస్తూ కౌన్సిల్ తీర్మానం చేసింది. కార్పొరేటర్లకు, ప్రజాసమస్యలపై రెస్పాన్స్ అవ్వని ఆఫీసర్స్‌ను బదిలీ చేస్తూ ఈ తీర్మానం చేసింది. రెండో రోజు జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశం హాట్‌హాట్‌గా సాగింది. మంగళవారం ఉదయం మేయర్ గద్వాల విజయలక్ష్మి అధ్యక్షతన బల్దియా సర్వసభ్య సమావేశం మొదలైంది. ఈ సందర్భంగా సభలో కౌన్సిలర్లు ప్రజా సమస్యలను ఏకరువు పెడుతున్నారు. హైదరాబాద్‌లో కుక్కల బెడద తీవ్రంగా ఉందని.. కుక్కలు కరిసి జనాల ప్రాణాలు పోతున్నాయని.. అయినా పట్టించుకోరా అంటూ అధికారులను కార్పొరేటర్లు నిలదీశారు. సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో స్పోర్ట్స్ తక్కువ, ఫంక్షన్స్ ఎక్కువ అని కార్పొరేటర్లు చెబుతున్నారు. కార్పొరేటర్లను అధికారులు పట్టించుకోవడం లేదంటూ బీజేపీ కార్పొరేటర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు కార్పొరేటర్లను కుక్కల కన్నా హీనంగా చూస్తున్నారన్నారు. కనీసం అధికారులు తమ ఫోన్లు కూడా ఎత్తడం లేదని కార్పొరేటర్ల ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు తామ ఏమి సమాధానం చెప్పాలని కార్పొరేటర్లు ప్రశ్నించారు.

## వన జాతరకు సర్వం సిద్ధం

మొదటిపేజీ తరువాయి..

తీసుకువస్తారు. ఫిబ్రవరి 22న సమ్మక్క దేవతను గద్దెకు తీసుకువస్తారు. ఫిబ్రవరి 23న భక్తులు మొక్కులు తీర్చుకుంటారు. ఫిబ్రవరి 24న దేవతల వనప్రవేశం ఉండగా... ఫిబ్రవరి 28వ జాతర పూజలు ముగింపు కార్యక్రమాలు ఉంటాయి.మంగళవారం ఉదయం పూనుగొండ్ల సమీపంలోని దేవుడి గుట్ట నుంచి పగిడిద్దరాజును తీసుకొచ్చి దేవాలయంలో ప్రతిష్ఠిస్తారు. శాంతి పూజా కార్యక్రమాల అనంతరం పెన్క వంశీయులు పడగ రూపంలో పగిడిద్దరాజును పెళ్లికొడుకుగా సిద్ధం చేసారు. ఆ పడగ రూపాన్ని గ్రామంలో ఊరేగించిన అనంతరం పూనుగొండ్ల అడవుల నుంచి మేడారానికి కాలినడకన తీసుకెళ్లే కార్యక్రమం మొదలు పెట్టారు. పూజారి జగ్గారావుతోపాటు మరో పదిమంది పూజారులు, పలువురు భక్తులు పగడిద్దరాజు వెంట బయలు దేరుతారు. మధ్యలో గోవిందరావుపేట మండలం కర్లపల్లి లక్ష్మీపురం లోని పెన్క వంశీయుల వద్ద మంగళవారం రాత్రి విడిది కల్పిస్తారు. బుధవారం ఉదయాన్నే బయలుదేరి రాత్రి సారలమ్మ చేరుకునే సమయానికి పగిడిద్దరాజును మేడారం గద్దెకు చేరుస్తామని ప్రధాన పూజారులు చెప్పారు. సమ్మక్క తనయుడు, సారలమ్మ సోదరుడైన జంపన్నను కన్నెపల్లి నుంచి పోలెబోయిన వంశస్థులు మేడారం తీసుకు రానున్నారు. పూజారి పోలెబోయిన సత్యం ఆయన కుటుంబ సభ్యులు, గ్రామస్థులు మంగళవారం సాయంత్రం 5 గంటలకు కన్నెపల్లి నుంచి బయలుదేరి రాత్రి 7 గంటలకు మేడారానికి చేరుకుంటారు.

ఆ వెంటనే లక్షల మంది భక్తుల మధ్య జంపన్నను గద్దెపై ప్రతిష్ఠిస్తారు. మహాజాతరకు తెలంగాణ నుంచే కాకుండా ఏపీ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాలనుంచి లక్షలాదిగా వచ్చే భక్తులతో మేడారం కుంభమేలాను తలపిస్తుంది. నాలుగు రోజులపాటు గిరిజన సంప్రదాయాల ప్రకారం దీనిని నిర్వహిస్తారు. ఈనెల 21న కన్నెపల్లి నుంచి సారలమ్మను, ఏటూరునాగారం మండలం కొండాయి నుంచి గోవిందరాజులను పూజారులు తీసుకొచ్చి గద్దెలపై ప్రతిష్ఠిస్తారు. దీంతో తొలిరోజు ఘట్టం పూర్తవుతుంది. 22న కీలక ఘట్టమైన సమ్మక్కను చిలుకలగుట్ట మీద నుంచి తీసుకొచ్చి గద్దెపై ప్రతిష్ఠిస్తారు. కుంకుమ భరిణె రూపంలో ఉన్న సమ్మక్క ఆగమనాన్ని చూసి భక్తులు పులకించిపోతారు. పోలీసులు, జిల్లా అధికారుల సమక్షంలో గాల్లోకి కాల్పులు జరిపి ఘన స్వాగతం పలుకుతారు. 23న సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజు, జంపన్న గద్దెలపై కొలువై భక్తులకు దర్శనమిస్తారు. 24న దేవతల వనప్రవేశం ఉంటుంది.

## పరువు నష్ట కేసులో రాహుల్‌కు ఊరట

మొదటిపేజీ తరువాయి..

ఆరేళ్ల క్రితం నాటి ఈ కేసులో ఉత్తరప్రదేశ్‌లోని సుల్తాన్‌పుర్ జిల్లా కోర్టు తాజాగా బెయిల్ మంజూరు చేసింది. భారత్ జోడో న్యాయ యాత్రలో భాగంగా యూపీలోనే ఉన్న రాహుల్ కేసు విచారణ నిమిత్తం మంగళవారం కోర్టు ఎదుట హాజరయ్యారు. 2018 మే నెలలో కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి వెళ్లిన రాహుల్.. కేంద్రమంత్రి అమిత్ షాపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. నాడు బెంగళూరులో మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. రాజకీయాల్లో స్వచ్ఛంగా, నిజాయతీగా ఉంటామని చెప్పే భాజపా. ఓ హత్య కేసులో నిందితుడిని పార్టీ అధ్యక్షుడిగా ఎన్నుకుందని ఆరోపించారు. ఆ సమయంలో అమిత్ షా.. భాజపా జాతీయాధ్యక్షుడిగా ఉన్నారు. ఈ వ్యాఖ్యలు అప్పట్లో తీవ్ర దుమారం రేపాయి. ఈ క్రమంలోనే యూపీకి చెందిన భాజపా నేత విజయ్ మిశ్రా అదే ఏడాది ఆగస్టులో రాహుల్‌పై ప్రత్యేక ఎంపీ-ఎమ్మెల్యే కోర్టులో ఫిర్యాదు చేశారు. దీనిపై గతంలో పలుమార్లు న్యాయస్థానం ఆయనకు సమన్లు జారీ చేయగా రాహుల్ స్పందించలేదు. తాజాగా విచారణకు హాజరవ్వగా.. కోర్టు బెయిల్ మంజూరు చేసింది. కర్ణాటక ఎన్నికల సందర్భంగా బెంగళూరులో హోంమంత్రి అమిత్ షాపై రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలు చేశారు. ఈ క్రమంలో విజయ్ మిశ్రా అనే వ్యక్తి సుల్తాన్‌పూర్ కోర్టులో పరువు నష్టం దావా వేశారు. ఈ కేసులో సుల్తాన్ పూర్ లోని జిల్లా సివిల్ కోర్టు రాహుల్ గాంధీకి సమన్లు జారీ చేసింది. మంగళవారం ఈకేసు విచారణకు రాహుల్ గాంధీ కోర్టుకు హాజరయ్యారు. అనంతరం భారత్ జోడ్ న్యాయ్ యాత్రలో పాల్గొనేందుకు అమేథికి వెళ్లారు రాహుల్ గాంధీ. భారత్ జోడో న్యాయ్ యాత్ర మంగళవారంలో 38 వా రోజుకు చేరుకుంది. అమేథీ జిల్లాలో పురంత్ గంజ్ లతిరిగి ప్రారంభం అవుతుంది. ఈ యాత్ర రాయ్ మంగళవారం రాయ్ బరేలీ, లక్నో మీదుగా సాగనుంది. ఫిబ్రవరి 24 న కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా ఉత్తరప్రదేశ్ లోని మొరదాబాద్ నుంచి ఈ యాత్రలో చేరనున్నారు. 2024 ఏప్రిల్ మే లో లోక్ సభ ఎన్నికలు జరగాల్సి ఉండగా.. గెలుపు లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ భారత్ జోడో న్యాయ్ యాత్రను చేపట్టింది. ఉత్తరప్రదేశ్ లోని అమేథీ ఒకప్పుడు కాంగ్రెస్ కు కంచుకోట. 2019 ఎన్నికల్లో రాహుల్ గాంధీ దాదాపు 55 వేల ఓట్ల తేడాతో బీజేపీ అభ్యర్థి స్మృతి ఇరానీ చేతిలో ఓడిపోయారు. కాంగ్రెస్ కంచు కోట అమేథీని తిరిగి వశం చేసుకోవాలని కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. అంతేకాదు భారత్ జోడో న్యాయ్ యాత్ర ద్వారా పార్టీలో వచ్చే లోక్ సభ ఎన్నికల వరకు బలోపేతం చేసేందుకు కృషి చేస్తోంది.

## తెలంగాణలో 3 రాజ్యసభ సీట్లు ఏకగ్రీవం

మొదటిపేజీ తరువాయి..

రాజకీయాల్లోకి వచ్చిన ఆమె.. 1986లో హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కు జరిగిన ఎన్నికల్లో బంజారాహిల్స్ నుంచి కార్పొరేటర్ గా గెలిచారు. 1986 నుంచి 98 వరకూ రెండుసార్లు రాజ్యసభ సభ్యురాలి గా పని చేశారు. 1999, 2004లో ఖమ్మం లోక్ సభ నియోజకవర్గం నుంచి ఎన్నికయ్యారు. హెచ్ డీ దేవెగౌడ ప్రభుత్వంలో కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రిగా పని చేశారు. 2004లో కేంద్ర పర్యాటక శాఖ మంత్రిగా, 2006 నుంచి కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రిగా పని చేశారు. 2009 ఎన్నికల్లో ఖమ్మం లోక్‌సభ నుంచి పోటీచేసి నామా నాగేశ్వరరావు చేతిలో ఓటమి పాలయ్యారు. సికింద్రాబాద్ మాజీ ఎంపీ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత అంజన్ కుమార్ యాదవ్ తనయుడే అనిల్ కుమార్ యాదవ్. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ముషీరాబాద్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓడిపోయారు. 2023లోనూ అదే నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు యత్నించారు. అయితే, పార్టీలో వన్ ఫ్యామిలీ.. వన్ టికెట్ ఫార్ములా అమలుతో ఆ సీటును తండ్రి కోసం త్యాగం చేశారు. యూత్ కాంగ్రెస్ లో చురుగ్గా పని చేసి మంచి గుర్తింపు పొందడంతో రాజ్యసభ ఛాన్స్ దక్కింది.

గతంలో బండ ప్రకాష్ రాజీనామా వల్ల ఖాళీ అయిన రాజ్యసభ సీటును వద్దిరాజుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఇచ్చారు. 2022, మే 24న ఈ పదవికి ఎన్నికైన వద్దిరాజు కేవలం రెండేళ్లే ఎంపీగా కొనసాగడంతో ఆయనకు మరోసారి గులాబీ బాస్ అవకాశం కల్పించారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా వరంగల్ ఈస్ట్ స్థానం నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. అనంతరం బీఆర్ఎస్ లో చేరారు. మొత్తంగా ఇద్దరు కాంగ్రెస్, ఒక బీఆర్ఎస్ అభ్యర్థి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రిటర్నింగ్ అధికారి ప్రకటించనున్నారు.



## వాటర్ వర్క్స్ మరియు మున్సిపల్ శాఖల ఆధ్వర్యంలో
# సమస్యలు పరిష్కరించాలి
### కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్

**హైదరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 20:**
మంగళవారం రోజున మన కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ గారు ఆయిల్ సీడ్ కాలనీ లో వాటర్ వర్క్స్ మరియు మున్సిపల్ శాఖల అధికారులు థో పాద యాత్ర చేసారు కాలనీ వాసులు అనూప్ గారు, కృష్ణ అర్జున్ గారు, డా. అబ్రహీం భాయ్, సి ఎస్ వెంకటేష్ గారు, ఫయాజ్ గారు, వారి ఒక సమస్యలు తెలియ చేసారు, వీధి దీపాలు మరియు చెత్త శుభ్రపరచడం, మరియు రోడ్ ప్యాచ్ పనులు మరియు చెట్లను కత్తిరించడం మరియు వీధి కుక్కల సమస్య తెలియ చేసారు. కార్పొరేటర్ మేడమ్ అధికారులను ఫోన్ చేసి వారి ఒక సమస్య లు వెంటేనే పరిష్కరించాలని ఆదేశించారు. వాటర్ వర్క్స్ మేనేజర్ మహేందర్ రెడ్డి, మున్సిపల్ వర్క్ ఇన్స్పెక్టర్ రాము ఎస్ఎఫ్ఎ లక్ష్మీనారాయణ బిఆర్ఎస్ సీనియర్ నాయకులు మహేష్, అనీష్, అభిషేక్, సుజాత, హితేష్, జగదీష్ పలుగొనారు.

## టీజీవోఎస్ కేంద్ర సంఘం ఎన్నికలలో ఏకగ్రీవంగా ఏలూరి శ్రీనివాస రావు ఎన్నిక

**హైదరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 20:**
మంగళవారం రోజున ఎల్బీనగర్ పల్లవి గార్డెన్‌లో తెలంగాణ అధికారుల సంఘం టీజీవోఎస్ కేంద్ర సంఘానికి జరిగిన ఎలక్షన్స్ ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డ అధ్యక్షుడు శ్రీ ఏలూరి శ్రీనివాస రావు గారు ప్రధాన కార్యదర్శిగా ఏ సత్యనారాయణ మరియు కార్యవర్గ సభ్యులందరికీ టీజీవో హైదరాబాద్ జిల్లా పక్షాన శుభాకాంక్షలు తెలియజేసిన ఎంబీ.



కృష్ణ యాదవ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు మరియు. ఏమే ఖాదర్. డాక్టర్. హరికృష్ణ. శ్రీనేష్ కుమార్. రవీంద్ర కుమార్. స్వరూప రాణి. ఏంజులా రెడ్డి. పూనం. కుమార్. నాగేశ్వరరావు. డాక్టర్ సురేందర్. నరేష్. చిత్తరంజన్ రెడ్డి. డాక్టర్ సునీత జోషి రెడ్డప్ప తదితరులు పాల్గొన్నారు.

## నూతన బూత్ కమిటీ నియామకం...

**సంస్థాన్ నారాయణపురం వెలుతురు ఫిబ్రవరి 20:**
అల్లందేవిచెర్వు గ్రామపంచాయతీ పరిధిలోని గొల్లగూడెం 88వ బూత్‌లో భారతీయ జనతా పార్టీ సమావేశానికి బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి, శక్తి కేంద్ర ఇంచార్జ్ సుర్వి రాజుగౌడ్ గారు ముఖ్యఅతిథిగా పాల్గొని నూతన కమిటీని నియమించడం జరిగింది నూతన బూత్ అధ్యక్షులుగా: గోధుమగడ్డ జంగారెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా గోధుమగడ్డ నరేందర్ రెడ్డి,



సామ వెంకట్ రెడ్డి, ఉపాధ్యక్షురాలుగా పాటి రాణి భర్త రుక్మా రెడ్డి, కార్యదర్శిగా గోధుమగడ్డ రఘుమారెడ్డిలను భారతీయ జనతా పార్టీ నాయకులు కార్యకర్తలందరు కలిసి ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.

ఈ కార్యక్రమంలో గొల్లగూడెం గ్రామ బిజెపి సీనియర్ నాయకులు గోధుమగడ్డ మహేందర్ రెడ్డి సురుగూరు అల్వాల్ రెడ్డి గోధుమగడ్డ మోహన్ రెడ్డి సురుగూరు మల్లారెడ్డి సామ రఘుమా రెడ్డి గోధుమగడ్డ సుదర్శన్ రెడ్డి గోధుమగడ్డ రంజిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## రౌడీ షీటర్‌లకు సత్ప్రవర్తన కలిగి ఉండాలని పోలీసుల కౌన్సిలింగ్

**తూప్రాన్ వెలుతురు ఫిబ్రవరి 20:**
నేర చరిత్ర కలిగిన రౌడీషీటర్ లు ఇక మీద సత్ప్రవర్తన కలిగి ఉండాలని తూప్రాన్ డిఎస్పీ వెంకట్ రెడ్డి కౌన్సిలింగ్ ఇచ్చారు. తూప్రాన్ సర్కిల్ పరిధి లోని తూప్రాన్, శివ్వంపేట్, వెల్దుర్తి, మనోహరబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోనీ సుమారు 50 మంది రౌడీ షీటర్ లను




మంగళవారం డిఎస్పీ వెంకట్ రెడ్డి ముందు హజరుపర్చగా విడి విడిగా ఒక్కొక్కరి పై ఉన్న పాత కేసుల పూర్వాపరాలు విచారించిన పిదప ఇక పై సత్ప్రవర్తన కలిగి ఉండి నేర చరిత్ర లేకుండా జాగ్రత్త పడాలి అని సూచించారు. జీవితంలో మార్పు రావాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ సి.ఐ కృష్ణ, ఎస్.ఐ శివానందం, శివ్వంపేట్ ఎస్.ఐ మహిపాల్ రెడ్డి, వెల్దుర్తి ఎస్.ఐ నవతగౌడ్, మనోహరబాద్ ఎస్.ఐ కరుణాకర్ రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.






## గందరగోళంలో గురుకుల
# రిక్రూట్మెంట్ బోర్డు అభ్యర్థులు..

**హైదరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 20:**
తెలంగాణ హైదరాబాదులో ఇందిరాపార్క్ ఎదుట తెలంగాణ గురుకుల రిక్రూట్మెంట్ అభ్యర్థులు ధర్నా నిర్వహించడం జరిగింది బ్యాక్ లాక్ పోస్టులు లేకుండా రిక్రూట్మెంట్ నిర్వహించాలని పెద్ద ఎత్తున ధర్నా చేస్తున్నారు ప్రభుత్వం తక్షణమే దీనిపై స్పందించి సీఎం గారు దీనిమీద ప్రత్యేక శుద్ధి పెట్టాలని వాళ్ళు కోరుతున్నారు వారం రోజులుగా ధర్నా చేస్తున్న కూడా ప్రభుత్వం చిన్న చూపు చూస్తుంది ఒక విద్యార్థికి నాలుగు జాబులు ఎలా వస్తాయి ఒక జాబ్లో జాయిన్ అయిన తర్వాత మిగిలిన జాబులకు బ్యాక్లాట్లు నిర్వహించదు అని గురుకుల రిక్రూట్మెంట్ బోర్డు అభ్యర్థులు కోరుతున్నారు కానీ ఇప్పటివరకు కూడా గురుకుల రిక్రూట్మెంట్ బోర్డ్ స్పందించక పోదును పోయింది ఇలానే ఉంటే మేం పెద్ద ఎత్తున సెక్రటేరియట్ దగ్గర ధర్నా నిర్వహిస్తామని అభ్యర్థులు వేస్తారు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి దీనిపై వెంటనే పరిష్కారం చూపాలే ఒక కమిటీని ఏర్పాటు చేయాలని అభ్యర్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.
దాదాపు 3,000 నుంచి 4000 పోస్టులు మిగిలిపోతున్నాయి ఇంకా టీజీటీ రిజల్ట్ రాకపోవడం వల్ల దాదాపు 7 పోస్టు మిగిలిపోతాయి అని అభ్యర్థులు ధర్నా నిర్వహిస్తున్నారు హైదరాబాదులో పొట్ట చేత పట్టుకొని కోచింగ్ సెంటర్లకు వచ్చి దాదాపు 8 నెలల నుంచి ఎదురుచూస్తున్న మాకు అన్యాయమే జరుగుతుంది మేము మార్పు కావాలని కాంగ్రెస్ పార్టీకి ఓటేశాము కానీ ఇప్పుడు మాకు అన్యాయం జరుగుతుంది కాంగ్రెస్ పార్టీలో ఉన్న పెద్దలు కూడా పట్టించుకోకపోవడం చాలా అన్యాయం ఇకనైనా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి మేము ఎంతో మందిని దగ్గరికి వెళ్లి వినతి పత్రాలు ఇచ్చిన ఉపయోగం లేకుండా పోయింది ఈ బ్యాక్లాగ్ పోస్టు ఉండటం వల్ల విద్యార్థులకు కూడా చాలా నష్టపోతారు దాదాపు 9100, పోస్టులకు నోటిఫికేషన్ ఇస్తే దాదాపు దాంట్ల 8 వేల పోస్టు బ్యాక్లాగ్ గా మిగిలిపోతున్నాయి ఇన్ని రోజు కోట్లు కేసులు అని చెప్పి ఆరు నెలలు కాలయాపన చేసినా కూడా అభ్యర్థుల్లో మాకు ఉద్యోగం వస్తుందని నమ్మకం ఉండే కానీ ఇది ఇలా అన్యాయం చేస్తారని మాత్రం ఊహించలేదు ప్రభుత్వం ఇప్పుడైనా చర్యలు తీసుకొని ముందుకు సాగాలని కోరుతున్నాము.







## తూప్రాన్ డిఎస్పి వెంకటరెడ్డిని
# సన్మానించి స్వాగతం పలికిన ప్రజా ప్రతినిధులు

**తూప్రాన్ వెలుతురు ఫిబ్రవరి 20:**
తూప్రాన్ డిఎస్పి గా బదిలీ పై వచ్చి భాద్యతలు చేపట్టిన వెంకట్ రెడ్డిని పలువురు ప్రముఖులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా తూప్రాన్ డిఎస్పి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు, నాయకులు, ప్రజలు సేవాకార్యక్రమాలు చేసి మంచి పేరు గుర్తింపు తెచ్చుకోవాలని సూచించారు. తన వద్దకు పైరవీలు కోసం, కేసుల గురించి రావద్దని ఖరా ఖండిగా తెలిపారు. డిఎస్పీ ని సన్మానించిన వారిలో మెదక్ జిల్లా ఎంపీపీల పోరం అధ్యక్షులు కల్లూరి హరికృష్ణ, తాజా మాజీ సర్పంచ్ బుడ్డా స్వర్ణలత భాగ్యరాజ్, శివ్వంపేట మండలం పిఏసిఎస్ చైర్మన్ వెంకట్రాంరెడ్డి, వైస్ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి, బండారి గంగాధర్, తూప్రాన్ మండల ఆర్ఎంపి, పీఎంపీ డాక్టర్ ల సంఘం అధ్యక్షుడు డాక్టర్ మహమ్మద్ అప్సర్, పన్నీరు రాము, డాక్టర్ గజం సుధాకర్, డాక్టర్ కృష్ణ, ప్రధానంగా అన్ని రకాల సంఘాల బ్యాచ్ లీడర్, రెండు పేపర్లు, రెండు టివి ఛానెళ్ల జర్నలిస్ట్ గడ్డం ప్రశాంత్ కుమార్, బీసీ సంక్షేమ సంఘం నాయకులు, మల్లికార్జున్ గౌడ్, చితా గ్యాంగ్ లీడర్ గడ్డం ప్రశాంత్ కుమార్, బాయికాడి ఆంజనేయులు రజక మదెల్, రావెల్లి రియలేస్టెట్ మహేష్ యాదవ్, దాతర్ పల్లి సాయిబాబా ముదిరాజ్, నాగరాజు యాదవ్, రాథోడ్ జయపాల్ నాయక్, గడ్డం వెంకట్, చిరంజీవి, శ్రీనివాస్, నాగేష్, నర్సింలు, సుధాకర్, రమేష్, శ్రీశైలం యాదవ్, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.






# 8 ఏళ్ల నుండి సమాజ సేవ చేస్తున్న
### అక్షిత ఫౌండేషన్ ఛైర్మెన్ సన్నీ కుమార్ రాపాక

**హైదరాబాద్, వెలుతురు, ఫిబ్రవరి 20:**
ఉన్నత చదువులు చదివినప్పటికి సమాజంలో తమవంతు భాద్యతలు నిర్వహించాలనే సదుద్దేశంతో ఎంతో మందికి మార్గదర్శకంగా నిలుస్తున్న అక్షిత ఫౌండేషన్ ఛైర్మెన్ సన్నీ కుమార్ రాపాక... అక్షిత ఫౌండేషన్ అనే సంస్థ ద్వారా ఎంతో మంది నిరుపేదలకు అండగా ఉంటూ తనకు తోచినంతలో ఉచితంగా అన్న దాన కార్యక్రమాలు, ఆర్థిక సహాయాలు,నిత్యవసర సరుకుల పంపిణీ, ప్రభుత్వ పాటశాల విద్యార్థులకు ఉచితంగా బాగ్ లు, నోట్ పుస్తకాలు, షూస్, స్టేషనరీ అందజేయటం,బడికి రాని వారికి కౌన్సిలింగ్ ఇచ్చి వారిని స్కూల్‌లో చేర్పించడం, నిరు పేదలు బట్టలు మరియు దుప్పట్లు పంచటం, చలివెంద్రాలు ఏర్పాటు, అనారోగ్యంతో బాధ పడుతున్నారు వృద్ధులను హాస్పిటల్‌లో చేర్పించటం లాంటి



కార్యక్రమాలు కాకుండా సమా జంలో జరిగే అవినీతిని ప్రశ్నిస్తూ ఎంతో మందికి ఆదర్శంగా నిలుస్తున్న సన్నీ కుమార్ రాపాకని పలువురు ప్రశంసిస్తున్నారు.

## కొడకంచి గ్రామంలో ఘనంగా
# శ్రీదేవి భూదేవి సమేత శ్రీ ఆదినారాయణ స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవం
### దర్శించుకున్న పటాన్ చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి : కాట శ్రీనివాస్ గౌడ్

**జిన్నారం మండలం వెలుతురు ఫిబ్రవరి 20:**
జిన్నారం మండలం కొడకంచి గ్రామంలో ఘనంగా నిర్వహించిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ ఆదినారాయణ స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవంలో పటాన్ చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్న అనంతరం ఆలయ నిర్వాహకులు వారిని ఘనంగా సన్మానించారు.





# సంపాదకీయం..

## ప్రజల డబ్బుతో రాజకీయ నాయకుల సోకులు!

పార్లమెంట్ ఎన్నికలు ఎంతో దూరంలో లేవు. మరోమారు అధికారం కోసం బిజెపి... అధికారం ఇవ్వాలంటూ కాంగ్రెస్ కూటమి ప్రజలవద్దకు వస్తోంది. కొన్ని రాష్ట్రాల్లో కూడా అసెంబ్లీ ఎన్నికలు జరగబోతున్నాయి. ఈ క్రమంలో ప్రజలు రాజకీయ నాయకులను నిలదీయాల్సి ఉంది. అనేక అంవాలపై ప్రజలు సమాచార సేకరణ చేసి రాజకీయ నాయకుల మోసాలను గుర్తించాలి. ప్రదానంగా సేవచేయాల్సిన నేతలు ప్రజల సొమ్ము ను అప్పనంగా బొక్కేస్తున్నారు. వాటిని గుర్తించి నిలదీయాలి. ప్రధానంగా ప్రజలు పన్నుల రూపంలో కట్టిన డబ్బులతో సౌకల సౌకర్యాలు పొందుతూ పెన్షన్లు కూడా పొందుతున్నారు. దీనిని ప్రధానంగా నిలదీయా ల్సిన సమయం ఇదే. గెలిస్తే వీటిని రద్దు చేసుకోగలరా అని అడగాలి. ఎలాంటి బాధ్యత లేకున్నా ఎమ్మెల్యేలు, ఎంపిలు అయిన వారికి సకల సౌకర్యాలతో పాటు..జీతాలు, భత్యాలు,పెన్షన్లు ఉన్నాయి. కానీ గొడ్డు చాకిరీ చేస్తున్న ఉద్యోగలకు పెన్షన్ మాత్రం ఎత్తేశారు. ఇదేమిటంటే.. ఖజానాపై భారం పడుతుందని రద్దు చేశామని చెప్పుకొచ్చారు. పెన్షన్ పునరుద్ధరణ కోసం ఉద్యోగులు ఆందోళనలు చేస్తున్నా పట్టించు కోవడం లేదు. ఉద్యోగులకు లేని పెన్షన్లు సౌకర్యాలు రాజకీయ పదవులు వెలగబెడుతున్న వారికి మాత్రం ఎందుకన్న దానికి సమాధానం లేదు. రాజకీయంగా వెనకేసుకుంటున్న వారు అన్ని రకాల విలాసాలు పొందుతున్నారు. ముందుగా వీరి భోగాలు, సౌకర్యాలు,జీతాలు, పెన్షన్లపై ప్రజలు యుద్ధం చేయాలి. వీరికి రాజకీయాల్లో ఇలాంటి సౌకర్యాలు లేకుండా చేయాలి. వీరు ప్రజాసేవ చేస్తామని చెప్పి పదవుల్లోకి వచ్చిన వారికి ఇలాంటి సౌకర్యాలు ఇవ్వాల్సిన అసవరం లేదు. ఇది కేవలం ఉద్యోగుల హక్కుగా చూడాలి. వారికి మాత్రమే పెన్షన్ హక్కుగా రావాలి. చేతిలో అధికారం ఉందికదా అని రాజకీయ నేతలు ఇష్టం వచ్చినట్లుగా చట్టాలు చేస్తున్నారు. తమకు అనుకూలంగా చట్టాలు చేయడంలో సిద్ధహస్తులుగా పేరు తెచ్చుకుంటున్నారు. ఇందుకు అన్ని పార్టీలదీ ఒకే దారి. ప్రజలకు పనికివచ్చే పనుల్లో మాత్రం నిర్లక్ష్యం నిరంతరాయంగా ఉంటూనే ఉంది. ప్రభుత్వ సేవలో నిమగ్నమైన ఉద్యోగికి వయసు మళ్ళిన తర్వాత ఆసరాగా ఉండేందుకు ప్రభుత్వం ఇచ్చే పెన్షన్ ఎత్తి వేయడం ద్వారా మరణశాసనం విధించారు. ఉద్యోగ విరమణ తరవాత మీ చావు మీరు చావండన్న రీతిలో ప్రభుత్వ నిర్ణయం ఉంది. బ్రిటిష్ కాలం నుండి 1950 వరకు పెన్షన్ ఇవ్వటం అనేది ప్రభుత్వాలు బాధ్యతగా చేస్తూ వున్నాయి. 1951లో పోరాటాల ఫలితంగా పెన్షన్ గ్యారెంటీ స్కీం ప్రవేశపెట్టబడింది. ప్రభుత్వాలు నిర్ధారించిన కొంత మొత్తంలో పెన్షన్ ఇచ్చేవారు. 1982లో సుప్రీంకోర్టు 'పెన్షన్ భిక్ష కాదు. హక్కు. ఇది ఉద్యోగి సామాజిక భద్రత' అని తీర్పు ఇచ్చిన తర్వాత ట్రిబుల్ బెనిఫిట్ స్కీమ్ అమలులోకి వచ్చింది. అప్పటి నుంచి నిరాఘాటంగా పెన్షన్ అమలవుతోంది. ఉద్యోగి చరమాంకంలో అత్యంత గౌరవ ప్రదమైన భృతిగా పెన్షన్ ఉపయోగపడుతుంది. జనవరి 2004 తర్వాత అపాయింట్ అయిన ఉద్యోగికి దీనిని తొలగించారు. పాలకుల దుర్బుద్ధికి ఇది పరాకాష్టగా చూడాలి. పెరుగుతున్న ధరలు, అవసరాల సమయం లో పెన్షన్ల లేకుండా చేయడం దొంగ దెబ్బతీయడం తప్ప మరోటి కాదు. న్యూ పెన్షన్ స్కీం పేరుతో, గ్యారెంటీ లేని పెన్షన్, మార్కెట్ శక్తుల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి తీసుకునే పెన్షన్‌గా మార్చేశారు. ఈ నేపథ్యంలో ఉద్యోగి సామాజిక భద్రత కోసం ప్రభుత్వమే ఇవ్వాల్సిన పెన్షన్‌ని మార్కెట్ శక్తుల దయా దాక్షిణ్యాల మీదికి వదిలి పెట్టడం ద్వారా కేంద్రం నిరంకుశ విధానాలను అమలు చేస్తోంది. దీనిపై కనీసం చర్చ కూడా చేయడంలేదు. చట్టసభల్లో దీనిపై ఎలాంటి ప్రస్తావనా తీసుకుని రావడం లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెన్షన్ బాధ్యత నుండి ఎందుకు తప్పుకుంటున్నాయన్నదానికి ఖచ్చితమైన సమాధానం లేదు. ఇది ఓ రకంగా సుప్రీం తీర్పును కాలరాయడం తప్ప మరోటి కాదు. ఉద్యోగులకు తొలగించిన పెన్షన్ రాజకీయ నాయకులకు మాత్రం ఎందుకు ఇవ్వాలి. వారేమైనా పరీక్షలు పాసయ్యారా..? వారేమైనా ప్రభుత్వ ఉద్యోగులా అన్నది ఇప్పుడు చర్చించాలి. ఉద్యోగ,ఉపాధ్యాయులకు ఇచ్చిన హక్కులన్నిటిని ఒక్కొక్కటిగా వెనక్కి తీసుకోవడంలో కార్పొరేట్ కుట్ర ఉంది. ఆర్థిక సంస్కరణల సమయంలో ప్రపంచ బ్యాంక్ విధించిన షరతలను కూడా పరిగణనలోకి తీసుకున్నారు. దానిలో భాగంగానే హక్కుగా ఉన్న పెన్షన్ని కాంట్రిబ్యూషన్ పెన్షన్‌గా మార్చింది. ప్రభుత్వం కార్పొరేట్లకు కావాల్సిన నిధులు సేకరించేందుకు చూపే శ్రద్ధ ఉద్యోగులపై మాత్రం చూపడం లేదు. అలాంటప్పుడు ముందుగా రాజకీయ నాయకుల పెన్షన్లను, జీతభత్యాలను రద్దు చేయాలి. ఇప్పటికే ఒకటే సర్వీస్ ఒకటే పెన్షన్ నినాదంతో సైనికులు పెన్షన్ కోసం పోరాడుతూనే ఉన్నారు. 2004 తర్వాత అపాయింట్ అయిన ప్రభుత్వ ఉద్యోగులు నూతన పెన్షన్ విధానం వద్దు, పాత పెన్షన్ విధానమే కావాలనే డిమాండ్‌తో పెద్ద ఎత్తున కార్యక్రమాలు, పోరాటాలు చేస్తున్నారు. అయినా పాలకుల్లో చలనం కానరావడం లేదు. ఎల్ఐసి, పోస్టల్, రైల్వే...ఇలా అన్ని రంగాల వారు పెన్షన్ భిక్ష కాదు హక్కు అని పెద్ద ఎత్తున పెన్షన్ కోసం పోరాడుతున్నారు. ప్రతిదీ సరుకు చేస్తున్న ప్రభుత్వం పెన్షన్‌ని కూడా సరుకుగా మారుస్తున్నది. వ్యాపారధోరణితో వ్యవహరిస్తున్న ప్రభుత్వాలు ఇప్పుడు రాజకీయ నాయకులకు ఇచ్చే జీతభత్యాలను కూడా మార్కెట్ వస్తువుగానే చూడాలి. వారికి కూడా పెన్షన్,భత్యాలు కట్ చేయాలి. 10శాతం కంట్రిబ్యూషన్‌తో పెన్షన్‌ని కొనుక్కోమని చెబుతున్నది. ప్రభుత్వం కడుతున్న 10శాతం కాంట్రిబ్యూషన్‌ని కట్టకుండా ఎగనామం పెడుతున్నది. ఇలా సమీకరించిన 20 శాతం ఫండ్లు ప్రభుత్వం తన ఖాతాలో ఏమైనా ఉంచుతుందా అంటే అదీ లేదు. షేర్ మార్కెట్లో కార్పొరేట్ శక్తులకు అందుబాటులో ఉంచుతుంది. ఉద్యోగ, ఉపాధ్యాయులకి ప్రభుత్వాలు పెన్షన్ ఇస్తే ప్రభుత్వ ఆర్థిక వ్యవస్థ దివాలా తీస్తుందని పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్న తీరు రాజకీయనాయకుల దుర్నీతికి నిదర్శనంగా చూడాలి. అయితే 2100 సంవత్సరానికి పెన్షన్లు అత్యంత భారమైపోతాయని, ప్రభుత్వానికి వచ్చే ఆదాయం లో ఎక్కువశాతం పెన్షన్‌కి ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని, ప్రజల సంక్షేమానికి ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేని పరిస్థితి ఏర్పడుతుందని వాదిస్తోంది. ప్రజలను ఓటుబ్యాంకుగా మార్చి వారికి పందేరాలు చేస్తున్న పథకాలతోనే ఖజానా గుల్లవుతోంది. పెన్షన్ వల్లే ఆర్థిక లోటు ఏర్పడుతుందని చెప్పేది నిజమా లేక 14 శాతం నిధులే ఖర్చు అని చెప్పేది నిజమా అన్నది కూడా చెప్పాలి. పెన్షన్ ప్రభుత్వానికి భారం కాదు. ఎందుకంటే వారు చేస్తున్న ఒక్కో ఖర్చుపై చర్చ చేయాలి. అధికారంలో ఉన్న పార్టీల నేతలు ఎంతగా ఖర్చు పెడుతున్నాయో ప్రజలకు వివరించాలి. నిజంగా ఆర్థిక వ్యవస్థ ఇబ్బందులలో ఉంటే గడచిన ఐదు సంవత్సరాలలో రూ.13 లక్షల కోట్లు కార్పొరేట్లకు ఎలా రాయితీలు ఇచ్చారో కూడా ప్రజలకు తెలియచేయాలి. అదానీ, అంబానీల వందల రెట్లు పెరుగుతున్న తీరు వెనక ప్రభుత్వ ప్రోత్సాహం ఉంది. నీరవ్ మోడీ లాంటి వారి అప్పులు ఎందుకు తిరిగి రాబట్టలేక పోయారు? ఈ డబ్బులన్నీ ప్రజల సంక్షేమం కోసం, ప్రభుత్వ ఉద్యోగుల పెన్షన్ కోసం కేటాయిస్తే పెన్షన్ భారం కాదని గుర్తించాలి. ఈ క్రమంలో ముందుగా రాజకీయ నేతల జీతభత్యాలు,పెన్షన్లను రద్దు చేసేందుకు ప్రజలు పోరాడాలి. అందుకు ఈ ఎన్నికలే సరైన సమయంగా గుర్తించాలి.

## పల్లె,పట్టణ ప్రగతిలో కానరాని పురోగతి

గత ప్రభుత్వం గ్రామాల్లో అభివృద్ధి, పచ్చదనం, పరిశుభ్రత వెల్లివిరిసేలా చేసేందుకు పల్లెప్రగతి కార్యక్రమం చేపట్టి విజయవంతంచేసిందని చెప్పుకుంటున్నా అందులో అంతా డొల్లే నని పరిస్థితులు సూచిస్తున్నాయి. ప్రచారంతో ఊదరగొట్టిన నేతలు గ్రామాలకు వెళితే సమస్యలు ఎలా ఉన్నాయో కనిపిస్తున్నాయి. ఎక్కడా పచ్చదనం, పరిశుభ్రత కానరావడం



లేదు. అదే తరహాలో పట్టణ ప్రణాళిక అమలు చేయడంతో మంచి ఫలితాలు సాధించినట్లు డప్పు కొట్టుకున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు కష్టపడడంతో మంచి ఫలితాలు వచ్చాయని అపట్లో బాకా ఊదారు. అయితే ప్రజల్లో కూడా మనవాడ, మన గ్రామం అన్న భావన రావాలని, అప్పుడే ఫలితాలు ఉంటాయని తెలుసుకోవడం లేదు. ఇప్పటికే పలు విడతలుగా పల్లె,పట్టణ ప్రణాళిక ప్రకారం పనులు చేసి.. శాశ్వతంగా గ్రామాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టినట్లు కెసిఆర్ ప్రభుత్వం ప్రకటించుకుంది. కానీ గ్రామాల కంటే ఎక్కువ ఆదాయం, ఎక్కువ నిధులు ఉండే మున్సిపాలిటీల్లో అటు ప్రజాప్రతినిధులు, ఇటు అధికారులు అనుకుంటే పట్టణాలు స్వచ్ఛతను సంతరించుకుంటున్నాయని అభిప్రాయపడ్డారు. పల్లెల్లో డంపింగ్‌యార్డులు, ఇంకుడు గుంతలు, శ్మశాన వాటికలు, డ్రెయినేజీలు శుభ్రం చేయడం, విద్యుత్ సమస్యలను పరిష్కరించడం, శిథిల భవనాలను కూల్చివేయడం, పాత బావులను పూడ్చివేయడం వంటి పనులు చేపట్టడం ప్రచారానికి మాత్రమే పరిమితం అయ్యింది.

అవార్డులు రావడంతో ప్రస్తుతం గ్రామాలు సుందరంగా తయారవుతున్నాయని ప్రకటించు కున్నారు. పల్లెల మాదిరిగానే పట్టణాలను అభివృద్ధి చేసేందుకు పట్టణ ప్రగతి కార్యక్రమాన్ని చేపట్టామని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏ ఒక్క మున్సిపాలిటీలోనూ ప్రజలు విధిగా డస్ట్‌బిన్‌లలోనే చెత్త వేసేలా, చెత్తబండి వచ్చినప్పుడు అందులో వేయడం అలవాటుగా చేశామని అన్నారు. కానీ పల్లెలు, పట్టణాల్లో నేటికీ ప్లాస్టిక్ వినియోగంతో వీధులు కంపుకొడుతున్నాయి. గ్రామాలకు సక్రమంగా నిధులు కేటాయించక పోవడంతో పల్లెల్లో ప్రగతి పడకేసింది. మున్సిపాలిటీల్లో పనిచేసే పారిశుధ్య కార్మికుల వేతనాలు పెంచడంతోపాటు, వారి సంఖ్యనూ పెంచాలి. ఎప్పటికప్పుడు వారికి జీతాలు టంఛనుగా వచ్చే ఏర్పాటు చేయాలి. సానిటేషన్ విభాగం అధికారులు.. ప్రజాప్రతినిధులు సమస్యలు తెచ్చినప్పుడే కాకుండా మిగతా సమయాల్లోనూ వార్డుల పర్యటన చేయాలి. పట్టణాలకు నిత్యం వేల సంఖ్యలో ప్రజలు వివిధ అవసరాల కోసం రాకపోకలు సాగిస్తుంటారు. పట్టణాల్లో సరైన టాయిలెట్స్, మరుగుదొడ్లు లేకపోవడం వల్ల నిత్యం ఇబ్బందులకు గురవుతుంటారు. పురుషులు ఎక్కడో ఒకచోట బహిరంగ మూత్ర విసర్జన చేస్తున్నారు. మహిళల పరిస్థితి అయితే చాలా దారుణంగా ఉంటోంది. ఇంటి దగ్గరి నుంచి బయలుదేరి మళ్లీ ఇంటికి వెళ్లే వరకూ ఊపిరి బిగపట్టుకోవాల్సిన పరిస్థితి. పట్టణాల్లోని వ్యాపార సముదాయాలు, దుకాణాల్లో కూడా ప్రస్తుతం ఎక్కడా టాయిలెట్స్ సౌకర్యం సరిగ్గా లేదు. వ్యాపార సముదాయాలు ఉన్నవారందరికీ నోటీసులు ఇచ్చి టాయిలెట్స్ నిర్మించుకునేలా వెసులుబాటు కల్పించాలి. అలాగే పే అండ్ యూజ్ పద్ధతిలో సులభ్ కాంప్లెక్స్‌లు నిర్మించాలి. బస్టాండ్‌లలో ప్రస్తుతం టాయిలెడ్స్ పూర్తిస్థాయిలో లేవు.. కొత్తగా టాయిలెట్స్ నిర్మించి.. వాటి నిర్వహణ చేసేలా చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా జిల్లాకేంద్రాల్లో వెంటనే ఈ పనులు చేపట్టాలి. దీనివల్ల బహిరంగ మూత్ర విసర్జన తగ్గిపోతుంది. చెత్త శుద్ధి, డ్రెయినేజీలు శుభ్రం, బహిరంగ మూత్ర విసర్జనను తగ్గించడంతోపాటు మున్సిపాలిటీల్లో మరిన్ని సమస్యలు ప్రధానంగా ఉన్నాయి. గ్రామాల్లో మాదిరిగానే విద్యుత్ సమస్యలు పట్టణాల్లోనూ అధికంగా ఉన్నాయి. కొత్త కాలనీలకు విద్యుత్‌లైన్ల ఏర్పాటు, కేబుల్ తీగలు చుట్టుకుని ప్రమాదకరంగా ఉన్న స్తంభాలు, వేలాడుతున్న తీగలు, దారికి అడ్డంగా ఉన్న స్తంభాలు, ఒకేలైన్‌లో లేని స్తంభాలను సరిచేయాల్సి ఉంటుంది. అలాగే రోడ్ల విస్తరణ జరిగే వరకు ఇప్పటికే ఖాళీ చేసిన శిథిల భవనాలను తొలగించాల్సి ఉంది. పట్టణాల్లో బహిరంగ జంతువధను నిషేధించి.. వధశాలల్లోనే వధించేలా ఏర్పాట్లు చేయాలి. కొన్నిచోట్ల కబేళాలు ఉన్నా పలుచోట్ల బహిరంగ వధ కొనసాగు తూనే ఉంది. బజార్లలోనే మాంసం అమ్మకాలు సాగుతున్నాయి. వీటిని సరిదిద్ది సకాలంలో నిధులు విడుదల చేసి, ప్రజాప్రతినిధులను బాధ్యులను చేస్తే తప్ప పట్టణ, పల్లె ప్రగతిలో మార్పులు రావు.

## సేంద్రియ పంటలను ఎంచుకోవాలి

రైతులు అప్పుల నుంచి బయటపడేందుకు లాభసాటి, నాణ్యమైన పంటలు పండించాలని వ్యవసాయవేత్తలు సూచిస్తున్నాచారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారుల సలహాలు పాటించి మంచి దిగుబడులు సాధించాలని రైతులకు సూచించారు. రసాయన ఎరువులు వాడకంతో రైతులు అనారోగ్యం బారిన పడుతున్నారని తెలిపారు. రైతులు ఒకే సమయంలో ఒకే రకమైన పంటలు పండించడంతో నష్టపోతున్నారని అన్నారు. మారుతున్న పరిస్థితుల్లో డిమాండ్ ఉన్న పంటలను కేవలం సేంద్రియ పద్ధతుల్లో పండించడం ద్వారా లాభాలు ఆర్జించాలన్నారు. అలాగే దీనిని అలవాటు చేసుకోవాలని అన్నారు. దుకాణాదారుల మోసపూరిత మాటలు నమ్మకూడదని, సారవంతమైన భూములను కాపాడుకోవాలని సూచించారు. అప్పుడే పంటలకు అంతర్జాతీయంగా కూడా డిమాండ్ ఉంటుందన్నారు. మార్కెట్‌లో డిమాండ్, అవసరాలకు అనుగుణంగా పంటలు సాగు చేయాలని చెప్పారు. జొన్న, మొక్కజొన్న వంటి సంప్రదాయ పంటలను పండించాలని సూచించారు. రైతులు పత్తిని సీసీఐ వారికి అమ్మకుండా ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరకు అమ్మడంతో నష్టపోతున్నారని తెలిపారు. జీవ వైవిధ్యాన్ని పెంపొందించాలని, అంతరిస్తున్న అటవీ సంపదను కాపాడుకోవాలని అన్నారు. 267 రకాల పురుగులు పంటలను నాశనం చేస్తున్నాయని, జిల్లాలో వంద ఏండ్లకు పైగా పత్తి పంట సాగు చేస్తున్నారని, నిపుణులు, అనుభవజ్ఞులు, శాస్త్రవేత్తల సలహాలు, సూచనల ప్రకారం వ్యవసాయం చేయాలని సూచించారు. దిగుబడి పెరుగుతున్న కొద్దీ ధరలు కూడా పెరుగుతున్నాయని, వ్యవసాయరంగంలో పురాతన పద్ధతులను పరిశీలించాల్సిన అవసరం ఉందని వారు అభిప్రాయం వ్యక్తం చేశారు. వివిధ శాఖల అధికారులు, శాస్త్రవేత్తలు వారి అనుభవాలను, సూచనలను అందించారు. పంట కాపాడుకొనే సమయంలో ఫెన్సింగ్‌కు విద్యుత్ అమర్చడంతో రైతులు మరణించడం, ఆ రైతు కుటుంబాలు అనాథలు



## కష్టపడడం అలవాటు చేసుకోవాలి!

ప్రతి ఒక్కరికీ కలలు కనే స్వేచ్ఛ ఉంది... పేదైనా, ధనికుడైనా, స్త్రీలైనా పురుషులైనా. కలలు వాస్తవరూపం ధరిస్తాయని స్వప్నాలను సాకారం చేసుకున్నవారు పదేపదే చెబుతారు. కల కనడం అంటే సగం యుద్ధం గెలిచినట్లు. మిగతా సగభాగం చాలా ముఖ్యమైంది- 'తీవ్రమైన కృషి'...శరీరం 'ఆగు... నేను అలసిపోయాను' అంటే- 'ఇంతకంటే నా వల్లకాదు' అని మనసంటుంది.

హృదయం 'నువ్వు సాధించాల్సిన లక్ష్యం అదిగో వెళ్ళు- ప్రతిభకు సానపట్టు' అంటుంది. ప్రతిభ అనేది సహజంగా వచ్చేది. నైపుణ్యం గంటలకొద్దీ శ్రమించినప్పుడే సాధ్యం. గోల్ఫ్ క్రీడాకారుడు టైగర్ ఉడ్స్ పదిహేడేళ్లకే విజేత. అతడికి రెండేళ్ల వయసులోనే తాతగారినుంచి 'గోల్ఫ్ క్లబ్' బహుమానంగా లభించింది.

అప్పటినుంచే రోజుకు నాలుగు గంటలపాటు అభ్యాసం చేసేవాడు! తొంభై ఏడు శాతం ప్రజలు తమ కలల్ని విడిచిపెట్టేస్తారని, మూడుశాతమే విడిచిపెట్టకుండా సాకారం చేసుకునే పనిలో ఉంటారని అంటారు. గొప్ప బాక్సర్ అయిన మహ్మద్ అలీని ఎవరో అడిగారట-'ప్రతిరోజూ ఎన్నిసార్లు లేచి కూర్చోవడాలు చేస్తారు?' అందుకతడు-'నేను లెక్కపెట్టను. నొప్పి మొదలయ్యాకే లెక్కించడం ప్రారంభిస్తాను. అదే అసలైన లెక్క' అని జవాబిచ్చాడు. విజయంవైపు నడవాల్సిన బాట ఏకాంతంగానే తోస్తుంది.

ఒంటరిగానే నడవడం నేర్చుకోవాలి. కష్టమనిపించినా అది ఎంతో విలువైనది. తప్పుడు నిర్ణయాలు, చర్యలు గాడి తప్పిస్తాయి. సాకారం చేసుకోగల శక్తి లేకుండా... భగవంతుడు మనిషికి కలలను ఇవ్వడు. పరిష్కరించుకోగలిగే సామర్థ్యం లేకుండా సమస్యనూ ఇవ్వడు!

## సేవారంగం నుంచి తప్పుకుంటున్న ప్రభుత్వం

కార్పొరేట్ల కొమ్ము కాస్తే అది ప్రజలకు భారంగానే మారుతుంది. రోడ్లు వేయటం, ప్రాజెక్టులు కట్టడం, పరిశ్రమలు స్థాపించడం, రైల్వే, ఎల్ఐసి, పోస్టల్, టెలికం రంగాల నిర్వహణ అన్నీ భారంగానే మారతాయి. అందుకే ప్రభుత్వాలు కార్పొరేట్లకు లాభం చేకూర్చే వైపు కాకుండా ప్రజల సంక్షేమం వైపు ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలి. కార్పోరేట్లకు చేసే మేలు వల్ల సామాజిక బాధ్యత గురించి, సామాజిక అంశాల గురించి, ఆ మాటకొస్తే మానవత్వం గురించి మాట్లాడలేరు. ప్రభుత్వ రంగంలో పెట్టుబడులు, ప్రభుత్వ రంగంలో పరిశ్రమలు, ప్రభుత్వ రంగంలో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు, సంక్షేమ కార్యక్రమాల్ని ప్రభుత్వమే అమలు చేసింది.

ప్రజాస్వామ్యంలో ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని చూడాలి. ప్రజల కష్టాల్ని, భారాన్ని తగ్గించడానికి ప్రభుత్వ ధనాన్ని వెచ్చించాలి. పన్నుల భారం నుండి, అధిక ధరల నుండి కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉంది. ప్రజలకి ప్రభుత్వానికి వారిధిగా ఉన్న ఉద్యోగ, ఉపాధ్యా యులకు రాజ్యాంగబద్ధంగా ఇచ్చిన హక్కుల్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిది. ప్రజల్లో ఏదైనా అంశం మీద అసంతృప్తి ఏర్పడితే దాన్ని చర్చల ద్వారా తగ్గించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే. చర్చించడం అన్న విధానాన్ని నిరంతరాయంగా ప్రజలముందుకు తీసుకుని రావాలి.



ప్రజల పక్షాన నిలబడటం ప్రజాస్వామ్య ప్రభుత్వాల బాధ్యత. దీనికి భిన్నంగా కార్పొరేట్లకు, మార్కెట్ శక్తులకు లాభాన్ని చేకూర్చే విధానాన్ని అమలు చేస్తున్న కారణంగా, పాలకుల తప్పులకు బాధ్యులు ఎవరన్నది చెప్పాలి. 1980 తరువాత భారతదేశంలో ఆర్థికమాంద్యం ఏర్పడింది. విదేశీ మారక నిల్వలు కరిగిపోవడం, బంగారాన్ని సైతం కుదువ పెట్టాల్సి రావడం, అప్పుల కోసం ప్రపంచ దేశాల మీద ఆధార పడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో భారతదేశం అప్పు కోసం ప్రపంచ బ్యాంకు తలుపు తట్టాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ప్రపంచ బ్యాంక్ షరతులకు లోబడి తెచ్చుకున్న అప్పు ఫలితంగా ప్రభుత్వం సంక్షేమ బాధ్యత నుంచి పక్కకు తప్పుకోవటం, ప్రజలకు కావలసిన ప్రతి అవసరాన్ని సరుకుగగా చూడడం మొదలు పెట్టింది.

1991లో ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టిన నాటి నుంచి నేటి వరకు 32 సంవత్సరాల కాలంలో ప్రతిదీ సరుకుగా మారిపోయింది. ప్రభుత్వం కేవలం ఫెసిలిటేటర్‌గా మారిపోయింది. ఆఖరికి ప్రభుత్వ రంగ కంపెనీలను అమ్మడం కోసం, కార్పొరేట్లకు అప్పచెప్పటం కోసం కేంద్ర ప్రభుత్వం డిజిన్వెస్ట్‌మెంట్ మంత్రిత్వ శాఖను కూడా ఏర్పాటు చేసిందంటే పరిస్థితుల తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. ప్రపంచంలో ఏర్పడిన ఆర్థిక మాంద్యం వల్ల కార్పొరేట్లకు అవసరమైన పెట్టుబడుల వెతుకులాటలో వుండగా.... భారతదేశ ప్రభుత్వరంగ పరిశ్రమలతో పాటు ప్రభుత్వం దగ్గర ఉన్న వివిధ రకాల నిల్వలు, పెన్షన్ ఫండు నిల్వల మీద ప్రపంచ బ్యాంక్ కన్ను పడింది. పరిశ్రమలతో పాటు ఈ దేశంలో ఉన్న సహజ సంపదల మీద కూడా ప్రపంచ బ్యాంకు చూపు పడింది. అప్పుకెళ్లిన ప్రతిసారీ సంస్కరణల పేరుతో ప్రభుత్వం తన బాధ్యత నుంచి తప్పుకుని ప్రైవేటు రంగానికి కేటాయింపులు చేసేలా ఒత్తిడి తెచ్చింది. దాని ఫలితంగానే నేడు మనకు సర్వదరిద్రాలు వచ్చాయి. దీనిలో భాగంగానే ప్రజలకిచ్చే సబ్సిడీలపై కోతను విధిస్తోంది. ధరలు పెంచు తోంది. రైతాంగ వ్యతిరేక చట్టాలు తెస్తోంది. కార్మిక చట్టాలను మార్చి 4 లేబర్ కోడ్స్‌గా మార్చేసింది.

భూమి, గనులు, రైల్వేలు, విమానాశ్రయాలు, నౌకాశ్రయాలు, గాలి, నీరు, పాలు... ఒక్కటేమిటి ఇప్పటి వరకు సహజ సంపదలుగా, ప్రభుత్వరంగ సంస్థలుగా ఉన్న అన్నీ... ప్రైవేటు సేవలుగా మారుతున్నాయి. అన్ని రంగాల నుంచి ప్రభుత్వం తప్పుకొని, కార్పొరేట్లకు అప్పనంగా అప్పజెబుతోంది. దీనివల్ల భవిష్యత్తు లో యూజర్ చార్జీల పేరుతో వందలాది రూపాయలు వసూలు చేసే పని జరుగుతున్నది. ఎంటర్‌టైన్ మెంట్‌కు కూడా రుసుము చెల్లించాల్సిన పరిస్థితి. ప్రతిదాన్నీ ప్రభుత్వం సరుకుగా మార్చివేస్తున్నది.




## రాచకొండ పరిధిలో 8 మంది ఇన్‌స్పెక్టర్ల బదిలీ

**హైదరాబాద్,ఫిబ్రవరి 20 (వెలుతురు):** రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న 8 మంది ఇన్‌స్పెక్టర్‌లు, నలుగురు సబ్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ పోలీస్ కమిషనర్ తరుణ్‌జోషి ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన అధికారులు వెంటనే బాధ్యతలు స్వీకరించాలని ఆదేశించారు. హయత్‌నగర్ ఎస్‌హెచ్‌ఓగా జి.రామకృష్ణ, హయత్‌నగర్ డీఐగా జి.రుద్వీర్‌కుమార్, ఇబ్రహీం పట్నం ఎస్‌హెచ్‌ఓగా వి.సైదిరెడ్డి, బాలాపూర్ ఎస్‌హెచ్‌ఓగా టి.భూపతి, డి.యాలాద్రి స్పెషల్ బ్రాంచికి, ఎన్.అశోక్, ఉప్పల్ ట్రాఫిక్‌-1 ఇన్‌స్పెక్టర్‌గా ఇ.వెంకట్‌రెడ్డి, ఉప్పల్ ట్రాఫిక్‌-2 ఇన్‌స్పెక్టర్‌గా ఎ.సూర్యనాయక్ బదిలీ అయ్యారు. ఎస్‌ఐలు కె.రాఘవేంద్రగౌడ్ చౌటుప్పల్ పీఎ?సకు, పి.మల్లయ్య రామన్నపేట్ ఎస్‌హెచ్‌ఓగా, హెచ్.రాఘవేందర్ స్పెషల్ బ్రాంచికి, నారాయణపూర్ ఎస్‌హెచ్‌ఓగా జె.జగన్ బదిలీ అయ్యారు. హైదరాబాద్ కమిషనరేట్‌లో వివిధ పోలీస్ స్టేషన్లలో విధుల నిర్వహిస్తున్న 38 కానిస్టేబుళ్లను బదిలీ చేస్తూ పోలీస్ కమిషనర్ కె.శ్రీనివాసరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

## ప్రతీ కార్యకర్త పార్టీకి సైనికుడే..

**- వజ్రేష్ యాదవ్**

**మేడిపల్లి, వెలుతురు:** పీర్జాదిగూడ కార్పొరేషన్ పరిధిలో కాంగ్రెస్ పార్టీని బలమైన శక్తిగా తీర్చిదిద్దేందుకు కార్య కర్తలు నిరంతరం కృషి చెయ్యాలని మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రెష్ యాదవ్ పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు.. మంగళవారం పీర్జాదిగూడ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంగతుర్తి రవి అధ్వర్యంలో 3వ డివిజన్ ఇంచార్జ్‌గా అలుగువెల్లి సుదర్శన్ రెడ్డిని నియమించి నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా



వజ్రెష్ యాదవ్ మాట్లాడుతూ.. రాబోయే ఎంపీ ఎన్నికలలో పీర్జాదిగూడ కార్పొరేషన్ లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక మెజారిటీ సాధించేలా కార్యకర్తలు కృషి చేయాలని కోరారు..

పార్టీ బలోపేతానికి ప్రతీ కార్యకర్త సైనికుడిలా పని చెయ్యాలన్నారు వజ్రేష్ యాదవ్.. ఈ కార్యక్రమంలో జిల్లా లీగల్ సెల్ చైర్మన్ వంగేటి ప్రభాకర్ రెడ్డి, మజార్, రాజు తదితరులు ఉన్నారు.

## ఆత్మీయ మిత్రునికి పుట్టినరోజు శుభాకాంక్షలు

**మేడిపల్లి, వెలుతరు:** పీర్జాదిగూడ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పప్పుల అంజిరెడ్డి జన్మదిన వేడుకలు శంకర్ నగర్ లో ఘనంగా నిర్వహించారు. కార్యకర్తలు అభిమానులు పాల్గొని అంజిరెడ్డితో కేక్ కట్ చేపించారు.. అనంతరం శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు



తెలిపారు. ఈ సందర్భంగా అంజిరెడ్డి మాట్లాడుతూ.. రాబోయే పార్లమెంట్ ఎన్నికలలో ప్రతీ ఒక్కరు తమ ఇంటి పనిగా భావించి పార్టీ కోసం కృషి చేయాలని కోరారు.. తనకు శు భాకాంక్షలు తెలిపిన ప్రతీ ఒక్కరికి పేరు పేరునా శుభాకాంక్షలు తెలిపారు అంజిరెడ్డి.. ఈ కార్యక్రమంలో బుచ్చిబాబు, రాజు, సందీప్, చిన్నరాయుడు, వర్మ, సుధీర్, సాజిద్, సాయిచరణ్, భవానిశంకర్, బాలాజీ, సంతోష్, హరీష్, అఖిల్, శ్రీకాంత్, మధుసూదన్, తరుణ్, సాయి, సోమశేఖర్, అరుణ్, చందు, ఆనంద్, సాయిసురేందర్, సాయి, అనిల్, అసిఫ్, సుమంత్, కిషోర్ తదతరులు పాల్గొన్నారు.

## కూచిపూడి నృత్యం.. చిన్నారిని ప్రశంసించిన ఎమ్మెల్యే బీర్ల

**మేడిపల్లి, వెలుతరు:** ఫీర్జాదిగూడ కార్పోరేషన్ పరిధిలోని భగత్ సింగ్ నగర్ కు చెందిన ఎం ప్రసన్న కూచిపూడి నృత్యాంశాలతో సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది. కెజిబివి పాఠశాలలో మంగళవారం సాంస్కృతిక ప్రదర్శలు నిర్వహించారు. కళాకారిణి ప్రసన్న చేసిన నృత్యం సందర్శకులను అలరించాయి. ఈ ప్రదర్శనకు ముఖ్య అతిధిగా విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర విప్, ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య చిన్నారిని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యయులు, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.








## చెప్పేవారు లేక వినేవారు రాలేదు...

### సెలవు పెట్టిన ఏకోపాధ్యాయురాలు...

**అంగన్ వాడి టీచర్ కు బోధన బాధ్యతలు...**

**విమర్శల పాలవుతున్న మండల విద్యాశాఖ అధికారులు...**

**నవాబుపేట మండలం మైతాభ్ ఖాన్ గూడ ప్రాథమిక పాఠశాలల్లో ఈ దుస్థితి...**

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి (వెలుతురు న్యూస్):** ఆ పాఠశాలల్లో ఉన్న ఒక్క ఉపాధ్యాయురాలు సెలవుపై వెళ్లినా.. లేదా సమావేశానికి వెళ్లినా ఆ రోజు ఆ పాఠశాల మూతపడమో లేదా అంగన్ వాడి టీచరే పాఠశాల ప్రభుత్వ టీచర్ గా మారుతుంది. సెలవుపై లేదంటే మరో పనిపై వేరే ప్రభుత్వ పాఠశాల నుంచి సర్దుబాటు చేయాల్సిన మండల విద్యాశాఖ అధికారులు దానిని మర్చిపోయి విద్యార్థులు కూడా పాఠశాలకు సెలవు పెట్టారని చెప్పుకొచ్చిన మంగళవారం సంఘటన వికారాబాద్ జిల్లా నవాబ్ పేట్ మండలం మైతాభ్ ఖాన్ గూడ గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాలల్లో జరిగింది.ఇదే విషయం పై మండల సీఆర్పిని వివరణ కోరగా టీచర్ పెళ్లి నిమిత్తం రెండు రోజుల సెలవు పై వెళ్లారని పాఠశాలల్లో ఉన్న విద్యార్థులు కూడా పెళ్లికి వెళ్లారని చెప్పుకోరవడం విడ్డూరం. ఉన్న ఒక్క టీచర్ సెలవు పై వెళితే మరో ప్రభుత్వ టీచర్లు ఆ రెండు రోజులు వేరే పాఠశాల నుంచి పంపించాల్సిన మండల విద్యాశాఖ అధికారులు అంగన్ వాడి టీచర్ కి పాఠశాల బాధ్యతలు అప్ప చెప్పడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.అంగన్ వాడి టీచర్ 10తరగతి చదువుకున్నారు వారికే అంతంత మాత్రమే వచ్చిన చదువును ప్రభుత్వ పాఠశాలలో ఎలా బోధిస్తారని అధికారులపై ఈ ఘటన చూసినవారు విమర్శలు చేస్తున్నారు.దీనిపై సంబంధిత శాఖ జిల్లా స్థాయి అధికారులు ఏ విధంగా స్పందిస్తారనేది వేచి చూడాలి.

## తెలంగాణ అమరవీరుల పోరాటం మరువలేనిది

**- కొంతం యాదిరెడ్డి**

**అబ్దుల్లాపూర్మెట్, వెలుతురు:** ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమం సమయంలో అమరవీరుల త్యాగం ఎన్నటికీ మరువలేనిదని వారి చరిత్రను సువర్ణ అక్షరాలతో లిఖించబడుతుందని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కొంతం యాదిరెడ్డి అన్నారు.

మంగళవారం నాడు తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కార్యాలయాన్ని పెద్ద అంబర్ పెట్ ఔటర్ రింగ్ రోడ్డు ప్రాంతంలో ప్రారంభించడం జరిగినది. తెలంగాణ అమరవీరుడు సిరిపురం యాదయ్య 14వ వర్ధంతి సందర్భంగా ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కార్యాలయంలో తెలంగాణ ఉద్యమ వీరుడు సిరిపురం యాదయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు జెనిగె విష్ణువర్ధన్,రాష్ట్ర కన్వీనర్ గుర్జని వెంకటేశం గౌడ్, రాష్ట్ర



ఆర్గనైజింగ్ సెక్రటరీ కారింగుల నరేందర్ గౌడ్, రాష్ట్ర సెక్రెటరీ పల్లె నర్సింహ గౌడ్,రంగారెడ్డి జిల్లా మహిళ అధ్యక్షురాలు దుగ్గాని శ్యామల సీనియర్ ఉద్యమ కారులు అత్తపురం లావణ్య, కావలి మల్లేష్ ముదిరాజ్, జేఏసీ జిల్లా నాయకులు కందాల బల్ దేవ్ రెడ్డి, గ్రామశాఖ అధ్యక్షులు ఇంజమూరి రవీందర్, తన్నీరు కళాపూర్ణ,ఆదోని లక్ష్మీ,గుండె రవీందర్,గుండె జంగయ్య జీనుకుంట్ల వెంకట రాములు నీలకంటి శోభ,రాయబండి వాణి,మార్గపు అశ్విని తదితరులు పాల్గొన్నారు.





## లోయపల్లిలో సత్గురు సంత్ సేవాలాల్ 285 వ జయంతి

**మంచాల, వెలుతురు:** లోయపల్లి గ్రామంలో సత్గురు సంత్ సేవాలాల్ గారి 285 వ జయంతిలో ముఖ్యఅతిథిగా మంచాల ఎంపిపి జె నర్మదా గారు గిరిజన బంజారా రాష్ట్ర ఉపాధ్యక్షులు,మాజీ ఎంపీపీ కొర్ర శ్రీనివాస్ నాయక్ గారు,యంఆర్వో ప్రసాద్ కుమార్,, ఎంపిడిఓ బాలశంకర్ గారు %ఎజూశీ% తేజ్ సింగ్ , సేవాలాల్ రాష్ట్ర నాయకులూ కొర్ర శ్రీను నాయక్, కొర్ర బాలు నాయక్ ఎంపీటీసీ రాందాస్ ఎల్లమ్మ తండ ఎక్స్ సర్పంచ్ సపవట్ శ్రీదర్ నాయక్ కొర్ర రాజేష్ నాయక్ కొర్ర గణేష్ మంచాల్ మండల అధ్యక్షులు.సాయికుమార్ ,కొర్ర నాని జె లచ్చిరాం నాయక్ శివ .మెగావగణేష్ ఇబ్రహీంపట్నం అధ్యక్షులుసలిగుట్ట. మోతిరాం బావాజీ.పెద్ద భక్తులు నాయకులు ప్రజలు పాల్గొన్నారుగిరిజనుల గురువు సత్ సేవాలాల్ మహారాజ్ గారు ఆనాటి బ్రిటిష్ ప్రభుత్వనికి వ్యతిరేకంగా పోరాటం చేసి గిరిజనులను చైత్యనయం చేసి గిరిజన లంబాడీ ఒక్ జాత్,ఒక్ వాత్,ఒక్ సత్ ఉండాలని అంటే ఒకే జాతిగా ఒకే సమిష్టిగా,ఒకే యూనిటీగామా మా బంజారా జాతి ఉండాలని చేపిన్నారు ఈ రోజు భారత దేశం లోనే 10,కోట్ల జనాభా ఉన్న మా బంజారా సోదరులు అనేక దాడులకు గురౌతున్నారు ఈ దేశంలో 18. కొట్ల మా దళిత సోదరులు ఉన్నారు కానీ ఇప్పటికీ మా జిరిజన దళిత సోదరులు ఆర్థికంగా,సమనట్వలో కులవివక్షలో దళితతలపై గిరిజనులపై దాడులు జరుగుతున్నాయి కానీ మన దేశ అప్పటి ప్రదనమంత్రి శ్రీమతి ఇందిరా గాంధీ గారు 1976 సవరణ చట్టం బిల్లు పార్లమెంట్ లో మైదన లంబాడీ వారికోసం షేడుల్టబ్ తేవడం జరిగింది కానీ మాకు ఇపుడు ఉన్న కేంద్రంలోని బీజేపీ మా లంబాడీలను షెడ్యూల్ ట్రైబల్ నుండి తొలగించాలని చూస్తుంది కావున చేస్తాము అన్ని హెచ్చరించారు.





## మండుటెండల్లో సైతం కాళేశ్వరం నీళ్ళు

**మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి**

**నంగునూరు మండలం, వెలుతురు ఫిబ్రవరి20:** నంగునూరు మండలం రైతులకు మెయిన్ కెనాల్ కాలువ ద్వారా మండలంలో ఉన్నటువంటి గ్రామాలలో చిన్న చిన్న కుంటలు చెరువులలోకి నీళ్లు విడుస్తున్న విషయం తెలిసిందే మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతు ఈ సంవత్సరం కూడా మూడు రోజుల కింద నుండి మన మండలానికి మెయిన్ కెనాల్ ద్వారా నీళ్లను వదిలారు అని తెలిపారు. మండలంలోని ప్రతి గ్రామంలోని చెరువులలోకి నిండు కుండ లాగా నింపుకునే బాధ్యత మన రైతులేదే అన్నారు. కాలువలలో చెత్త చెదరం ఉంటే చెప్పాలన్నారు. ప్రతి కాలువ వెంబడి తిరుగుతూ కాలువలలో నీరును సక్రమంగా వచ్చేటట్టు మా మండల రైతులు నీళ్లు లేక పంట ఎండిపోయే పరిస్థితి రాకూడదని ఏ ఈ రాజు కు విన్నవించారు. ఈ రోజు వెంకటాపూర్ గ్రామంలోని ఎల్ డి 06 కాలువను సందర్శించారు.

ఎండాకాలంలో మన గ్రామాల్లోని చెరువులలో నీళ్లు చూసే భాగ్యం ముమ్మాటికీ బిఆర్ఎస్ ప్రభుత్వ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కెసిఆర్ ద్వారానే అయిందన్నారు. మన చెరువులలో నీళ్లు ఉన్నంతకాలం ఈ రాష్ట్రంలో రాష్ట్ర ప్రజలలో బిఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నట్టే అన్నారు.

ఒకప్పుడు బీడు భూములతో ఉన్న తెలంగాణ నేడు పచ్చదనంతో ఉందంటే మన నీళ్లు మనం కొట్లాడి తెచ్చుకున్న మాట మీకు తెలిసిందే అని మరోసారి గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈ రాజు గ్రామ రైతులు ఎల్ డి 6 వెంకటాపూర్ లస్కర్ కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

6 వెలుతురు

జనరల్ న్యూస్

బుధవారం
21, ఫిబ్రవరి 2024


# బీసీ కులగణన చారిత్రాత్మక నిర్ణయం...

## బీసీ సంఘం మహిళా విభాగం మండల అధ్యక్షురాలు చెర్క సత్తమ్మ

**వెలుతురు న్యూస్ నారాయణపూర్:** బీసీ కులగణన కోసం బీసీలు ఎన్నో సంవత్సరాలుగా పోరాటం చేస్తున్నారని ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న కల సహకారం అయ్యేందుకు రాష్ట్ర ప్రభుత్వం బీసీ కులగణను చేపడతామని అసెంబ్లీలో తీర్మానం చేయడం చారిత్రాత్మక నిర్ణయమని బీసీ సంఘం మహిళా విభాగం మండల అధ్యక్షురాలు చెర్క సత్తమ్మ హర్షం వ్యక్తం చేశారు. బీసీ కులగణన చేయాలని గల్లీ నుంచి ఢిల్లీ వరకు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ నాయకత్వంలో ఎన్నో ఉద్యమాలు చేశామని, మా సంఘ ఉద్యమాల ఫలితమే, ప్రభుత్వం ఇట్టి నిర్ణయాన్ని అసెంబ్లీలో తీర్మానించినందుకు హర్షం వ్యక్తం చేశారు. బీసీల కులగణన ద్వారా జనాభా దామాషా ప్రకారం రాజ్యాధికారంలో బీసీల వాటా పెరుగుతుందని సంతోషం వ్యక్తం చేశారు.



# తెలంగాణ కళావేదిక జిల్లా అధ్యక్షులుగా గజ్జెల వినోద



**కరీంనగర్, వెలుతురు ఫిబ్రవరి 20:** కరీంనగర్ జిల్లా మండలం నగునూర్ గ్రామానికి చెందిన గజ్జెల వినోదను తెలంగాణ కళా వేదిక జిల్లా అధ్యక్షులుగా తెలంగాణ ఉద్యమ గాయిని నియామకం. సంఘం బలోపేతం కోసం పని చేయాలని తెలంగాణ కళా వేదిక రాష్ట్ర అధ్యక్షులు నకిరేకంటి కిరణ్ కుమార్ తెలిపారు.

# ఘనంగా చత్రపతి శివాజీ జయంతి వేడుకలు

## సాయిరామ్ రెడ్డి ఆద్వర్యంలో ర్యాలీ..

**మేడిపల్లి వెలుతురు:** మరాఠా యోధులు చత్రపతి శివాజీ మహారాజ్ యువతకు ఆదర్శ ప్రాయుడని పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ జక్క వెంకట్ రెడ్డి అన్నారు.పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిదిలోని బుద్దానగర్ శంషాబాద్ సాయిరాం రెడ్డి ఆద్వర్యంలో చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి భారి ర్యాలి నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ చత్రపతి శివాజీ మహరాజ్ బహుజన చక్రవర్తని పరమత సహనం పాటించి మహిళల పట్ల గౌరవభావం వ్యవహరించి భారతీయ సంస్కృతి సంప్రదాయాలను ప్రపంచ దేశాలకు చాటిచెప్పిన గోప్ప మహనీయులని ఆయన కొనియడారు.సమాజంలో అన్ని కుల



మతాలకు అతీతమైన వ్యక్తిగా చత్రపతి శివాజీ ఎందరో గుండెల్లో చిరస్థాయిగా నిలిచారని మాతృభూమి సేవకై దేశ సేవను ప్రామాణికంగా చేశాడని అన్నారు.విదేశి కుట్రలు సామ్రాజ్య వాద శక్తులకు వ్యతిరేకంగా పోరాడి భారతీయ సంస్కృతి సాంప్రదాయలను ఎలుగెత్తి చాటిన మహనీయులు చత్రపతి శివాజీ ఒక్కరేనని ఆయన తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మిరపకాయల సంతోష్ రెడ్డి,ప్రభాకర్ రెడ్డి,రాజ శేఖర్ రెడ్డి,మధు,మల్లికార్జున్ యాదవ్,శ్రీకాంత్,మనిదీప్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి విజయ సంకల్ప యాత్రలో పాల్గొన్న అర్చనపల్లి సూర్యరావు...

**కూకట్‌పల్లి, వెలుతురు:** దేశం కోసం మోదీ - మోదీ కోసం మనం అంటు భువనగిరి జిల్లా లోని ప్రభుత్వ కలశాలలో భాగ్యలక్ష్మి క్లస్టర్ కు సంబంధించిన విజయ సంకల్ప యాత్ర రథాల ప్రారంభోత్సవంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అర్చనపల్లి సూర్యారావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గోవా ముఖ్య మంత్రి డాక్టర్ ప్రమోద్ సావంత్, ఈటెల రాజేందర్, హాజరయ్యారు. ఈ సందర్భంగా యాదాద్రి లక్ష్మి నరసింహ స్వామీ ఆశీర్వాదంతో భాగ్యలక్ష్మీ క్లస్టర్ విజయ సంకల్ప బస్సుయాత్ర కచ్చితంగా విజయ వంతం అవుతుందని భువనగిరి ఎంపీ సీటు గెలిచి ప్రధాని నరేంద్ర మోడీకి బహుమతిగా ఇస్తామని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ ఎన్.వి.వి.ఎస్ ప్రభాకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి క్యాశం వెంకటేశ్వార్, జిల్లా అధ్యక్షుడు క్యాశం భాస్కర్,మాజీ ఎం.పి బుర నర్సయ్య గౌడ్, ,పెద్దఎత్తున బీజేపీ కార్యకర్తలు అభిమానులు భువనగిరి జిల్లా ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# ప్రోత్సాహం

అనగనగా నాగపూర్ అనే ఒక ఊరిలో నరసయ్య, నరసవ్వ దంపతులు ఉండేవారు. వారికి ఒక్కగానొక్క కూతురు సీత. సీతా వాళ్లది చాలా పేద కుటుంబం. సీత వాళ్ళ అమ్మానాన్న పొలం పని చేస్తూ ఇంటిని పోషిస్తున్నారు. అలాగే సీతను కూడా చదివిపించసాగారు. సీతా బాగా చదువుకుంటూ పాఠశాలలో మొదటి స్థానంలో నిలుస్తుంది. పేద కుటుంబం కావడం మూలంగా పదవ తరగతి తర్వాత ఏం చేయాలి అని సీత ఆలోచించసాగింది.

ఒకరోజు సీత పొలం పనులకు వెళుతుంది. సీతను చూసిన ప్రసాద్ సార్ చాలా బాధపడుతాడు. ఎలాగైనా తాను సీతను చదివిపించాలని అనుకుంటాడు. తాను డబ్బులు ఇస్తే సీత చదువుకోదని తన మిత్రుల సహకారంతో కొంత డబ్బు ప్రోగు చేసి సీతకు ఇస్తారు. సీత బాగా చదువుకుంటుంది. వీలైనప్పుడు పొలం పని, ఇంట్లో పనులు కూడా చేయసాగింది.

తల్లిదండ్రులే కాకుండా ఇతరులు కూడా చదువుకు సహాయం చేయడం పట్ల సీత ఎంత కష్టమైనా ఇష్టంగా చదువుకొని ఉపాధ్యాయురాలుగా ఉద్యోగం సంపాదిస్తుంది. తన చదువు కోసం సహాయం చేసిన ప్రసాద్ మాస్టర్ మిత్రుల విలువ తెలుసుకొని తాను సంపాదించిన డబ్బులలో కొంత తన గ్రామంలోని పేద విద్యార్థులకు ఇచ్చి చదివించసాగింది. సీతను స్ఫూర్తిగా తీసుకొని వారు కూడా చదువుకుని ఉద్యోగాలు పొందసాగారు.

**నీతి: ఎంత కష్టమైనా ఇష్టంగా చదువుకుని, పొందిన ప్రోత్సాహనికి తిరిగి సహాయంతో గౌరవించాలి.**



**అక్షయ**
**ఎనిమిదవ తరగతి**
**ZPHS హవేలీ ఘనపూర్, మెదక్ జిల్లా**
**9959730286**



మంటల్లో లభ్యం అయినా బంగారు నగలు.





మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది, మంటల్లో దగ్ధమైన వంట సామాగ్రి, ద్విచక్ర వాహనం.

# కరీంనగర్‌లో భారీ అగ్ని ప్రమాదం

## - ప్రమాదానికి కారణం జిలిటెస్టిక్స్..?

**కరీంనగర్, వెలుతురు, ఫిబ్రవరి 20:** మంగళవారం ఉదయం సుభాష్ నగర్‌లోని ఓ ప్రయివేట్ ఆసుపత్రిని అనుకోని ఉన్న పూరి గుడిసెల్లో భారీగా మంటలు చెలరేగాయి. మంటల ధాటికి దాదాపు ఐదు ఇళ్లలో గ్యాస్ సిలిండర్లు పేలాయి. ఈ పేలుడు కారణంగా



ఘటన స్థలంలో రోదిస్తున్న బాలిక, మహిళా..

చుట్టు పక్కల ప్రాంతాలకు మంటలు వ్యాపించాయి. విషయం తెలిసిన వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలు ఆర్పారు. 20 గుడిసెలు పూర్తిగాను, 5 గుడిసెలు పాక్షికంగా కాలిపోయాయి. ఆ గుడిసెల్లో నివసించే కార్మికులంతా మట్టి పని చేసేవారే దింతో వారి దగ్గర జిలిటెన్ స్టిక్స్ ఉన్నాయేమోనని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అక్కడ నివసించే వారంతా మేడారం జాతరకు కుటుంబ సమేతంగా తరలి వెళ్లడంతో పెను ప్రమాదం తప్పింది. వివిధ ప్రాంతాల నుంచి వలస వచ్చి గత 20 ఏళ్లుగా కార్మికులు ఆ పూరి గుడిసెల్లో నివాసం ఉంటున్నట్లు సమాచారం. ఈ ప్రమాద సమయంలో గుడిసెలల్లో ఎవరూ లేకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. అగ్ని ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని చెప్పారు. సంఘటన స్థలాన్ని ఎమ్మెల్యే గంగుల కమలాకర్, నగర మేయర్ సునీల్ రావు, బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగిడి కృష్ణారెడ్డి, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ఇతర నాయకులు పరిశీలించారు.

### తప్పిన పెను ప్రమాదం

అగ్ని ప్రమాదం జరిగిన స్థలం పక్కనే ప్రముఖ ప్రైవేట్ ఆసుపత్రి ఉండడం మంటలు అటువైపుగా వ్యాపించి ఆసుపత్రిలోకి వెలితే ప్రమాదం చాలా తీవ్రంగా ఉండేది ఆసుపత్రిలో వందలాది మంది రోగులు, వారి బంధువులు ఉన్నారు. ప్రమాదం సంభవించిన కొద్ది నిమిషాల్లోనే ఆసుపత్రి ప్రధాన డాక్టర్ బంగారు స్వామి వారి సిబ్బంది స్పందించి మంటలను అటువైపుగా వెళ్లకుండా అదుపులోకి తెచ్చారు.

# ఎంపీ బండి సంజయ్ దాతృత్వం

## - అగ్నిప్రమాద బాధితులకు నిత్యవసర వస్తువులు వంట పాత్రలు అందించిన ఎంపీ...

**కరీంనగర్, వెలుతురు, ఫిబ్రవరి 20:** పట్టణంలోని అగ్ని ప్రమాదానికి గురైన దాదాపు 30 పూరి గుడిసెల బాధిత కుటుంబాల పట్ల ఎంపీ బండి సంజయ్ కుమార్ దాతృత్వాన్ని చాటుకున్నారు. ఘటనపై ఎంపీ బండి సంజయ్ కుమార్ చలించి పోయారు. అక్కడి నిరుపేద కుటుంబాల కోసం కరీంనగర్ బిజెపి శ్రేణుల ద్వారా అవసర మైన నిత్యావసర వస్తువులు, వంట పాత్రలను ఇతర సామాగ్రిని మంగళవారం రాత్రి అందించారు. గుడిసెలు దగ్ధమై నిలువ నీడ లేక ఉన్న కుటుంబాల కోసం అండగా నిలవాలని, ఆయా కుటుంబాలకు ఇంటి సదుపాయం కలిగే వరకు వారికి ఉదయం మధ్యాహ్నం రాత్రి వేళల్లో భోజన సదుపాయం అందించాలని బీజేపీ శ్రేణులకు ఆయన సూచించారు. కార్యక్రమంలో బాస సత్యనారాయణ, దుబ్బల శ్రీనివాస్, గుగ్గిల రమేష్, రాపర్తి ప్రసాద్, కటకం లోకేష్ , దురుశెట్టి సంపత్ , ఎండీ ముజిప్, ఉప్పరపల్లి శ్రీనివాస్, అనిల్, ప్రసన్న, అవుదుర్తి శ్రీనివాస్, శివరాజ్ , బషీర్ కార్పొరేటర్ కోలగని శ్రీనివాస్, బండ రమణారెడ్డి, రాపర్తి విజయ, పెద్దపెల్లి జితేందర్, బండారు గాయత్రి, తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా శ్రీశ్రీశ్రీ వీరాంజనేయ శివాలయం 17వ వార్షికోత్సవం

**కూకట్‌పల్లి, వెలుతురు:** కూకట్ పల్లి డివిజన్ పాపిరెడ్డి నగర్ లోని శ్రీశ్రీశ్రీ వీరాంజనేయ శివాలయం 17వ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం ఆలయ కమిటీ సమక్షంలో ఘనంగా జరిగాయి. ఆలయ అర్చకులు పరాంకుశం వెంకటాచార్యులు, పూజారి గంగాధర్ స్వాముల ఆధ్వర్యంలో ఉదయం నుంచి చేపట్టిన ప్రత్యేక పూజా కార్యక్రమాలకు భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరేకపూడి గాంధీ, పాపిరెడ్డి నగర్ బస్తి అధ్యక్షుడు ఊట్ల చంద్రారెడ్డి, హనుమాన్ నగర్ అధ్యక్షుడు మనోళ్ల విఠల్, నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వర రావు, గొట్టిముక్కల పెద్ద భాస్కర్ రావు, సంజీవ్ రెడ్డిలు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. గత 17 సంవత్సరాలుగా శ్రీశ్రీశ్రీ వీరాంజనేయ శివాలయం కొలిచే వారి కొంగు బంగారంగా నిలవడం భక్తులు చేసుకున్న



పూర్వజన్మ సుకృతమని, అది ఎంతోగానో ఆనందాన్ని కలగజేస్తుందని ఆలయ కమిటీ చైర్మన్ గడ్డం రాజేశ్వర్ రెడ్డి , అధ్యక్షుడు పేర్ని ధర్మారావు లు తెలిపారు. సాయంత్రం మహిళల కోలాటాల నడుమ ఉత్సవ మూర్తులను పుర వీధుల్లో ఊరేగిస్తూ భక్తి భావనలో తేలునాడారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గడ్డం రాజేశ్వర్ రెడ్డి , అధ్యక్షుడు పేర్ని ధర్మారావు , ప్రధాన కార్యదర్శి దొడ్ల రామ్ రెడ్డి , కోశాధికారి కిరణ్ కుమార్, బస్తి అధ్యక్షుడు ఊట్ల చంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి భగవంత రెడ్డి , కోశాధికారి నరసింహులు ముదిరాజ్ , సభ్యులు చర్ల రామకృష్ణారెడ్డి , అనంత రాములు, ప్రభాకర్, నర్సిరెడ్డి , కన్నారావు, వనం ఆంజనేయులు, హనుమంత్ రెడ్డి, శంకర్ రెడ్డి ,కనకా రెడ్డి , తడకల రాజిరెడ్డి , సాంబశివుడు, సురేష్ , పాండు గౌడ్ , ముత్యం వెంకట్ రెడ్డి, శేఖర్ రెడ్డి ,శరత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గత 10 ఏళ్లలో బిఆర్ఎస్ చేసిందేముంది

## శేర్లింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు

**శేర్లింగంపల్లి వెలుతురు:** శేరిలింగంపల్లి బిఆర్ఎస్ ఎమ్మెల్యే సోమవారం జిహెచ్ఎంసి కౌన్సిల్ లో కాంగ్రెస్ వాళ్ళు కొత్త బిచ్చగాళ్లు అంటు చేసిన వ్యాఖ్యల్ని శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు ఏకాంత్ గౌడ్, చిరుమూర్తి రాజు, అల్వాల్ భాస్కర్ లు తిప్పి కొట్టారు. బిఆర్ఎస్ వాళ్లు కొత్త బిచ్చగాళ్లుగా మారి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. పదేళ్లు అధికారంలో ఉండి తెలంగాణకు ఏం చేశారు చెప్పాలని డిమాండ్ చేశారు. గత పదేళ్లలో అభివృద్ధి చేపట్టకనే నేడు ప్రజాపాలన కాంగ్రెస్ ప్రభుత్వం పై కాంగ్రెస్ నాయకుల పై నమ్మకంతో శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని అనేక కాలనీ అసోసియేషన్ సభ్యులు,తమ గోడును విన్నవించుకుంటున్నారని అన్నారు. అభివృద్ధి అంటే స్కైవేలు, అండర్ పాస్ బ్రిడ్జిలు, కాదు, అని గత పది సంవత్సరాలలో బస్తిలలో, కాలనిలలో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం లో బిఆర్ఎస్ కు వ్యతిరేకంగా సుమారు 1,90,000 వేల ఓట్లు వేసి ప్రజలు వారి కోపాన్ని చూపించారాని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలుగా నిత్యం ప్రజాల్లోనే ఉండే ప్రజా సేవకులం, అని ప్రజలు మా వైపు నమ్మకం చూపుతున్నారనే స్థానిక ఎమ్మెల్యే అసహనానికి గురవుతున్నారని అన్నారు.



# బిజెపి దళిత మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నకిరకంటి మొగులయ్య

**రామన్నపేట యాదాద్రి జిల్లా, వెలుతురు న్యూస్:** బిజెపి దళిత మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు నియామకపుత్తరులను మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ జారీ చేశారు. ఈయన బిజెపిలో రెండు దశాబ్దాలుగా క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. 1994లో బిజెపి మండల ప్రధాన కార్యదర్శిగా ఈయన రాజకీయ ప్రస్థానం పార్టీలో ప్రారంభమైంది .1998లో మండల పార్టీ అధ్యక్షుడిగా 2004లో బిజెపి దళిత మోర్చా ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. 2007లో పార్టీ దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు 2009లో బిజెపి జిల్లా కార్యదర్శిగా ఇదే సంవత్సరంలో జరిగిన శాసనసభ ఎన్నికల్లో నకిరేకల్ భాజపా అభ్యర్థిగా పోటీ చేశారు 2011లో బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా 2014లో బిజెపి జిల్లా కార్యదర్శిగా 2019 నుంచి ఇటీవల వరకు బిజెపి యాదాద్రి జిల్లా ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు 2023 లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో నకిరేకల్ బిజెపి అభ్యర్థిగా మరోసారి పోటీ చేశారు 2013 నుంచి 18 వరకు రామన్నపేట సర్పంచిగా కొనసాగారు. ఈ సమయంలో రాష్ట్ర సర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా పని చేశారు రాష్ట్ర దశాబ్దాల కాలంగా పార్టీకి చేస్తున్న సేవలను గుర్తించిన అధిష్టానం ప్రస్తుతం పార్టీ దళిత మోర్చా ప్రధాన కార్యదర్శిగా నియమించింది. ఈ సందర్భంగా నగరికంటి మొగులయ్య రామన్నపేటలో మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపి గెలుపే లక్ష్యంగా పనిచేస్తానని తెలిపారు. తన నియామకానికి సహకరించిన మంత్రివర్యులు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జి కిషన్ రెడ్డి , బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు శ్రీమతి బంగారు శృతి , డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పివి శ్యాంసుందర్రావు , యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు పాశం భాస్కర్ , నల్లగొండ జిల్లా అధ్యక్షులు నాగం వర్షిత్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.




# నేడే గర్ల్స్ హై స్కూల్‌లో కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభించనున్న మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు

## చదువుకు సాంకేతిక చేయూత సిద్దిపేట గర్ల్స్ హై స్కూల్ కు కార్పొరేట్ హంగులు

## టిహెచ్ఆర్ కంప్యూటర్ ల్యాబ్

## మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు గారి చొరవతో సిఎస్ఆర్ నిధులతో సిద్దిపేట గర్ల్స్ హై స్కూల్ లో డిజిటల్ విద్యా బొదన

**సిద్దిపేట టౌన్, వెలుతురు ఫిబ్రవరి 20:** సిద్దిపేట నియోజకవర్గం మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు కృషితో విద్యా రంగంలో విరాజిల్లుతుంది ఇప్పటికే ఇందిరా నగర్ ప్రభుత్వ పాఠశాల గత ప్రభుత్వం లో హరీష్ రావు చొరవ తో నాట్కో వారి సౌజన్యం తో డిజిటల్ బొదన కంప్యూటర్ ల్యాబ్ తో కార్పొరేట్ స్థాయి లో తీర్చిదిద్దారు అదే తరహా లో మల్టి పర్పస్ హై స్కూల్ గర్ల్స్ హై స్కూల్ లను అభివృద్ధి చేశారు ప్రస్తుతం గర్ల్స్ హై స్కూల్ లో మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు కృషి చొరవ తో డిజిటల్ కంప్యూటర్ ల్యాబ్ ఇంగ్లిష్ మీడియం విద్యార్థుల కు డిజిటల్ బొదన కు 8 క్లాస్ రూమ్స్ లో 8 స్క్రీన్ లు ఏర్పాటు చేశారు దాదాపు 50లక్షల సిఎస్ఆర్ నిధులతో గర్ల్స్ హై స్కూల్ లో కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు అయింది పనులు పూర్తి అయి రేపు బుధవారం రోజున మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు ప్రారంభించనున్నారు...
హరీష్ రావు ప్రత్యేక చొరవ సి ఎస్ ఆర్ నిధులతో




రూ.50 లక్షలతో జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ వారి సహకారంతో సిఎస్ఆర్ నిధుల తో మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు చొరవ తో 21కంప్యూటర్స్ తో కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు చేశారు పాఠ్యంశాలు ఆన్ లైన్ మాద్యమంగా నేర్చుకొనేల అదేవిదంగా ఎనిమిది క్లాస్ రూమ్స్ లో డిజిటల్ పాఠ్యంశాల బోధనకు 8ప్యానల్ బోర్డ్స్ ఏర్పాటు చేశారు దీనితో బొదన మరింత విద్యార్థుల మెదడు కి అర్థం అయ్యేల వారి మేధస్సు ను పెంచేల ఇప్పటి నుండే సాంకేతిక విద్యను ప్రోత్సహించనున్నారు.. ఇది విద్యార్థులకు ఎంతో మేలు కానుంది మా పాఠశాలను ఒక కార్పొరేట్



స్థాయి లో అభివృద్ధి చేస్తూ కంప్యూటర్ ల్యాబ్ ను ఏర్పాటు చేసిన మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావుకి విద్యార్థులు ఉపాధ్యాయులు ధన్యవాదాలు తెలిపారు ఒక అన్నల ఒక తండ్రి ల మాకు అన్ని రకాల విద్య ను ప్రోత్సహిస్తు పేద విద్యార్థుల్లో వెలుగులు నింపుతున్న హరీష్ రావు గారికి విద్యార్థులు మనస్ఫూర్తిగా థ్యాంక్స్ హరీష్ రావు సార్ అంటూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# లవ్లీ లాంగ్ గౌన్స్!

సెలబ్రేషన్స్‌లో వెలిగిపోవాలంటే... ఆకర్షణీయమైన ఈవెనింగ్ గౌన్స్ తప్పనిసరి. శాటిన్, నెటెడ్, సెక్విన్, ఎంబ్రాయిడరీ... ఇలా లాంగ్ గౌన్స్‌లో బోలెడన్ని వెరైటీలు. వాటిలో నప్పే గౌన్ ఎంచుకుంటే సెలబ్రెషన్ 'స్టార్' మీరే!





## బుట్ట బొమ్మల్లా!

నడుము కింద నుంచి వెడల్పుగా విస్తరించినట్టు కనిపించే గౌన్‌లో కూడా దేవకన్యలా వెలిగిపోవచ్చు. ఇందుకోసం గౌన్‌లో ఎక్కువ లేయర్లు ఉండేలా చూసుకోవాలి. అలాగని గౌన్ అసౌకర్యంగా, బరువుగా ఉండకూడదు. చూడడానికి భారీగా కనిపించినా, ధరించడానికి తేలికగా ఉండాలి.





## శాటిన్ గౌన్

సింపుల్‌గా, ఎలిగెంట్‌గా కనిపించాలనుకుంటే శాటిన్ మేడ్ లాంగ్ గౌన్ ధరించాలి. పార్టీలకు నప్పే ఈ గౌన్ బరువు కూడా చాలా తక్కువ. కాబట్టి క్రిస్మస్ వేడుకల్లో హుషారుగా పాల్గొనాలనుకుంటే, శాటిన్ గౌన్ బెస్ట్ ఆప్షన్!

## లేయర్ లాంగ్ గౌన్!

నిలువుగా ఒకే పొడవుతో ఉండే గౌన్ బోరు కొట్టిందా! అయితే అలలు అలలుగా ఎగసిపడే లేయర్ గౌన్ ఎంచుకోండి. ఛాతీ దగ్గర సెక్విన్ వర్క్‌తో, నడుము కింద నుంచి ప్లెయిన్‌గా ఉండే లేయర్ లాంగ్ గౌన్ నాజూకుగా కనిపించేలా చేస్తుంది. ఈ డ్రెస్‌తోపాటు, మెడలో చోకర్, చెవులకు స్టడ్స్ జోడిస్తే అలంకరణ పూర్తయినట్టే!

## యువత మదిలో

# ఫ్యాషన్ మంత్ర

ఫ్యాషన్ రంగంలో యువత ఆకాశమే హద్దుగా దూసుకెళ్తోంది. అందుకే ఏ ఊళ్లో చూసినా ఫ్యాషన్ అంటే యువత ప్రత్యేక ఆసక్తి చూపుతోంది. ఇక ఫ్యాషన్‌కు కేరాఫ్ అడ్రస్‌గా హైదరాబాద్ ఫ్యాషన్ డిజైనర్లు జాతీయ, అంతర్జాతీయ వేడుకల్లో టాలెంట్ చూపిస్తున్నారు. సత్తా చాటుతున్నారు. ఫ్యాషన్ రంగంలో హైదరాబాద్ రోజురోజుకు కొంతపుంతలు తొక్కుతోంది. నయా ట్రెండ్‌కు భాగ్యనగరం కేరాఫ్ అడ్రస్‌గా మారుతోంది.

ఫ్యాషన్ ఎగ్జిబిషన్‌లు, ఎక్స్‌పోలు, ర్యాంప్ వాక్‌లు సిటీలో 24/7 ఫ్యాషన్ హంగామా నడుస్తోంది. అందుకే యువత కూడా ఫ్యాషన్‌పై క్రేజ్ పెంచుకుంటున్నారు. ప్రతీదాన్ని ఫ్యాషన్ యాంగిల్‌లో థింక్ చేస్తున్నారు. లైఫ్‌స్టైల్ మొత్తం మార్చేసుకుంటున్నారు. తమ జీవితాన్ని తామే అందంగా తీర్చదిద్దుకుంటున్నారు. చదువులోనూ ఫ్యాషన్ కోర్సులనే ఎంచుకుంటున్నారు. పెద్దపెద్ద ఫ్యాషన్ డిజైనర్లను ఆదర్శంగా తీసుకుని ట్రెండ్ ఫాలో అవకుండా ట్రెండ్ సెట్ చేస్తున్నారు.

ఫ్యాషన్....ఫ్యాషన్....ఫ్యాషన్... ఎక్కడ చూసినా...ఏ నోట విన్నా... ఎవరిని కదిలించినా ఇదే మాట వినిపిస్తోంది. లైఫ్‌లో ఎన్ని టెన్షన్లు ఉన్నా, ఎన్ని ప్రాబ్లమ్స్ ఫేస్ చేస్తున్నా ఫ్యాషన్‌ను మాత్రం ఎవ్వరూ మిస్ అవడం లేదు. కాలం కంటే స్పీడ్‌గా పరిగెత్తి ప్రపంచాన్నే దున్నేయాలని అమ్మాయిలు, అబ్బాయిలు ఉత్సాహంగా ఉన్నారు. వ్యాపార రంగంలో అద్భుతాలు సృష్టించాలి అనుకునే వారికి ఫ్యాషన్ రంగంలో టన్నుల కొద్దీ అవకాశాలు ఉన్నాయి. నగరానికి చెందిన అనేక మంది ఫ్యాషన్ డిజైనర్లు ట్రెండ్స్‌ను ఒడిసి పట్టుకోవడం ద్వారా వ్యాపార, వాణిజ్య రంగాల్లో తమదైన శైలిలో దూసుకుపోతున్నారు.



**ఫ్యాషన్ ఎగ్జిబిషన్‌లు, ఎక్స్‌పోలు, ర్యాంప్ వాక్‌లు సిటీలో 24/7 ఫ్యాషన్ హంగామా నడుస్తోంది. అందుకే యువత కూడా ఫ్యాషన్‌పై క్రేజ్ పెంచుకుంటున్నారు. ప్రతీదాన్ని ఫ్యాషన్ యాంగిల్‌లో థింక్ చేస్తున్నారు. లైఫ్‌స్టైల్ మొత్తం మార్చేసుకుంటున్నారు. తమ జీవితాన్ని తామే అందంగా తీర్చిదిద్దుకుంటున్నారు. చదువులోనూ ఫ్యాషన్ కోర్సులనే ఎంచుకుంటున్నారు. పెద్దపెద్ద ఫ్యాషన్ డిజైనర్లను ఆదర్శంగా తీసుకుని ట్రెండ్ ఫాలో అవకుండా ట్రెండ్ సెట్ చేస్తున్నారు.**

ఒకప్పుడు ఢిల్లీ, ముంబై, బెంగళూరు నగరాలకు పరిమితమైన ఫ్యాషన్ ఉత్పత్తులు ఇప్పుడు హైదరాబాద్‌లో కూడా జెండా పాతేశాయి. దీంతో దేశ విదేశాలకు ఫ్యాషన్ డిజైనర్లను ఎగుమతి చేసే స్థాయికి భాగ్యనగరం చేరుకుంది. ఫ్యాషన్ డిజైనింగ్ అంటే కేవలం డిజైనింగ్ మాత్రమే అనే అపోహ చాలా మందిలో ఉంది. కానీ ఇది నిజం కాదు. డిజైనింగ్ అంటే ఏ రంగంలో అయినా కొత్తగా ఆలోచిస్తేనే అదే ఫ్యాషన్...అదే లేటెస్ట్ ట్రెండ్. ఎప్పుడొచ్చామన్నది కాదన్నయ్యా...బుల్లెట్టు దిగిందా లేదా? అన్నది పాయింట్ అనేది ఓల్డ్ డైలాగ్. సిట్యువేషన్ ఏదైనా... సీన్ ఎలాంటిదైనా చించేశామా లేదా అన్నదే లేటెస్ట్ వెపన్ అంటోంది యువత.

స్టైలింగ్, స్టిచిస్, క్లాత్ డిజైనింగ్, టైలరింగ్ కూడా ఫ్యాషన్ డిజైనింగ్ కిందకే వస్తాయి. ఫ్యాషన్ డిజైనర్లుగా స్థిరపడాలనుకునే వారికి ఈ రంగంలో ట్రైనింగ్ ఇవ్వడానికి సిటీలో చాలా కాలేజీలు ఉన్నాయి. ఫ్యాషన్ ప్రతిఒక్కరి లైఫ్‌స్టైల్‌ను మార్చేస్తోంది. హెయిర్ స్టైల్ నుంచి షూవేర్ వరకు ఫ్యాషన్ మంత్రి ఉండాల్సిందే. అందుకే సిటీలోని యువతే కాకుండా చిన్నచిన్న పట్టణాల్లో యువత కూడా ఫ్యాషన్‌కే జై కొడుతోంది. మొత్తానికి హైదరాబాద్ ఫ్యాషన్ హబ్‌గా మారుతోంది.

## గోళ్ళపై పూల పరిమళం!

కాస్త ఆసక్తి, అభిరుచి ఉంటే గోళ్ళను కూడా కాన్వాసుగా చేసుకోవచ్చు. నెయిల్ ఆర్ట్‌లో ప్రస్తుతం ఫ్లోరల్ డిజైన్స్ ట్రెండ్ నడుస్తోంది. నియోన్, కూల్ రంగుల నెయిల్ పాలిష్‌లను ఉపయోగించి గోళ్ళపై రకరకాల పూలను డిజైన్ చేసుకోవచ్చు. మీ వ్యక్తిత్వం, మూడ్, వేడుకను బట్టి కూడా ఫ్లోరల్ డిజైన్లను గోళ్ళపై వేసుకోవచ్చు. మెనిక్యూర్ చేసిన తర్వాత గోళ్లను హైలైట్ చేస్తూ వాటిపై నచ్చిన పువ్వులను వేస్తే ఆ లుక్కే వేరు. అప్పుడు చేతికున్న పది వేళ్లు పది కాన్వాసులను తలపిస్తాయి.

ఒక గోరుపై పూలు వేయాలంటే చుక్కల కోసం చిన్న పిన్ను, స్లెండర్ డిజైన్ బ్రష్, మూడు నెయిల్ పాలిష్ రంగులు అవసరమవుతాయి. ముందుగా హైలెట్ కావాలనుకుంటున్న రంగు నెయిల్ పాలిష్‌ను స్లెండర్ డిజైన్ బ్రష్‌తో గోరుపై వేయాలి. నెయిల్ ఆర్ట్‌లో డాటింగ్ టూల్స్ రకరకాల సైజుల్లో ఉంటే పువ్వులు మరింత క్లారిటీగా కనిపిస్తాయి. వాటితో చుక్కలు బాగా ఎలివేట్ అవుతాయి. గోళ్లపై పువ్వుల డిజైన్లు వేయడానికి బద్ధకించే వారి కోసం మార్కెట్లో ఫ్లోరల్ స్టెన్సిల్స్ కూడా లభిస్తాయి.

## ఆన్‌లైన్‌లో ఫ్యాషన్ షాపింగ్

ఆన్‌లైన్ అలవాటయ్యాక ఫ్యాషన్ మంత్రం పఠించేవాళ్ల సంఖ్య పెరిగిపోయింది. ఒక్క క్లిక్‌తో నచ్చిన కాస్ట్యూమ్స్ వచ్చేస్తుండటంతో ఆన్..లైన్స్ ఆర్ బిజీ అయిపోతున్నాయి. ఓ కన్సల్టింగ్ సంస్థ నిర్వహించిన సర్వేలో ఆన్‌లైన్ అంగట్లో ఫ్యాషన్ పొటెన్షియల్ ఏ రేంజ్‌లో ఉందో వెల్లడైంది.

**ఆన్‌లైన్‌లో ఫ్యాషన్ షాపింగ్ చేస్తున్న మహిళల సంఖ్య..**

2015లో 1.5 కోట్లు , 2020లో 7.5 కోట్లు

**ఫ్యాషన్ ట్రెండ్స్ గురించి ఆన్‌లైన్‌లో షేర్ చేసుకుంటున్న మహిళల సంఖ్య గతేడాదితో పోలిస్తే 2020 నాటికి 110% పెరగనుంది.**

2015లో 20% , 2020లో 42%

గూగుల్‌లో సెకనుకొకరు నయా ఫ్యాషన్స్ గురించి సెర్చ్ చేస్తున్నారు.

ఆన్‌లైన్ రిటైల్ మార్కెట్‌లో ఫ్యాషన్ సెక్టార్ వాటా ఈ ఏడాది 20% ఉంటే..



వచ్చే ఏడాది నాటికి 2325% వరకు పెరగనుంది.

ఆన్‌లైన్‌లో ఫ్యాషన్ రెవెన్యూ వచ్చే ఏడాది 3540% అధికంగా నమోదయ్యే అవకాశం ఉంది.

ప్రస్తుతం ఆన్‌లైన్‌లో ఎలక్ట్రానిక్ వస్తువులదే రాజ్యం. అయితే 2020 నాటికి ఆన్‌లైన్ మార్కెటింగ్ కస్టమర్లలో ప్రతి ముగ్గురిలో ఒక్కరు లైఫ్‌స్టయిల్‌ఫ్యాషన్ ప్రొడక్ట్స్ కొనుగోలు చేస్తారని అంచనా.



మెరిసేదంతా బంగారం కాదు! అలాగని మేలిమి పసిడి తళుకులను అనుమానించ రాదు. నిన్నటి ధనత్రయోదశి మొదలు రేపటి దీపావళి, ఆపై వచ్చే కార్తీక మాసం, ఆ నెలలో వచ్చే వివాహాది శుభకార్యాలు వెరసి రానున్న రోజుల్లో మార్కెట్ స్వర్ణకాంతులీననుంది. ఇదే అదునుగా బంగారంలాంటి ఆఫర్లు ఊరిస్తున్నాయి. అయితే ఈ ప్రకటనలకు చిత్తుకాకుండా నిఖార్సయిన పుత్తడిని పొందాలంటే ఈ జాగ్రత్తలు పాటించండి.

మజూరీ లేదు.. తరుగూ లేదు.. జీరో మేకింగ్ చార్జెస్.. కనీవినీ ఎరుగని మెగా డిస్కౌంట్.. ఈ ప్రకటనలు వింటే చాలు ఎంత కాంతలైనా కనక దాసులు అయిపోతారు. పసిడి మెరుపులు మెరిసే దుకాణాల్లో నగనిగలు చూసి కాసేపు అన్నీ మర్చిపోతారు. ఈ వీక్‌నెస్ ఉన్నట్లయితే పైడి మాయలో పడి అసలు విషయాలను విస్మరించే ప్రమాదం ఉంది. అందుకే దుకాణాదారులు ఎంత తెలివిగా మాట్లాడినా.. ప్రాథమిక విషయాలపై స్పష్టత ఉండాలి. ఇన్ని ఆఫర్లు ఇస్తున్నారంటే కాస్త ఆలోచించాల్సిందే.


# బంగారంలాంటి మాట


బిస్కెట్ బంగారం తీసుకున్నా.. జ్యువెలరీ తీసుకున్నా.. బంగారం స్వచ్ఛత గురించి ముందుగా అడిగి తెలుసుకోవాలి. దక్షిణభారతంలో చాలావరకు నగలన్నీ 22 క్యారెట్ల బంగారంతో చేస్తుంటారు. అయితే ధరల విషయంలో హెచ్చుతగ్గులు గోల్డ్ ప్యూరిటీని బట్టే ఉంటాయి. సదరు వస్తువు 22 క్యారెట్లతో చేసిందా? 18 క్యారెట్లా, 14 క్యారెట్లతో తయారు చేసిందా..? అని వస్తువు కొనడానికి ముందే ఒకటికి రెండుసార్లు చెక్ చేసుకోవాలి. గోల్డ్ మంచిదైనా ఆభరణంలో పొదిగిన రాళ్లు, రత్నాల నాణ్యతపైనా ఓ కన్నేయాలి. ముఖ్యంగా సేల్స్‌పర్సన్ చెప్పే మాటలు గుడ్డిగా నమ్మొయొద్దు. కొనడానికి ముందే ఎక్స్‌చేంజ్ చేయడానికి ఎలాంటి షరతులు ఉన్నాయో గమనించాలి. అన్నీ ఓకే అనుకుంటే తప్ప కొనుగోలు చేయరాదు.

పండుగల వేళ ఎక్స్‌చేంజ్ ఆఫర్లు బాగా ఆకర్షిస్తాయి. అయితే తెలియని నిబంధనలు చాలానే ఉంటాయి. ఆ నిబంధనలు మీకు అర్థమైతే తప్ప ముందడుగు వేయరాదు. స్వచ్ఛత విషయంలో ఓల్డ్ ఈజ్ గోల్డ్ అన్నది కాదనలేని సత్యం. కాకపోతే 'ప్యూరిటీ తక్కువగా ఉందని, తరుగు ఎక్కువ అవుతుందని' ఏవో మాటలు చెప్పి దాని విలువ అమాంతంగా తగ్గించేస్తారు. అందుకే.. పాతనగలు మార్చే విషయంలో కాస్త మంచిచెడులు బేరీజు వేసుకోండి. బంగారం తూకంలో మిల్లీగ్రాములు లెక్కించడం కూడా చాలా ముఖ్యం. ఒకటికి రెండు సార్లు వెయిట్ చెక్ చేయడం తప్పనిసరి. ఇవన్నీ పాటిస్తేగాని మీ ఇల్లు మేలిమి బంగారం కాదు! చిన్న ఉంగరమైనా.. పెద్ద వడ్డాణమైనా.. ఏదైనా సరే బంగారంతో చేసిందైతే ఆ వస్తువుపై ఈ అయిదు గుర్తులు ఉన్నాయో లేదో తప్పకుండా పరిశీలించండి.

## 'చెవి' కెక్కిన టాటూ!

టాటూలు చెవికెక్కుతున్నాయి అంటే ఎవరూ చెవికెక్కించుకోకపోవచ్చు. ఇది నిజం. ఇపుడిదే ఇన్‌స్టాగ్రామ్‌లో లేటెస్ట్ ట్రెండ్. దీన్ని 'హెలిక్స్ టాటూ ట్రెండ్' అంటూ పిల్చుకుంటున్నారు. ప్రకృతిని చూసి దీన్ని వేస్తున్నామని టాటూ వేసేవారంటున్నారు. చెవిపై నుంచి కిందకు అందంగా ఆకులు, పువ్వులు స్టిక్కరింగ్ చేశారేమో అని భ్రమించేట్లు.. టాటూ వేయించుకుంటున్నారు. జుట్టుకు రబ్బర్ బాండ్ వేసుకుని మరీ అందమైన హెలిక్స్ ఆర్ట్ ఉన్న చెవుల్ని యూరప్, అమెరికా, ఆస్ట్రేలియా దేశాలకు చెందిన అమ్మాయిలు చూపిస్తున్నారట. వీరందరూ దాదాపు తమ చెవుల సోయగాల్ని ఫొటోతీసి ఇన్‌స్టాగ్రమ్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. గర్వంగా హెలిక్స్ టాటూ వేయించుకున్నామని ఫోజులు కొడుతూ కామెంట్స్ రాస్తున్నారు.





# పెరిగిన దిగుమతులు - దారికొస్తున్న వంటనూనెల ధరలు



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి20 (వెలుతురు):** దేశంలో వంటనూనెల ధరలు క్రమంగా తగ్గుముఖం పడుతున్నాయి. గత కొంత కాలంగా ధరలు దిగొచ్చాయి. ప్రస్తుతం ఆయిల్ నిల్వలు బాగా పెరగడంతో ధరలు తగ్గుముఖం పట్టినట్టు సమాచారం. రష్యా, ఉక్రెయిన్ దేశాల నుంచి దిగుమతులు జోరుగా సాగుతున్నాయి. కాని కార్పొరేట్ సంస్థల చేతుల్లో ఆయిల్ వ్యాపా రం చిక్కుకుపోవడం వల్ల ధరలను ఆయా సంస్థలే శాసించడం గమనార్హం. దేశ ఆర్థిక రంగాన్ని ఓ కుదుపుకుదిపి,ఎల్ఐసీ,బ్యాంక్‌లను కుదేలయ్యేట్టు చేసిన అదానీ కూడా ఆయిల్ రంగాన్ని ఏలేస్తున్నారు.జెమిని, ఫ్రీడమ్, రుచి వంటి సుమారు ఏడెనిమిది సంస్థల చేతుల్లో ఆయిల్ వ్యాపారం ఉంది. గతంలో కరోనాకు ముందు వరకూ సన్‌ఫ్లవర్ లీటర్ ఆయిల్ రూ.90 ఉండేది. ఒకానొక సమయంలో రూ.200 దాటేసిన సంగతి తెలిసిందే. ప్రభుత్వాల ఉదాసీనవైఖరి, కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాయడం వంటి కారణాల వల్ల ఆయిల్ ధరలు విపరీతంగా పెరిగిన సంగతి తెలిసిందే. కొంతకాలం ఉక్రెయిన్ యుద్ధం వల్ల దిగుమతులు ఆగిపోయాయనే కారణాలు చెప్పారు. సన్‌ఫ్లవర్, పామాయిల్ వంటి ముడిసరుకు ప్రతి రోజూ దిగుమతి అవుతూనే వస్తోంది. నిత్యావసర సరుకు కాబట్టి, కార్పొరేట్ సంస్థలు ఇష్టానుసారం ధరలు పెంచేశాయి. కానీ ప్రజల నుంచి, ప్రతిపక్షాల నుంచి తీవ్ర నిరసన రావడంతో పాటు ప్రభుత్వాలకు ఈ ఆయిల్ జిడ్డు అంటుకునే పరిస్థితి వచ్చిన సంగతి తెలిసిందే.

ఈ నేపథ్యంలో ఆరు నెలల నుంచి కొద్దిగా ధరలు తగ్గాయి. సన్‌ఫ్లవర్ ఆయిల్ లీటర్ ఫ్రీడమ్ ధర రూ.118లకు తగ్గింది.పామాయిల్ ధర రూ.95 వరకూ ఉంది. మరో రకం రూ.92 వరకూ ఉంది. కేంద్ర ప్రభుత్వం నిబంధనలు తొలగించడంతో ఎవరి ఇష్టం వారిదైంది. ప్రభుత్వాలేమీ పట్టించుకునే పరిస్థితి లేదు.దీంతో వివిధ కంపెనీలు వివిధ బ్రాండ్లతో విక్రయాలు చేస్తున్నాయి. ఒక్కో బ్రాండ్‌కు ఒక్కో ధర కనిపిస్తోంది. ఒక సంస్థ ఒక ధర నిర్ణయిస్తే, మరో సంస్థ కొంచెం తగ్గించి ధర పెడుతుంది. ఇది పెద్దగా తేడా ఉండదు. వాస్తవానికి సరుకు ప్రజల అవసరాలకంటే ఎక్కువగా ఉన్నప్పుడు ధరలు తగ్గడం మార్కెట్ సూత్రం. కానీ ఇక్కడ కొరత ఉన్నప్పుడు మాత్రమే ధర పెంచేస్తున్నారు. నిల్వలు పెరిగినా ధరలు మాత్రం ఎక్కువగా తగ్గించడంలేదు. ప్రస్తుతం అందు బాటులో ఉన్న వంటనూనెల నిల్వలను బట్టి, మరింతగా ఆయిల్ ధరలు తగ్గవలసి ఉందని మార్కెట్ పరిశీలకుల అంచనా. అయితే గతంతో పోలిస్తే మాత్రం ధరలు తగ్గాయనే అంటున్నారు.

## ఎస్సారెస్పీ ఆయకట్టును కాపాడుకోవాలి

### ఈ సీజన్ పంటలకు అవసరమైన మేర నీటి సరఫరా

### ప్రాజెక్ట్ అధికారులతో బాల్కొండ ఎమ్మెల్యే వేముల చర్చ

**నిజామాబాద్,ఫిబ్రవరి20(వెలుతురు):** ఎస్ఆర్ఎస్పీ నుంచి ఎంఎండీ వరకున్న ఆయకట్టును కాపాడుకోవాల్సిన అవసరం ఉన్నదని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. అందువల్ల ఎస్ఆర్ఎస్పీలో ఉన్న నీటిని వరద కాలువ ద్వారా దిగువకు కేటాయింపునకు కన్న ఎక్కువ వెళ్లకుండా చూడాలని ఎస్ఆర్ఎస్పీ ఎస్ఈకి సూచించారు. బాల్కొండ నియోజకవర్గంలోని ఉప్లూర్ వరద కాలువ ద్వారా దిగువకు నీరు వెళ్తుండటంతో ఆయన ప్రాజెక్టు ఎస్ఈతో మాట్లాడారు. డ్యాంలో నీటి



నిల్వ ఎంత ఉంది.. ఈ సీజన్‌లో పంటలకు ఎన్ని టీఎంసీలు అవసరమవుతాయని అడిగి తెలుసుకున్నారు. ఒకవేళ ప్రభుత్వం, అధికారులు నీటి విడుదల విషయంలో కొన్ని నిర్ణయాలు తీసుకున్నా ఎస్ఆర్ఎస్పీ నుంచి మిడ్‌మానేరు డ్యామ్ వరకు ఉన్న ఆయకట్టు రైతుల ప్రయోజనాలను కూడా కాపాడాల్సిన బాధ్యత ఉంటుందన్నారు. వరద కాలువ ద్వారా ఎట్టి పరిస్థితుల్లో కిందికి కేటాయింపు కన్నా ఎక్కువ నీరు వదలొద్దని సూచించారు. అలాంటి నిర్ణయాలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని.. ప్రభుత్వం, ఇరిగేషన్ శాఖ అధికారులతో మాట్లాడుతానని చెప్పారు. లేనట్లయితే రైతుల పక్షాన పోరాడుతామని స్పష్టం చేశారు. నాగపూర్ వద్ద ఉన్న నాలుగు గేట్లలో వరద కాలువ ద్వారా నీటిని కిందికి వెళ్తున్నదని రైతులు చెప్పడంతో మరోసారి ఎస్ఈ మాట్లాడారు. వరద కాలువ ద్వారా నీరు వెళ్లడంలేదని మమ్మల్ని తప్పుదోవ పట్టించొదని, వెంటనే వరద కాలువ గేట్లను మూసివేయించాలని ఆదేశించారు. అక్కడ గేట్లకు తేనెతుట్ట ఉండటంతో మూయలేకపోయామని అధికారి చెప్పడంతో అది చిన్న సమస్య అని.. ఆ కారణంతో గేట్లు మూయకుండా నీరు దిగువకు వృధాగా పోనియ్యడం సబబు కాదన్నారు. అవసమైతే ప్రజల సహకారంతో తేనెతుట్టని తొలగించి వెంటనే నాగపూర్ వద్ద ఉన్న గేట్లను మూసివేయాలని సూచించారు.

## ఔటర్‌పై కారు బోల్తా: ఒకరు మృతి

**హైదరాబాద్,ఫిబ్రవరి20(వెలుతురు):** నార్సింగ్ ఔటర్ రింగ్ రోడ్డుపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది... మంగళవారం తెల్లవారుజామున కారు బీభత్సం సృష్టించింది. అవుటర్ రింగ్ రోడ్డుపై నుంచి కిందకు పడిపోయింది. అవుటర్ రింగ్ రోడ్డుపై నుంచి అత్యంత వేగంగా వచ్చిన కారు.. అటవీ ప్రాంతంలోకి దూసుకెళ్లింది. కారులో ప్రయాణిస్తున్న ఐదుగురిలో ఒకరు మృతి చెందగా.. నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. కారు ప్రమాదానికి అతివేగమే కారణంగా తెలుస్తోంది. సమాచారం అందుకున్న నార్సింగ్ పోలీసులు సంఘటన ప్రదేశానికి చేరుకుని సమీక్షించారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించి, క్షతగాత్రలును కూడా సమీప ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా కారులో ప్రయాణిస్తున్నవారందరూ యువకులే.. గచ్చిబౌలి నుంచి శంషాబాద్ వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం. పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

## బైక్ అదుపుతప్పి బస్సుకిందపడ్డ టెక్కీ మృతి

**హైదరాబాద్,ఫిబ్రవరి20(వెలుతురు):** బైక్ అదుపు తప్పి ఆర్టీసీ బస్సు వెనక చక్రాల కింద పడి ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మృతి చెందాడు. ఈ సంఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విజయవాడ, ఆటోనగర్‌కు చెందిన ఆకుల సాయికృష్ణ(26) గచ్చిబౌలి జనార్ధన్‌హిల్స్‌లోని సునీతా రెడ్డి లగ్జరీ మెన్స్ హాస్టల్‌లో ఉంటూ గచ్చిబౌలిలోని ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నాడు. సోమవారం ఉదయం అతను బైక్‌పై డీఎల్ఎఫ్ వైపు వెళుతుండగా, రాయదుర్గం నుంచి డీఎల్ఎఫ్ వైపు వస్తున్న హెచ్‌సీయూ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సును ఓవర్‌టేక్ చేసే క్రమంలో బైక్ అదుపు తప్పి కిందపడ్డాడు. బస్సు వెనుక చక్రాలు అతడి తలమీదుగా వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించిన పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## మేడారం జాతరకు ప్రత్యేక బస్సులు

### 6వేల బస్సులు నడుపుతున్నట్లు సజ్జన్నార్ వెల్లడి

**హైదరాబాద్,ఫిబ్రవరి20(వెలుతురు):** మేడారం మహా జాతరకు తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం 6 వేల ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు టీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి ఇప్పటికే బస్సులు అక్కడికి వెళ్లినట్లు చెప్పారు. రద్దీ అధికంగా ఉండే ఉమ్మడి వరంగల్,



ఖమ్మం, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో 51 క్యాంపులు ఏర్పాటు చేసి అక్కడి నుంచి బస్సులు నడుపుతున్నట్లు వివరించారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. మహాలక్ష్మి పథకం అమలు నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం, రవాణశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు భక్తులకు అసౌకర్యం కలగకుండా యాజమాన్యం అన్ని చర్యలు తీసుకుంటోంది. క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చేందుకు ఇంత పెద్ద మొత్తంలో మేడారం జాతరకు బస్సులను తిప్పుతున్నందున రెగ్యులర్ సర్వీసులను తగ్గించాం. దీంతో సాధారణ ప్రయాణికులకు కొంత అసౌకర్యం కలిగే అవకాశముంది. ఈ సమయంలో భక్తులకు, ఆర్టీసీ సిబ్బందికి సహకరించాలి. మేడారం జాతర పూర్తయ్యే వరకు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని కోరుతున్నా. తెలంగాణకే తలమానికమైన ఈ పండుగను విజయవంతం చేసేందుకు ప్రజలంతా సహకరించాలని సజ్జనార్ విజ్ఞప్తి చేశారు.

# బాసర సరస్వతి ఆలయంలో పూజలు

### ప్రారంభమైన బిజెపి ప్రచార రథం

### వచ్చే ఎన్నికల్లో మళ్లీ విజయం మాదే

### ఎంపి సోయం బాపూరావు వెల్లడి

**నిర్మల్,ఫిబ్రవరి20(వెలుతురు):** వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మరోమారు ఆదిలాబాద్‌లో బిజెపి జెండా ఎగురేస్తామని ఎంపి సోయం బాపూరావు వెల్లడించారు. తెలంగాణలో అత్యధిక సీట్లను కైవసం చేసుకుంటా మని అన్నారు,. మోడీ పాలనా దక్షతే మా ప్రచారం అని అప్రారు.ఈ క్రమంలో పార్లమెంట్ ఎన్నికల ప్రచారానికి కమలం పార్టీ శ్రీకారం చుట్టింది. నేటి నుంచి మార్చి 2 వరకు విజయసంకల్ప యాత్ర పేరుతో రథయాత్రలు చేపట్టాలని నిర్ణయించింది. అందులో భాగంగా మంగళవారం ఉదయం బాసర సరస్వతీ దేవి ఆలయం నుంచి బీజేపీ విజయసంకల్ప యాత్ర ప్రారంభమైంది. ఎంపీ సోయం బాపురావు, ఎమ్మెల్యే రామారావు పాటిల్ .. వాహనాలకు పూజలు నిర్వహించి అనంతరం యాత్రను ప్రారంభించారు. అంతకుముందు ఎంపీ సోయంబాపురావు, బీజేపీ నేతలు సరస్వతి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీ బాపురావు మాట్లాడుతూ.. విజయ సంకల్ప యాత్రలతో పార్లమెంట్ ఎన్నికల శంఖారావం పూరిస్తున్నామన్నారు. మోదీ పాలనలో జరిగిన అభివృద్ధి, జరగబోయే అభివృద్ధిని ప్రజలకు వివరిస్తామని తెలిపారు. బీఆర్ఎస్‌తో పొత్తు ఉండదని.. అది మునిగే పడవ అంటూ వ్యాఖ్యలు చేశారు.




ఆదిలాబాద్ నుంచి తానే పోటీలో ఉంటానని.. భారీ మెజారిటీతో గెలుస్తానని ఎంపీ సోయం బాపురావు ధీమా వ్యక్తం చేశారు.అలాగే.. బాసరలో అస్సోం సీఎం హేమంత బిస్వా శర్మ, యాదాద్రిలో గోవా సీఎం ప్రమోద్ సావంత్ రథయాత్రలో పాల్గొంటారు. నారాయణపేటలో కిషన్ రెడ్డి, తాండూరులో రథయాత్రలో బండి సంజయ్ పాల్గొననున్నారు. డీకే అరుణ, ఈటల, లక్ష్మణ్, ఎంపీ ధర్మపురి అర్వింద్ తదితరులు రథ యాత్రలో పాల్గొంటారు. 17 పార్లమెంట్, 14 అసెంబ్లీ సెగ్మెంట్లలో 5,500 కిలోమీటర్ల మేర రథయాత్రలు సాగనున్నాయి. కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్దిదారులను కమలం పార్టీ నేతలు కలుసుకో నున్నారు. కేంద్ర విజయాలు, కాంగ్రెస్ కుంభకోణాలు, బీఆర్ఎస్ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తామని బీజేపీ నేతలు చెబుతున్నారు.

# రైతులకు భారంగా కూలీ రేట్లు

### ఇతర రాష్ట్రాల కూలీల రాకతో పెరగిన ఖర్చు

### పెట్టుబడి పెరగడంతో ఆందోళనలో మిర్చి రైతు

**ఖమ్మం,ఫిబ్రవరి20(వెలుతురు):** మిర్చి రైతులను కూలీల కొరత వేధిస్తోంది. ఓ వైపు పండించిన పంటకు గిట్టుబాటు ధరలు రాక ఆందోళనలు చెందుతుంటే పంట ఏరడానికి కూలీల సమస్య తీవ్రంగా మారింది. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గత కొన్ని రోజులుగా మిర్చీ కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ క్రమంలో స్థానికంగా కూలీలు దొరుకకపోవడంతో రైతులు ప్రత్యా మ్నాయ మార్గాలు వెతుకుతున్నారు.

ఖర్చు భారమైనా ఒడిశా, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు వెళ్లి కూలీలను తీసుకొస్తున్నారు. వరంగల్, ఖమ్మం ఉమ్మడి రెండు జిల్లాలో ఇతర రాష్ట్రాలకు చెందిన కూలీలు సుమారు 25 వేల మందికి పైగానే పని చేస్తున్నారు. ఈ ఏడాది మిర్చీ పైరుపై వైరస్‌ల ప్రభావం ఎక్కువగా ఉండడంతో నివారణకోసం రైతులు భారీగా పెట్టుబడులు పెట్టారు. దాంతో సాగుకే ఖర్చు తడిసి మోపెడైంది. పంట బాగానే పండినా కూలీల కొరతతో సకాలంలో పంటను తీసుకోలేక పోతున్నారు. స్థానికంగా అందుబాటులో లేకపోవడంతో ఇతర రాష్ట్రాలకు వెళ్లి కూలీలను తీసుకొస్తున్నారు. మధ్యప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ లకు చెందిన సుమారు వేల



మంది కూలీలు మిర్చీ కోతలు చేపడుతున్నారు. తమ పంటను కోసి విక్రయిం చేందుకు తొందర పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఖర్చు భారమైనా ఇతర ప్రాంతాల నుంచి కూలీలను తీసుకొస్తున్నారు. ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి పంటను పండించిన మిర్చీ రైతులకు స్థానికంగా కూలీలు దొరక్క పోవడంతో పొరుగు రాష్ట్రాలకు ప్రయాణమై వలస కూలీలను మిర్చీ కోతలకు తీసుకు రావడం వారికి అదనపు భారంగా మారింది. పంట పండించడానికి అప్పో సప్పో చేసి రైతులు పెట్టుబడులు పెట్టారు. కానీ చేతి కందిన పంటను కోయించడా నికి కూలీలు దొరక్క పోవడంతో నానా ఆగచాట్లు పడాల్సి వస్తోంది. ఈ పరిస్థితిని అధిగ మించడానికి అన్నదాతలు వలస కూలీలపై ఆధారపడక తప్పడం లేదు. దీంతో రైతులకు ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. మిర్చి కోతలకోసం వచ్చే కూలీలు ఖమ్మం జిల్లాతోపాటుగా ఉమ్మడి వరంగల్, నల్లగొండ, గుంటూరు తదితర జిల్లాలకు కూడా వెళ్తుంటారు. కాగా.. కొందరు రైతులు తమ పరిచయాల మేరకు నేరుగా ఆయా ప్రాంతాలకు వెళ్లి కూలీలతో మాట్లాడి తీసుకొస్తున్నారు. ముందుగా అక్కడకు వెళ్లి, అడ్వాన్సు చెల్లించిన వారం రోజుల తర్వాత కూలీలు చెప్పిన ప్రాంతానికి చేరుకుంటున్నారు. పొరుగు రాష్ట్రాల కూలీలను రప్పించడం రైతులకు భారంగా మారుతుంది. పంట చేతికందిన సమయంలో గ్రామాలలో కూలీల కొరత తీవ్రంగా ఉంది. దీంతో పొరుగు రాష్ట్రాల కూలీలపైనే ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది.

# రాజీవ్ రహదారి వంకరలు సరిచేయరా..

### గత ప్రభుత్వం మాటలు, కాలయాపన

**కరీంనగర్,ఫిబ్రవరి20(వెలుతురు):** రాజీవ్ రహదారి నిత్యం ప్రమాదాలకు నిలయంగా మారింది. రోడ్డు మార్గంలో నిత్యం ప్రమాదాలు సర్వసాధారణంగా మారాయి. ఈ రహదారిని సక్రమంగా మార్చాలని తెలంగాణ ఉద్యమ సమయంలో సిఎం కెసిఆర్, హరీష్ రావులు డిమాండ్ చేయడమే గాకుండా ఆందోళనలు కూడా చేపట్టారు. అయినా అది సాకారం కాలేదు. ఇప్పటికీ దానిని పట్టిచుకోవడం లేదు. రాజీవ్ రహదారిపై 24 గంటలపాటు వాహనాల రద్దీ ఉంటుంది. వంకరలు మూలములవులు సరి చేయాలన్న డిమాండ్‌ను గత ప్రభుత్వం ఏనాడూ పట్టించుకోలేదు. ఇటువంటి ప్రమాదకరంగా ఉన్న ప్రాంతంలో రాజీవ్ రహదారికి రక్షణ చర్యలు పటిష్టంగా ఏర్పాటు చేయాల్సి ఉండగా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో వాహనదారుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. ప్రమాద సంఘటన జరిగిన సమయాల్లో అధికారులు హడావుడి చేసి నియంత్రణ చర్యలు చేపడతామని చెప్పడం మినహా శాశ్వతంగా ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యం వ్యవహరిస్తుండడంతో ప్రమాదాలు పునరావృత మవుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. వరుస ప్రమాదాలు జరిగి వాహనదారులు ప్రాణాలు గాలిలో కలుస్తున్నా రాజీవ్‌రహదారి నిర్వహణ సంస్థకాని, ఆర్అండ్‌బీ అధికారులు, పోలీసులు, ఇతర ఉన్నతాధికారులు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోకపోవడం ఆందోళనను కలిగిస్తున్నది. రక్షణ చర్యలు చేపట్టకుండా నిర్ల క్ష్యంగా వ్యవహరిస్తూ ఇంకెందరి ప్రాణాలు బలితీసుకుంటారని ప్రజలు, వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని రాజీవ్‌రహదారి, ఇతర ప్రధాన రహదారులు, రోడ్లతోపాటు గ్రామీణ ప్రాంతాల రోడ్లను ఆనుకుని ఉన్న వ్యవసాయ బావులు, ఎస్సారెస్పీ కాలువలు ఎలాంటి రక్షణ లేకుండా ప్రమాదకరంగా ఉన్నాయి. సాగునీటి కాలువల వద్ద రక్షణ గోడలు, ఫెన్సింగ్‌లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

# ఆందోళన కలిగిస్తున్న ఆత్మహత్యలు

### హాస్టళ్లలో సైకాలజిస్టులను నియమించాలి :

### ఎమ్మెల్సీ కవిత వినతి

**సూర్యాపేట,ఫిబ్రవరి20 (వెలుతురు):** రాష్ట్రంలో విద్యార్థినుల ఆత్మహత్యలు ఆందోళన కలిగిస్తున్నాయని బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అన్నారు. ప్రభుత్వం వీటిని సీరియస్‌గా తీసుకొని తక్షణమే సమీక్ష నిర్వహించాలని ఎమ్మెల్సీ కవిత అన్నారు. ఇటీవల ఆత్మహత్య చేసుకున్న ఇమాంపేట గురుకుల పాఠశాల విద్యార్థిని అస్మిత కుటుంబాన్ని మంగళవారం వారి స్వగ్రామమైన మోతె మండలం బురకచర్లలో పరమార్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇప్పటివరకు విద్యాశాఖ, సాంఘిక సంక్షేమ శాఖకు మంత్రే లేరని విమర్శించారు. హాస్టల్స్ నిర్వహణలో పర్యవేక్షణ లోపం కనిపిస్తుందన్నారు. ప్రతి హాస్టల్‌లో ఫ్రెండ్లీ నేచర్ కల్పించాలని కవిత సూచించారు. ప్రతి హాస్టల్‌లో సైకాలజిస్టులను ఏర్పాటు చేసి విద్యార్థుల్లో మనోధైర్యాన్ని కల్పిం చాలని పేర్కొన్నారు. ఎలాంటి ఒత్తిడి నైనా తట్టుకునేలా విద్యార్థులను తయారు చేయాలని చెప్పారు. అస్మిత కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. తల్లిదండ్రులు కూడా పరీక్షల సమయంలో విద్యార్థులపై ఒత్తిడి పెట్టవద్దని కోరారు. ఆత్మహత్యలపై ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసి చర్యలు తీసుకోవాలని



ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ వెంటనే సమీక్ష నిర్వహించి ఆత్మహత్యల నివారణకు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలన్నారు. కవిత వెంట ఎంపీ లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



### దమ్ముంటే అమేథీ నుంచే

# పోటీ చేయండి

### రాహుల్‌కు స్మృతి ఇరానీ సవాల్

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి20(వెలుతురు):** దమ్ముంటే అమేథీలో పోటీ చేయాలని, వయనాడ్‌ను వదలాలని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి .. కేంద్రమంత్రి స్మృతి ఇరానీ సవాల్ విసిరారు. వయనాడ్ నియోజకవర్గాన్ని వదిలేసి.. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో కేవలం అమేథీలోనే రాహుల్ పోటీ చేయాలని ఆమె అన్నారు. ఒకవేళ రాహుల్ నమ్మకంగా ఉంటే, వయనాడ్‌లో ఆయన పోటీ చేయాల్సిన అవసరం లేదని, కాంగ్రెస్ సీటుపై ఆయన అమేథీ నుంచి మాత్రమే పోటీ చేయాలని కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ సవాల్ విసిరారు. ఓ టీవీ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె ఈ ఛాలెంజ్ చేశారు. యూపీలోని అమేథీ సీటు నుంచి గతంలో స్మృతి ఇరానీపై రాహుల్ గాంధీ ఓడిపోయారు. 2019 జనరల్ ఎలక్షన్స్‌లో 50 వేల ఓట్ల తేడాతో స్మృతి ఇరానీ గెలు పొందారు. అయితే ఆ ఎన్నికల్లో కేరళలోని వయనాడ్ సీటు నుంచి రాహుల్ విజయం సాధించారు. ఆ స్థానం నుంచి ఆయన 4.3 లక్షల ఓట్ల తేడాతో నెగ్గారు. గతంలో అమేథీ స్థానం నుంచి రాహుల్ గాంధీ మూడు సార్లు విజయం సాధించారు. 2004 నుంచి ఆయన ఆ స్థానం నుంచి గెలిచారు. కానీ 2019లో స్మృతి ఇరానీ చేతిలో ఓడిపోయారు. అయితే రాబోయే ఎన్నికల్లో రాహుల్ గాంధీ ఎక్కడ నుంచి పోటీ చేస్తారన్న విషయం ఇంకా తెలియలేదు.

### అందుబాటులోకి
## మై మేడారం యాప్

**ములుగు,ఫిబ్రవరి20(వెలుతురు):** మేడారం జాతరకు వెళుతున్న భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాల వివరాలను తెలిపేందుకు ప్రత్యేకంగా 'మై మేడారం' పేరుతో యాప్‌ను రూపొందించినట్లు రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మీడియాకు తెలిపింది. జాతరలో కుటుంబ సభ్యులు తప్పిపోయినా, ఇతరత్రా ఏదైనా సంఘటన జరిగినా వెంటనే పోలీసులకు సమాచారం అందించేందుకు, తాగునీరు, వైద్యసేవలు, వాహనాల పార్కింగ్, మరుగుదొడ్లు, స్నాన ఘాట్‌లు తదితర వివరాలన్నీ యాప్‌లో తెలుసుకోవచ్చని వివరించింది.





# మేడారంలో ఘనంగా ఏర్పాట్లు..

### జాతరకోసం 105 కోట్ల నిధులు
### అన్నిశాఖల అధికారుల సర్వసన్నద్ధం

**మేడారం,ఫిబ్రవరి20(వెలుతురు):**
రాష్ట్ర ప్రభుత్వం మేడారం సమ్మక్క-సారలమ్మ మహా జాతరను గిరిజన సాంప్రదాయాల నడుమ అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లలో పూర్తి చేసింది. భక్తులకు ఎటువంటి లోటుపాట్లు జరగద్దనే సంకల్పంతో రాష్ట్ర ముఖ్యమంత్రి 105 కోట్ల నిధులను మంజూరు చేశారు. తెలంగాణలో మహా కుంభమేళగ ప్రసిద్ధి గాంచిన అతి పెద్ద గిరిజన జాతర రెండేళ్లకొకసారి మాఘ మాసంలో నాలుగు రోజుల పాటు జరుగుతుంది. ఈ జాతరకు రాష్ట్రం నుండే కాకుండా ఇతర రాష్ట్రాల నుండి సైతం భక్తులు తండోపతండాలాగు తరలి వస్తారు. ప్రతి ఏడాది భక్తుల తాకిడి పెరుగుతూనే వుంది. ఇప్పటికే 58 లక్షలకు పైగా భక్తులు తల్లులను దర్శించుకున్నారు. ఈ ఏడాది సుమారు రెండు కోటి లక్షల మంది తల్లులను దర్శించుకొనున్నట్లు ప్రాథమిక అంచనా వేశారు. భక్తుల తాకిడికి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అన్నీ ఏర్పాట్లు చేసింది. మేడారంలో తాత్కాలిక ఏర్పాట్లతో పాటు ఈ ఏడాది శాశ్వత ఏర్పాట్ల పైనే ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇప్పటికే భక్తులకు వివిధ శాఖల ద్వారా నివాసానికి ఉన్న షెడ్లు తో పాటు అదనంగా షెడ్ల నిర్మాణం చేశారు. వరంగల్ నుండి మేడారం మార్గంలో మూడు షెడ్లు ఒక్కోటి 1.65 కోట్లతో నిర్మాణం చేపట్టారు. మేడారం లో తల్లులు గద్దెలకు చేరడానికి ముందు రోజు నుండి తిరిగివనంలోకి వెళ్లేవరకు భక్తులు నాలుగు రోజుల పాటు గుదారాలు వేసుకొని అమ్మవార్ల సన్నిధిలో ఉండడం ఎప్పటి నుండో వస్తున్న ఆనవాయితీ. ఈ మేరకు గుడారాలతో భక్తులు ఇబ్బంది పడకుండా ప్రభుత్వం, జిల్లా యంత్రంగం ముందుచూపుతో మేడారం లో భక్తులు ఉండేందుకు నివాసానికి ఏర్పాట్లు చేశారు. ఆదివాసీ సంస్కృతి సంప్రదాయలను గౌరవిస్తూ జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టి మహజతరకు సిద్ధంగా ఉంది. జాతర నిర్వహణకు. త్రాగు నీరు, మరుగుదొడ్లు, అదనపు స్నాన ఘట్టాలు, బ్యాటరీ ట్యాప్స్, అంతర్గత రోడ్లు, వైద్యం, వసతి, పారిశుద్ధ్యం, నిరంతర విద్యుత్ సరఫరా, రహదారుల అభివృద్ధి , క్యూలైన్ ఏర్పాటు తదితర అనేక ఏర్పాట్లు పూర్తి చేసింది. జిల్లా యంత్రాంగం క్షేత్రస్థాయిలో అనేక మార్లు పర్యటించి గత జాతర అనుభవాలను పరిగణనలోకి తీసుకొని లోపాలను సరిదిద్దుకుంటు ఏర్పాట్లను విస్తృత పరిచారు. భక్తులకు సజావు దర్శనమే లక్ష్యంగా జిల్లా, రాష్ట్ర యత్రంగాలు ప్రత్యేక దృష్టి సారించి పక్కా ప్రణాళికతో జాతరకు ముందే అన్ని పనులు పూర్తి చేసి సిద్ధం చేశారు. జాతరకు ముందు ఏర్పాట్లను పంచయత్ రాజ్, గ్రామీణాభివృద్ధి , స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క ప్రత్యేక శ్రద్దతో పనులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అవసరమైన సూచనలు చేస్తూ పనులు పూర్తి చేశారు. ఉన్నతాధికారులు పలుమార్లు క్షేత్ర స్థాయిలో పర్యటించి పనులను పర్యవేక్షించారు. రెవెన్యూ గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దేవాదాయ అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ, బీసి సంక్షేమ శాఖ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేకంగా మేడారం పర్యటించి పనులను పరిశీలించడం ద్వారా ప్రభుత్వం జాతరకు ఇచ్చిన ప్రాముఖ్యత స్పష్టం అవుతోంది. మొత్తంగా భక్తులకు అసౌకర్యం కలగకుండా జాతరను విజయవంతం చేసేందుకు అన్నీ శాఖలు సమన్వయం త్నీ పనులు పుర్తి చేశారు. రవాణా వ్యవస్థను నియంత్రించేందుకు యంత్రాంగం వాహనాల పార్కింగ్ స్థలాలను గ్దదెల కు దూరంగా ఏర్పాటు చేయడం, రోడ్ల వెడల్పు, నూతన రోడ్లు, మరమ్మత్తులు చేసి ట్రాఫిక్ సమస్యలను అధిగమించేందుకు చర్యలు తీసుకున్నారు. జాతర మొత్తం లో 300 ఎల్ ఈ డీ స్క్రీన్ లను ఏర్పాటు చేశారు. జాతర నిర్వహణను పర్యవేక్షించేందుకై 300 సి సి కెమెరాలు, డ్రోన్ కెమెరాలను ఏర్పాటు చేసి సెంట్రల్ కంట్రోల్ రూమ్ ద్వారా నిరంతర పర్యవేక్షిస్తున్నారు. భక్తులకు ఎక్కడా అసౌకర్యం కలగకుండా మెరుగైన సేవలు అందించేందుకు ఆలయ పరిసర ప్రాంతాలను 10 జోన్లు, 38 సెక్టార్లు, 60 సబ్ సెక్టర్లుగా విభజించి సెక్టార్ల వారీగా అధికారులు సిబ్బందిని నియమించారు. సెక్టోరల్ అధి కారులకు ఇచ్చిన వాకిటాకీ ద్వారా వివరాలు తెలుసుకుంటూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నారు. దాదాపు 16 వేల మంది ఉద్యోగులు మేడారం విధులు నిర్వహిస్తున్నారు. భక్తుల రవాణాకు ఆర్టీసీ ద్వారా 6000 బస్సులను ఏర్పాటు చేశారు. ప్రభుత్వం రవాణా సౌకర్యాలు కల్పించేందుకు 2 కోట్ల 25 లక్షల నిధులు మంజూరి చెసింది. తాత్కాలిక బస్ స్టాండ్ ఏర్పాటు చేసి సీసీ కెమెరాల, టికెట్ బుకింగ్ కౌంటర్లు, లైటింగ్, రైలింగ్, త్రాగు నీటి సౌకర్యం తదితర ఏర్పాట్లు చేసి రవాణాకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టారు. ఆర్ డబ్ల్యు ఎస్ శాఖ ద్వారా 13 కోట్ల 50 లక్షలతో పనులు చేపట్టారు. 17 ఇన్ ఫిల్టరేషన్ వెల్స్, 495 ప్రాంతాలలో 5000 ట్యాప్స్ ఎర్పాటు చేశారు. విద్యుత్ అంతరాయం కలగకుండా 40 జనరేటర్లు ఎర్పాటు చేశారు. అదే విదంగా 8400 తాత్కాలిక మరుగుదొడ్లు 500 ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు. అలాగే 7 ఓవర్ హెడ్ ట్యాంకులు ఏర్పాటు చేసి త్రాగునీరు అందిస్తున్నారు. మరుగుదొడ్ల ఎప్పటికప్పుడు శుభ్రం చేసేందుకు 300 మంది సిబ్బందిని నియమించారు. జాతరకు లక్షల సంఖ్యలో బక్తులు వస్తున్న నేపథ్యంలో పారిశుధ్యం ఇక్కడ పెద్ద సవాలు. పారిశుధ్యం పై జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. పారిశుధ్య నిర్వహణకు 4 వేల కార్మికులను ఎర్పాటు చెసింది. పారిశుధ్య నిర్వహణకు మేడారంకు ఆవల డంపింగ్ యార్డులు అదే విదంగా మేడారం పరిసర ప్రాంతాల్లో 300 మిని డంపింగ్ యార్డులు ఏర్పాటు చేశారు. పారిశుధ్య కార్మికులతో గ్దదెల వద్ద, పరిసర ప్రాంతాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసే విదంగా చర్యలు తీసుకుంటున్నారు. మేడారం జాతరలో నిరంతరం విద్యుత్ సరఫరాకు 3 కోట్లు 97 లక్షలు రూపాయలతో పనులు చేపట్టారు. నుతనంగా 210 ట్రాన్స్ఫార్మర్ల విద్యుత్ శాఖ ప్రత్యేకంగా ఏర్పాటు చేసి నిరంతర విద్యుత్ అందిస్తుంది. భక్తుల ఆరోగ్య పరిరక్షణకు వైద్య ఆరోగ్య శాఖ విస్తృత ఏర్పాట్లు చేసింది. మేడారం కల్యాణ మండపంలో కోటి రూపాయలతో 50 పడకల ఆసుపత్రి ఏర్పాటు చేసి 25 మంది వైద్యులు అలాగే 120 మంది వైద్యాధ కారులు, 857 పార మెడికల్ సిబ్బందిని నియమించారు. అదే విధంగా మేడారం పరిసర గ్రామాల్లోను 75 వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి అవసరమైన మందులు అందుబాటులో ఉంచారు. అంతే కాకుండా క్యూ లైన్ల వద్ద మినీ క్యాంపులు ఏర్పాటు చేశారు. తాడ్వాయి లో 10 పడకలు, పస్ర లో 5 పడకల ఆసుపత్రుల తోపాటు 11 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను బలోపేతం చేశారు. ఈ జాతరలో ప్రత్యేకంగా 30 మొబైల్ అంబులెన్స్ లను ఎర్పాటు చేశారు. మేడారం లో శాంతి బద్రతల పరిరక్షణకు, జాతరలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ శాఖ పకడ్బందీ చర్యలు చేపట్టింది. 12 వేల పోలీస్ సిబ్బందితో 300 సిసి కెమెరాలు, డ్రోన్ కెమెరాలతో జాతర పరిసర ప్రాంతాల్లో 33 పార్కింగ్ స్థలాలను ఎర్పాటు చేసి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

# మేడారంలో అత్యవసర ఆస్పత్రి

### టీటీడీ కళ్యాణ మండపంలో 50 బెడ్స్ దవాఖాన
### 30 చోట్ల ఉచిత హెల్త్‌క్యాంప్‌లు

**ములుగు,ఫిబ్రవరి20(వెలుతురు):**
మేడారం జాతరకు భక్తులు క్యూ కట్టారు ఇప్పటికే 50 లక్షలకు పైగా మంది భక్తులు మేడారం దర్శించుకున్నారు. బుధవారం నుంచి మేడారం మహాజాతర మొదలు కాబోతుండటంతో భక్తులు పోటెత్తనున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కల్గకుండా వైద్యఆరోగ్య శాఖ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. స్థానిక టీటీడీ కళ్యాణ మండపంలో 50 బెడ్స్ దవాఖాన ఏర్పాటు చేశారు. 30 చోట్ల ఉచిత హెల్త్‌క్యాంప్‌లు నిర్వహిస్తున్నారు. భక్తులకు 24 గంటల పాటు వైద్య సౌకర్యం అందించనున్నారు. అన్ని చోట్లా కలిపి 150 మంది స్పెషలిస్టు డాక్టర్లు, సిబ్బంది అందుబాటులో ఉన్నారు. జాతర పరిసర ప్రాంతాల్లో 4 బెడ్స్‌తో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. ఒక్కో చోట ముగ్గురు డాక్టర్లు అందుబాటులో ఉంటారు. డాక్టర్లు, ఏఎన్ఎంలు,



పారామెడికల్ సిబ్బంది కలిపి రెండు వేల మందికి పైగా జాతరలో డ్యూటీలు నిర్వహిస్తారని డీఎంఅండ్‌హెచ్‌వో అప్పయ్య ప్రకటించారు. అత్యవసరంగా రోగులను తరలించేందుకు 108 అంబులెన్సులు 15 అందుబాటులో ఉంచారు. అలాగే టెంపరరీ బ్లడ్ బ్యాంక్ కూడా ఏర్పాటు చేశారు. మహజాతర సందర్భంగా సరిపోయే బెడ్స్,మెడిసిన్, ఇంజెక్షన్ లను అందుబాటులో ఉంచారు అధికారులు. జాతర సమయంలో ప్రతి రోజు 300 మందికి పైగా ఔట్ పేషంట్లకు ట్రీట్మెంట్ అందించేందుకు ఏర్పాట్లు చేశారు. ఫిడ్స్ , స్పృహ తప్పి పోవడం , ఆల్కహాల్ ఇంటాక్సిక్, తల గాయాలతో హెల్త్ క్యాంపస్ కు వస్తున్నారు బాధితులు.ఎమ్జర్గ÷న్సీ కేసులను ములుగు టౌన్ కు తరలిస్తున్నారు వైద్యులు. ఇతర ప్రాంతాల నుంచి భక్తులు వస్తుండటంతో భక్తులు తమ జాగ్రత్తలో ఉండాలని సూచిస్తున్నారు వైద్యులు. మేడారం జాతర కోసం రాష్ట్ర ప్రభుత్వం సర్వం సిద్ధం చేసింది. మౌలిక వసతులు, నిర్వహణ కోసం రూ.105 కోట్లు కేటాయించిన సంగతి తెలిసిందే.

## నాలుగురోజులు సెలవులు

**ములుగు,ఫిబ్రవరి20(వెలుతురు):**
మేడారం మహా జాతర మరికొన్ని గంటల్లో ప్రారంభం కానుంది. ప్రతి రెండేండ్లకోసారి జరిగే ఈ గిరిజన పండుగకు సుమారు రెండు కోట్ల మంది తరలి రానున్నారు. వనదేవతల ను దర్శించుకుని మొక్కులు చెల్లించుకోనున్నారు. దీంతో ములుగు జిల్లాలో జాతర జరుగనున్న నాలుగు రోజుల పాటు ప్రభుత్వం సెలవులు ప్రకటించింది. ఈ నెల 21, 22, 23, 24 తేదీల్లో ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లు, కార్యాలయాలు పనిచేయవని తెలిపింది. ఈమేరకు జిల్లా కలెక్టరు ఇలా త్రిపాఠి ఉత్తర్వులు జారీచేశారు. నాలుగు రోజులపాటు విద్యాసంస్థలను మూసి వేయాలని ఆదేశించారు.

## మేడారం జాతరకు పర్యాటక శాఖ ఏర్పాట్లు

**వీ.ఐ.పీ దర్శనంతో హెలికాప్టర్ సర్వీసులు ఏర్పాటు**

**వివిఐపి, వీఐపీలకు, హరిత హోటల్‌లో ఏర్పాట్లు**

**ఆదివాసి ఛాయా చిత్ర ప్రదర్శన,**

**పర్యాటక సమాచార కేంద్రం ఏర్పాటు**




**మేడారం,ఫిబ్రవరి20(వెలుతురు):**
మేడారం మహా జాతరకు పర్యాటక శాఖ తరపున సకల ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే కుంభమేళా వంటి మేడారం మహా జాతర లో పర్యాటక శాఖ తరఫున అనేక ఏర్పాట్లు చేయనైనది. మేడారం మహా జాతర సందర్భంగా హైదరాబాద్ నుంచి మేడారం వరకు విఐపి దర్శనం చేయించి, మళ్ళీ హైదరాబాద్ లో దించే హెలికాప్టర్ సర్వీసులను భక్తుల సౌకర్యార్థం పర్యాటకశాఖ ఏర్పాటు చేయడం జరిగింది. దేశంలో ఈ స్థాయిలో జరిగే మరే జాతరలో కూడా ఇలాంటి హెలికాప్టర్ సర్వీసులు లేవని, మేడారం జాతరలో మాత్రం ఐదవ సారి సైతం హెలికాప్టర్ సేవలను ఏర్పాటు చేశారు. మేడారం మహా జాతరకు వచ్చే వివిఐపీ, విఐపీల వసతి, భోజన ఏర్పాట్లను హరిత మేడారం వద్ద ఏర్పాటు చేశారు. పర్యాటకశాఖ ఆధ్వర్యంలో ఉన్న హరిత రామప్ప , హరిత గట్టమ్మ , హరిత లక్నవరం హరిత తాడ్వాయి, హరిత భవత హోటల్ లో ఏర్పాట్లు చేయడం జరిగింది. హరిత హోటల్ మేడారం వద్ద గల ఆదివాసి మ్యూజియం ప్రాంగణంలో పర్యాటకశాఖ ఆధ్వర్యంలో ఛాయాచిత్ర ప్రదర్శన, పర్యాటక సమాచార కేంద్రం ఏర్పాటు చేశారు. హరిత గ్రాండ్ హోటల్ ప్రాంగణం లో ఆదివాసుల జీవన విధానం తెలిసే విధంగా ట్రైబల్ హట్స్ ఏర్పాటు చేశారు. అదేవిధంగా మేడారం హరిత హోటల్ గ్రాండ్ సమావేశం మందిరంలో కేంద్ర ప్రభుత్వ టెక్స్ టైల్ మరియు హ్యాండ్లూమ్ మంత్రిత్వ శాఖ ద్వారా చేనేత వస్త్ర ప్రదర్శన ఏర్పాటు చేశారు.

## పగిడిద్ద రాజు పూజరుల విడిది కేంద్రం
# ప్రారంభించిన మంత్రి సీతక్క

**మేడారం,ఫిబ్రవరి20(వెలుతురు):**
మంగళవారం పగిడిద్ద రాజు పూజరుల విడిది కేంద్రాన్ని పంచాయతీ రాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 25 లక్షల రూపాయల నిధులతో నూతన విడిది కేంద్రాన్ని నిర్మించినట్లు మంత్రి తెలిపారు. మహబూబాబాద్ జిల్లా ములుగు నియోజకవర్గం పోనుగొండ్ల గ్రామం నుంచి నేడు సాయంత్రం పెనక వంశీయుల పూజారుల ఆదివాసి గిరిజన సంస్కృతి సాంప్రదాయాల నడుమ మేడారనికి కాలి బాటన పగిడిద్ద రాజు పడిగే తో పూజారులు పయనం కానున్నారు అని ఈ సందర్భంగా ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం లక్ష్మీపురం గ్రామంలో ప్రభుత్వం పూజరులా కోసం 25 లక్షల రూపాయల నిధులతో విడిది కేంద్రాన్ని నిర్మించింది అని తెలిపారు. రోజు రాత్రి పూజారులు విడిది కేంద్రం లో బస చేసి రేపు సాయంత్రం మేడారానికి చేరుకుంటారని దీంతో జాతరలో కీలక ఘట్టం ఆవిష్కృతం ఔతుంది తెలిపారు.

# అమ్మవార్లకు రూపం లేదు - గద్దెల ఏర్పాటు వద్దనే పూజలు

**ములుగు,ఫిబ్రవరి20(వెలుతురు):**
సమ్మక్క, సారలమ్మలకు రూపం లేదు. సమ్మక్క గద్దెను ఆనుకునే భారీ నెమలి నార చెట్టు ఉండేది. గతంలో ఈ నారెపుచెట్టుకే పసుపు కుంకుమ పెట్టి సమ్మక్కగా భావించే వారు. వడ్డెలు (పూజారులు) చిలకల గట్టు నుంచి కుంకుమ భరిణె తీసుకొచ్చి నార చెట్టు వద్దే ఉంచి పూజలు చేసేవారు. చెట్టు, పుట్టలే గిరిజనులకు సమ్మక్క సారక్కలు. ఇప్పటికీ ఆదివాసీ గూడేంలో మేడారం గ్దదెలను పోలిన ఇంటి అరుగులు ఉంటాయి. కాల క్రమేణా గ్దదెల మీద సమ్మక్క సారక్కలు సింహం, పులి మీద ఉన్నట్లుగా ఫోటోలు ముద్రించి జాతరలో అమ్మకాలు చేశారు. ఆ ఫోటోలే భక్తుల మదిలో నిలిచిపోయాయి..
భక్తుల సంఖ్య పెరగడంతో గద్దెల ప్రాంగణంలో బండలు వేశారు. సమ్మక్క సారలమ్మ గద్దెలపై భాగంలోనూ పాలిష్ బండలు అమర్చారు. 1990 కన్నా ముందు జాతర కొచ్చే గిరిజనులు, గ్రామీణులు నేరుగా గ్దదెలపైకి వెళ్లి తాము తెచ్చిన బంగారం, వడిబియ్యం, ఇతరకానుకలు సమర్పించుకునే వారు. భక్తులు అమ్మవార్ల గ్దదెలను స్వయంగా తాకి సంతృప్తిగా మొక్కులు తీర్చుకునేవారు. రానురాను భక్తుల సంఖ్య భారీగా పెరగడంతో జాతర సమయంలో గ్దదెల చుట్టూ క్టటెలతో



బారికేడ్లు కట్టారు. బారికేడ్ల బయట నుంచి అమ్మవార్లను దర్శించుకుని తాము తెచ్చిన బెల్లం, కుడకలు,వడిబియ్యం దూరంనుంచే గద్దెలపైకి వేసేవారు. ఆ సమయంలో క్టటెల బారికేడ్ల వద్ద బందోబస్తులో ఉండే పోలీసులు, స్వచ్ఛంద సంస్థలు, ఆదివాసీ గిరిజన సంఘం కార్యకర్తలకు కొబ్బరికాయలు, బెల్లం తగిలి గాయాలయ్యేవి. ఈ ప్రమాదాలను నివారించేందుకు 2002 లో అప్పటి జిల్లా పాలనా యంత్రాంగం ఆధ్వర్యంలో సమ్మక్క, సారలమ్మ గ్దదెల చుట్టూ ఎత్తైన గ్రిల్స్ లను నిర్మించాలని నిర్ణయించింది. ప్రస్తుతం గద్దెల చుట్టూ ఉన్న ఎత్తైన గ్రిల్స్ అప్పుడు ఏర్పాటు చేసినవే. 90వ దశకం ముందు కేవలం మూడు అడుగుల ఎత్తులో ఉన్న గద్దెలపై తొమ్మిది అడుగుల ఎత్తులో సమ్మక్క ప్రతిరూపం ఉండేది. జాతర రెండో రోజు నెమలి నార చెట్టు పై నాగు పాము వస్తుందని ఆదివాసులు చెబుతారు. ఈ చెట్టు బెరడు తీసుకుని వాటి పొడి పిల్లలకు పాలలో వేసి తాగిస్తే ఆరోగ్యంగా ఉంటారనే నమ్మకంతో భక్తులంతా ఆ చెట్టు బెరడు తీసుకెళ్లేవారు. ఆ భారీ వృక్షం క్రమంగా ఎండిపోవడంతో ప్రస్తుతం తిరిగి మరో చెట్టుని ఫెన్సింగ్ వేసి జాగ్రత్తగా పెంచుతున్నారు. అమ్మవార్ల బొమ్మలు జాతర్లలో అమ్ముతున్నప్పటికీ చాలా మంది నెమలినార చెట్టు ను సమ్మక్క దేవతగా భావిస్తారు. సారలమ్మ ప్రతిరూపమైన గద్దె దాదాపు పదిహేను అడుగుల ఎత్తులో ఉండేది. దీనిచుట్టూ ఏవిధమైన అలంకారాలుండేవి కావు. క్రమక్రమంగా గద్దెలకు తాము తెచ్చిన చీరలతో అలంకరించడం ప్రారంభించారు. ఇలా తొలినాళ్లలో చాలా నిరాడంబరంగా ఉండే సమ్మక్క సారలమ్మల గ్దదెలు, క్రమక్రమంగా ఎత్తైన అరుగుల నిర్మాణం, అనంతర కాలంలో వీటి చుట్టూ గ్రిల్స్ ఏర్పాటు వరకు మార్పు చెందాయి.

# ఎపిలో మూడు రాజ్యసభ సీట్లు ఏకగ్రీవం

### ముగ్గురు వైసిపి అభ్యర్థులు ఎన్నిక

**అమరావతి,ఫిబ్రవరి20(వెలుతురు):** రాజ్యసభ ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లోని మూడు రాజ్యసభ స్థానాలను వైఎస్సార్‌సీపీ ఏకగ్రీవంగా దక్కించుకుంది. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులుగా గొల్ల బాబూరావు, వైవీ సుబ్బారెడ్డి, మేడా రఘునాథ రెడ్డి నామినేషన్లు వేయగా, పోటీగా ఎవరూ నామినేషన్లు వేయలేదు. దీంతో ఈ ముగ్గురు ఏకగ్రీవంగా ఎన్నికైటన్లు అధికారులు ప్రకటించారు. ఈ మూడు స్థానాల గెలుపుతో..



వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యుల సంఖ్య 11కు చేరుకుంది. ఏకగ్రీవమైన రాజ్యసభ సభ్యులకు ఎన్నికల అధికారులు ధృవ పత్రాలను అందించనున్నారు. తాజా ఎన్నికలతో రాజ్యసభలో టీడీపీ జెండా మాయమయినట్టయింది. పార్టీ ఏర్పడిన 41 ఏళ్ల తర్వాత రాజ్యసభలో టీడీపీ సభ్యులు లేని పరిస్థితి వచ్చింది. చంద్రబాబు నాయకత్వంలో టీడీపీ దీనస్థితికి ఇది నిదర్శనం. తన పార్టీకి బలం లేకున్నా.. చివరి వరకు ఓటుకు కోట్లు ఫార్ములా నమ్ముకున్న చంద్రబాబు.. ఆ ఎత్తులు పని చేయకపోవడంతో ఎన్నికల్లో అభ్యర్థిని దించే పని చెయ్యలేదు.

# రైతులకు అండగా ప్రభుత్వం

### పంటలకు గిట్టుబాటులో గత ప్రభుత్వం నిర్లక్ష్యం

### వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు

**హైదరాబాద్, ఫిబ్రవరి 20 (వెలుతురు):** రైతులు పంట వేసిన రోజు నుండి ఆ ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకొనేంతవరకు ఈ రాష్ట్ర ప్రభుత్వము ప్రతి విషయంలో రైతులకు అండగా ఉంటుందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలియజేసారు. కేవలం ఒకటి లేదా రెండు పంటల కొనుగోళ్లు చేసి మిగతా పంటలకు గిట్టు బాటు ధర అందించే విషయములో గత ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి కారణంగా రాష్ట్రంలో 75శాతం సాగు విస్తీర్ణం రెండు,మూడు పంటల క్రిందకు వచ్చింది.

ఈ పరిస్థితిని నివారించి అన్నీ పంటలకు గిట్టు బాటు ధర వచ్చే విధంగా అవసరమయ్యే చర్యలు చేపట్టాలని ప్రభుత్వం నిశ్చయించింది. ఈ క్రమనీలో పసుపు బోర్డు ఏర్పాటు, సెంటర్ల కొనసాగింపుకు విజ్ఞప్తి చేసిన విషయం విదితమే. ఇప్పుడు మార్కెట్లకు పోటెత్తుతున్న మిర్చి పంట అమ్మకాల్లో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కానీ, ధర విషయంలో తేడా కానీ రాకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని మార్కెటింగ్ శాఖకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడమైనది. రాష్ట్ర స్థాయిలో మరియు జోనల్ స్థాయిలో పనిచేసే సంబంధిత అధికారులను అమ్మకాలు ఎక్కువగా జరిగే మార్కెట్లకు పర్యవేక్షకులుగా నియమించి ఎప్పటికప్పుడు నివేదికలు తెప్పించుకొనే ఏర్పాట్లు చేయడం జరిగింది. ఈ సీజన్‌లో రాష్ట్రంలో 3 లక్షల 91 వేల ఎకరాలలో మిర్చి సాగుచేయగా ఇప్పటికే 94395.08 మెట్రిక్ టన్నుల మిర్చి మార్కెట్‌కు రావడం జరిగిందని రానున్న రోజుల్లో 337014 మెట్రిక్ టన్నులు వచ్చే అవకాశం ఉన్నదని కావున మార్కెటింగ్ శాఖ జిల్లా అధికారులు, మార్కెట్ కమిటీ కార్యదర్శులు ఎటువంటి నిర్లక్ష్యమునకు తావివ్వకుండా, అమ్మకాలు సజావుగా సాగేంధుకు అన్నీ చర్యలు చేపట్టాలని లేనిచో కఠినచర్యలు తీసుకొంటామని మంత్రి హెచ్చరించారు. అధే విధంగా వేరుశనగ అమ్మకాల్లో రైతులకు ఎక్కడైనా ఇబ్బందులు తలెత్తితే సత్వరము పరిష్కరించి అమ్మకాలు సజావుగా సాగేటటట్లు చూడాలని అధికారులకు ఆదేశించారు.

రాష్ట్రంలో ఈ యాసంగిలో దాదాపు 2 లక్షల ఎకరాలలో వేరుశనగ సాగుకాగా 1.92 లక్షల మెట్రిక్ టన్నులు దిగుబడి రాగలదని అంచనా వేయడం జరిగింది. ఇప్పటికే 93 వేల మెట్రిక్ టన్నులు అమ్మకానికి రాగా, స్వంత అవసరాలకు పోను ఇంకా మార్కెట్లకు 46 వేల టన్నుల వేరుశనగ వచ్చే అవకాశం ఉందని తెలియజేసారు.

వ్యవసాయ ఉద్యానశాఖల నుంచి కూడా అధికారులను సంబంధిత జిల్లా అధికారులతో మిర్చి వేరుశనగ అధికంగా పండించే జిల్లాలను సందర్శించి, రైతులందరికీ మార్కెట్లకు ఉత్పత్తులను తీసుకొచ్చే విషయములో అవగాహన కల్పించగలరని ఆదేశించడమైనది.

# బిజెపి బండారం బయటపడింది

### సుప్రీం తీర్పును స్వాగతించిన ఆప్

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి20(వెలుతురు):** చండీగఢ్ మేయర్ ఎన్నికల ఫలితాలపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై ఆమ్ ఆద్మీ పార్టీ సంతోషం వ్యక్తం చేసింది. సుప్రీంకోర్టులో బీజేపీ బండారం బయటపడిందంటూ ఆ పార్టీ విమర్శలు గుప్పించింది. ఈ సందర్భంగా ఢిల్లీ మంత్రి, ఆప్ నేత సౌరభ్ భరద్వాజ్ మాట్లాడుతూ.. ఇంత చిన్న ఎన్నికల్లోనే కేంద్ర ప్రభుత్వం, బీజేపీ దోపిడీకి పాల్పడిందంటే.. అది పెద్ద ఆందోళన కలిగించే విషయమేనని అన్నారు. ఇదే సమయంలో ఢిల్లీ సీఎం, ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ సుప్రీంకోర్టుకు ధన్యవాదాలు తెలిపారు. ఇలాంటి క్లిష్ట సమయాల్లో ప్రజాస్వామ్యాన్ని కాపాడినందుకు సుప్రీంకోర్టుకి ధన్యవాదాలు అని ఎక్స్ వేదికగా ఆయన రాసుకొచ్చారు. దిలావుండగా.. జనవరి 30వ తేదీన జరిగిన చండీగఢ్ మేయర్ ఎన్నికల్లో తగినంత సంఖ్యా బలం(16) లేకపోయినప్పటికీ బీజేపీ మేయర్ అభ్యర్థి మనోజ్ సోంకర్ విజయం సాధించారు. మెజారిటీకి అవసరమైన కౌన్సిలర్ల బలం(20) ఉన్నా.. ఆప్-కాంగ్రెస్ కూటమి అభ్యర్థి కుల్దీప్ కుమార్ మాత్రం ఓటమి పాలయ్యారు. దీంతో.. ఈ ఎన్నికల్లో అక్రమాలు జరిగాయంటూ పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్‌ను విచారించిన న్యాయస్థానం.. ఆప్ అభ్యర్థి అయిన కుల్దీప్‌ను విజేతగా ప్రకటిస్తూ తీర్పు వెలువరించింది. భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాల ధర్మాసనం ఈ తీర్పు వెలువరించింది. రిటర్నింగ్ అధికారి బ్యాలెట్ పత్రాలను తారుమారు చేసేందుకు.. ఉద్దేశపూర్వకంగా వ్యవహరించారని స్పష్టంగా తెలుస్తోందని తెలిపింది.
ఈ సందర్భంగా.. రిటర్నింగ్ అధికారి కొట్టివేత గుర్తు పెట్టిన బ్యాలెట్ పేపర్లను ధర్మాసనం పరిశీలించింది. అనంతరం లెక్కింపు ప్రక్రియను సంబంధించిన వీడియోని మరోసారి వీక్షించారు.

# బిజెపి,బిఆర్ఎస్ పొత్తులు

### కాంగ్రెస్ కుట్ర అన్న బండి

**వికారాబాద్,ఫిబ్రవరి20(వెలుతురు):** బీజేపీ -బీఆర్ఎస్ పొత్తు కాంగ్రెస్ పార్టీ సృష్టి అని బీజేపీ జాతీయ కార్యదర్శి బండి సంజయ్ పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలోనూ కాంగ్రెస్ పలు ఆరోపణలు చేసిందని గుర్తు చేశారు. బీజేపీ బీఆర్ఎస్‌తో రహస్యంగా పొత్తు కుదుర్చుకుందని కాంగ్రెస్ నాయకులు మాట్లాడారని సంజయ్ పేర్కొన్నారు. తాండూరులో విజయ సంకల్ప్ బస్సు యాత్ర ప్రారంభోత్సవం సందర్భంగా సంజయ్ ఈ వ్యాఖ్యలు చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోదని సంజయ్ తెలిపారు. ఒంటరిగానే లోక్‌సభ ఎన్నికల్లో పోటీ పడుతామని ఆయన పేర్కొన్నారు. ఈ విషయంలో పార్టీ కూడా కచ్చితమైన నిర్ణయం తీసుకుందన్నారు. తెలంగాణలో బీజేపీకి అనుకూల వాతావరణం ఉందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని అత్యధిక స్థానాల్లో గెలిపించేందుకు తెలంగాణ ప్రజలు సిద్ధంగా ఉన్నారని బండి సంజయ్ తెలిపారు.

# ఫుడ్ పాయిజన్‌తో 13 మంది విద్యార్థులు అస్వస్థత

**జోగులాంబగద్వాల,ఫిబ్రవరి20(వెలుతురు):** ఫుడ్ పాయిజన్‌తో13 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఈ సంఘటన గద్వాల మండల పరిధిలోని రేకులపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మంగళవారం పాఠశాలలో మధ్యాహ్న భోజనం భోజనం చేసిన అనంతరం విద్యార్థులు వాంతులు, కడుపునొప్పి, తలనొప్పితో బాధపడుతుండడంతో వెంటనే జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. విద్యార్థులకు ఎలాంటి ప్రమాదం లేదని డాక్టర్ సౌమ్య తెలిపారు. విషయం తెలుసుకున్న మండల విద్యాధికారి దవాఖానకు చేరుకున్నారు. విద్యార్థులకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకున్నారు. విద్యార్థులకు ప్రాథమిక చికిత్స చేసిన అనంతరం వారి ఇండ్లకు పంపించారు.

# ఇక రెండు సార్లు బోర్డు పరీక్షలు

### 2025-26 విద్యా సంవత్సరం నుంచి అమలు

### టెన్త్, ఇంటర్ పరీక్షలపై కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి20(వెలుతురు):** పదో తరగతి, ఇంటర్ బోర్డు పరీక్షలకు విద్యార్థులు రెండుసార్లు హాజరయ్యేందుకు అవకాశం ఇవ్వనున్నట్లు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ప్రకటించారు. 2025-26 విద్యా సంవత్సరం నుంచి అమలు చేయనున్నట్లు వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్‌లో పీఎం శ్రీ (ప్రైమ్ మినిస్టర్ స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా) పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన బోర్డు పరీక్షలపై కీలక వ్యాఖ్యలు చేశారు. 2020లో తీసుకొచ్చిన కొత్త జాతీయ విద్యా విధానంలో విద్యార్థులపై ఒత్తిడిని తగ్గించడం ఒకటని, ఈ క్రమంలో విద్యార్థులు రెండుసార్లు బోర్డు పరీక్షలకు హాజరయ్యే అవకాశం కల్పించాలని నిర్ణయం తీసుకున్నట్లు కేంద్రమంత్రి తెలిపారు. విద్యార్థులు 2025-26 విద్యా సంవత్సరం నుంచి రెండుసార్లు 10, ఇంటర్ విద్యార్థులు బోర్డు పరీక్షలకు హాజరయ్యే అవకాశం ఉంటుందని తెలిపారు. గత ఏడాది ఆగస్టులో విద్యా మంత్రిత్వ శాఖ ప్రకటించిన కొత్త కరికులం ఫ్రేమ్‌వర్క్ ప్రకారం.. విద్యార్థులు మంచి పనితీరు కనబరిచేందుకు తగినంత సమయం ఇవ్వడానికి బోర్డు పరీక్షలు సంవత్సరానికి కనీసం రెండుసార్లు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులపై ఒత్తిడి లేకుండా ఉంచడం, నాణ్యమైన విద్యతో వారిని సంపన్నం చేయడం, విద్యార్థులను సంస్కృతితో అనుసంధానం చేయడం, భవిష్యత్తు కోసం వారిని సిద్ధం చేయడం జాతీయ విద్యా విధానం ఉద్దేశమన్నారు. ఇదిలా ఉండగా.. దేశవ్యాప్తంగా విద్యార్థులు తమ మాతృభాషలో చదుకునేందుకు అవకాశం కల్పించాలని నిర్ణయించిన కేంద్రం రాబోయే మూడేళ్లలో అన్ని తరగతుల పాఠ్య పుస్తకాలను ప్రాంతీయ భాషల్లో అందుబాటులో ఉంచాలని ఆదేశించింది. ఈ మేరకు ట్రాన్స్‌లేషన్ చేయాలని ఎన్‌సీఈఆర్‌టీ, యూజీసీ, ఏఐసీటీఈ, ఇగ్నో, జాతీయ సార్వత్రిక విద్యా పీఠం (ఔఎక్షా)తోపాటు కేంద్రీయ విద్యాసంస్థలైన ఐఐటీలు, ఎన్ఐటీలు, సెంట్రల్ వర్సిటీలను విద్యాశాఖ ఆదేశించింది. మాతృభాషలో చదువుకోవడాన్ని ప్రోత్సహించాలని జాతీయ నూతన విద్యా విధానం-2020 సిఫారసు చేసిన విషయం తెలిసిందే. బీటెక్ కోర్సులనూ ప్రాంతీయ భాషల్లో బోధనకు ఏఐసీటీఈ దేశవ్యాప్తంగా అనుమతి ఇస్తుండగా.. మధ్యప్రదేశ్‌లో ఎంబీబీఎస్ కోర్సు హిందీ మాధ్యమంలో ఇప్పటికే ప్రారంభమైంది.

పీఎంశ్రీ పథకంపై కేంద్రమంత్రి మాట్లాడుతూ ఛత్తీస్‌గఢ్‌లోని 211 పాఠశాలలను హబ్ అండ్ స్పోక్ మోడల్‌లో అప్‌గ్రేడ్ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఒక్కోదానికి రూ. 2కోట్లు వెచ్చించనున్నట్లు పేర్కొన్నారు. 2036 ఒలింపిక్ క్రీడలకు భారత్ ఆతిథ్యం ఇస్తుందని, నాలుగేళ్లలో జరిగే ఈ ఈవెంట్‌లో దేశానికి 10శాతం పతకాలు ఛత్తీస్‌గఢ్‌కు చెందిన అథెట్ల నుంచే రావాలని ఆకాంక్షించారు. ఇందుకోసం రాష్ట్రంలోని క్రీడాకారులు ఈ ఏడాది నుంచే సన్నద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు.

# ఎపిలో తుగ్లక్ తరహా పాలన

### గీతదాటి వ్యవహరిస్తున్న పాలకులు

### లోక్‌సత్తా అధినేత జెపి సంచలన వ్యాఖ్యలు

**హైదరాబాద్,ఫిబ్రవరి20(వెలుతురు):** లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు జయప్రకాశ్ నారాయణ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఏపీలో సీఎం జగన్మోహన్‌రెడ్డి పాలనపై ఆయన చేసిన హాట్ కామెంట్స్ ఇప్పుడు సోసల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఓ ఇంటర్వ్యూలో రాష్ట్రంలో వైసీపీ పాలనపై జేపీ కీలక వ్యాఖ్యలు చేశారు. ఏపీలో తుగ్లక్ రాజ్యం తరహాలో పాలన సాగుతోందని చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు తీవ్ర దుమారాన్ని రేపుతున్నాయి. నిన్న, మొన్నటి వరకు రాష్ట్రంలో పాలన బాగుందంటూ కితాబిచ్చిన ఆయన.. పరిపాలన వికేంద్రీకరణకు అనుగుణంగా ఏర్పాటు చేసిన గ్రామ/వార్డు సచివాలయాల విధానాన్ని ప్రశంసించారు. అటువంటి ఆయనే తాజాగా ఏపీలోని వైసీపీ పాలనపై చేసిన ఆసక్తికర వ్యాఖ్యలు అధికార పార్టీని ఇరకాటంలో పెట్టాయి. ప్రస్తుతం జేపీ చేసిన వ్యాఖ్యల వీడియోలను ప్రతిపక్షాలు సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారు. ఇదీ వైసీపీ పాలనపై ప్రముఖుల అభిప్రాయం అంటూ సామాజిక మాధ్యమాల్లో ట్రోల్ చేస్తున్నారు. ఏపీలో నేతలు గీత దాటి వ్యవహరిస్తున్నారు. కనీస మర్యాదలు పాటించడ లేదు. తుగ్లక్ రాజ్యం ఒక పక్కన. నువ్వు ఏం చేసినా అడ్డుకుంటా. బస్తీ మే సవాల్ అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. అందులో భాగమే రాజధానిని ఆపేయడం కావచ్చు. గ్రీన్ ఫీల్డ్ సిటీని ఆపేయడం కావచ్చు. పోలవరం ఆపేయడం కావచ్చు. ఎన్ని మాటలు చెప్పినా పోలవరం బ్రహ్మాండంగా జరగడం లేదు' అంటూ వైసీపీ పాలనపై విమర్శలు గుప్పించారు. పెట్టుబడులు పెట్టేందుకు ఎవరు వచ్చినా, రాకపోయినా.. బోడి వచ్చేది ఏంటి అన్న భావనలో ఇక్కడ నేతలు ఉన్నారంటూ జేపీ విమర్శించారు. ఇక్కడ ఒక గూండా రాజ్యం తెస్తున్నారన్న భావనను కలిగించారని జేపీ ఆరోపించారు. 'తెలంగాణలో చట్టబద్ధ పాలన లేదు.



కానీ, చంద్రబాబు, కేసీఆర్, రేవంత్, మరొకరు గానీ.. శ్రీనివాస్ ప్రత్యర్థి కాబట్టి తలకాయ తీసేయాలన్న పరిస్థితి లేదు. తప్పులు చేస్తున్నారు. ఎక్కడ ఒకచోట గీత ఆ నేతలకు ఉంది. ఏపీలో కచ్చితంగా ఆ గీత దాటి వ్యవహరిస్తున్నారు. కనీస మర్యాద పాటించడం లేదు' అంటూ జేపీ చేసిన వ్యాఖ్యలు వైరల్ అయ్యాయి.

# 26న అనంతలో కాంగ్రెస్ ఎన్నికల శంఖారావం


### ముఖ్య అతిధిగా మల్లికార్జున ఖర్గే రాక

### పిసిసి మాజీ అధ్యక్షులు సాకే శైలజనాథ్

**అనంతపురం,ఫిబ్రవరి20(వెలుతురు):** ఈనెల 26న అనంతపురంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల శంఖారావం ప్రారంభించనున్నట్లు పిసిసి మాజీ అధ్యక్షులు సాకే శైలజనాథ్ తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం రాయదుర్గంలోని ఎన్జీవో హోంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈనెల 26న అనంతపురంలో కాంగ్రెస్ పార్టీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సభలో ఏఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిలారెడ్డి మాజీ



మంత్రి డాక్టర్ ఎన్ రఘువీరా రెడ్డి, ఇతర ముఖ్య నాయకులు పాల్గొంటున్నట్లు తెలిపారు. గతంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలో ఉన్నప్పుడు హంద్రీనీవా పథకం అమలు చేయడంతో పాటు వ్యవసాయ, పశు వైద్య, పాలిటెక్నిక్ కళాశాలలు, కస్తూరిబా పాఠశాల, మోడల్ పాఠశాల, హాస్టల్లు మొదలైనవి అనేకం అభివృద్ధి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇటీవల అనంతపురంలో జరిగిన వైసిపి సిద్ధం గురించి మాట్లాడుతూ.. వైసిపికి ఎలాంటి అజెండా లేదన్నారు. ఆ పార్టీ ప్రభుత్వం దేనికి సిద్ధం చెప్పాలన్నారు. జిల్లా అభివృద్ధికి వైసిపి చేసిందేమిటో, ఏమి చేస్తారో చెప్పడానికి సిద్ధంగా ఉండాలన్నారు. ప్రజలకు ఏం కావాలి, ఏం చేయాలి అనే విషయమై వైసిపికి స్పష్టత లేదన్నారు. సీఎం అనంతపురం వచ్చినప్పటికీ కరువు పీడిత జిల్లాకు ఏం చేశారో, ఏం



చేస్తామో చెప్పలేదు అన్నారు. కేవలం రాజకీయ ఉపన్యాసం ఇచ్చి వెళ్లారన్నారు. అయితే కాంగ్రెస్ పార్టీ ప్రజలకు చెప్పడానికే ఈ నెల 26న ఎన్నికల శంఖారావం అనంతపురంలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. ముఖ్యమైన అంశాలు, ఎన్నికల అజెండా కాంగ్రెస్ పార్టీ ఇక్కడే ప్రకటించే అవకాశం ఉందన్నారు. దేశ, రాష్ట్ర భవిష్యత్తు కోసం ఎన్నికలలో అనంతపురం జిల్లాకు మేలు చేసిన వారిని, చేసేవారి గురించి ఆలోచించాలని ప్రజలను కోరుతున్నట్లు చెప్పారు. అధికారపక్షం దిగిపోవడానికి ఇంకా కొద్దిరోజులు సమయం ఉందని, దేనికైనా సిద్ధం అనడంలో ఆశ్చర్యార్థకం ఉందన్నారు. రాయదుర్గం నుండి తాడిపత్రి వరకు వైసిపి ఏం చేసిందో చెప్పి ఎన్నికలకు రావాలని కోరారు. విలేకరుల సమావేశంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ప్రతాపరెడ్డి, ప్రధాన కార్యదర్శి రామానాయుడు, ఉపాధ్యక్షులు కోరి నాగరాజు, యువజన కాంగ్రెస్ తాలూకా అధ్యక్షుడు ఊరు వాకిలి అనిల్ కుమార్, రాయదుర్గం పట్టణ అధ్యక్షుడు జయన్న తదితరులు పాల్గొన్నారు.

# విద్యారంగాన్ని భ్రష్టు పట్టిస్తున్నారు: పిడిఎస్‌యూ

**రాజమహేంద్రవరం,ఫిబ్రవరి20(వెలుతురు):** రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత యూనివర్శిటీలను భ్రష్టుపట్టించారని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు యు.గనిరాజు అన్నారు. కొంతమంది వైస్‌ఛాన్స్‌లర్లు వైసీపీ ఏజెంట్లుగా పనిచేస్తున్నారని ఆరోపించారు. విద్యకు పెద్దపీట వేస్తున్నామని చెప్పి భ్రష్టు పట్టిస్తున్నారని అన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం నూతన జాతీయ విద్యావిధానం పేరుతో విదేశీ యూనివర్శిటీలకు రెడ్‌కార్పెట్ పరుస్తూ దేశంలోని ప్రభుత్వ యూనివర్శిటీలను ధ్వంసం చేసే ఆలోచన చేస్తోందని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు యు.గనిరాజు అన్నారు. ఉన్నత విద్యారంగాన్ని విదేశీ కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని అన్నారు.మోదీ ప్రభుత్వం మాటల్లో స్వదేశీ విధానమని చెప్పుకుంటూ ఆచరణలో విదేశీ కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తోందని విమర్శించారు. నూతన జాతీయ విద్యావిధానం-2020 పేరుతో విద్యారంగాన్ని కాషాయీకరణ చేయడంతోపాటు విద్యను విదేశీ కార్పొరేట్‌శక్తులకు అప్పగిస్తున్నారని, దీన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని అన్నారు.

# రహదారులు రక్తసిక్తం

### అతివేగం,మద్యం కారణంగా తరచూ ప్రమాదాలు

**నెల్లూరు,ఫిబ్రవరి20(వెలుతురు):** జిల్లాలోని రహదారులు ప్రమాద కేంద్రాలుగా మారడంతో రోజుకు రెండు నుంచి మూడుకుపైగానే ప్రమాదాలు జరుగుతున్నాయి. జాతీయ రహదారిపై నిబంధనలు పాటించే వాహన దారులు కనిపించడం లేదు. నిబంధనల అమలులో వాహనదారులు, అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఎంతో మంది క్షతగాత్రులు అవుతుండగా సగటున రోజుకి ఒకరైనా ప్రాణాలు విడుస్తున్నారు. అతివేగం, నిద్రమత్తు, మద్యం సేవించి వాహనాలు నడపడం, నిర్లక్ష్యంతోనే ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. మరోవైపు రోడ్ల పక్కన విచ్చలవిడిగా వాహనాలు ఆపుతుండటం వల్ల కూడా ప్రమాదాలు జరుగుతున్నాయి. వీటి నివారణకు పోలీసు శాఖ, రవాణా శాఖలతోపాటు మరి కొన్ని శాఖలు చర్యలు చేపట్టాల్సి ఉన్నా ఎవరికి వారుగా మిన్నకుండిపోతున్నారు. రోడ్డు పక్కనే వాహనాలు నిలుపుదలను అరికట్టడంలో అధికారులు నిత్యం విఫలమవుతూనే ఉన్నారు. దూర ప్రాంతాలకు రాకపోకలు సాగించే లారీలు, వాహనాల నిలుపుదల కోసం జిల్లాలో ఐదు ప్రాంతాలను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. ఇక్కడ వాహనాలు ఆపడం, డ్రైవర్లు స్నానం చేసేందుకు, వంటలు వండుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేసింది. కావలి నుంచి తడ వరకు ఈ ప్రాంతాలు ఉన్నా ఇక్కడ నిలిపే వారి సంఖ్య అతి తక్కువగానే ఉంటోంది. మద్యం దుకాణాలు, దాబా హోటళ్ల వద్ద గంటల తరబడి వాహనాలు ఆపుతున్నారు. దీంతో ఈ వాహనాల ద్వారానే ప్రమాదాల సంఖ్య అధికంగా ఉంటుంది. రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు కలిసి పని చేయాల్సిన పలు శాఖల మధ్య సమన్వయ లోపం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. జాతీయ రహదారులపై క్రాస్ పాయింట్లను ఆర్టీవో, పోలీసు, విద్యార్థులు సంయుక్తంగా సర్వే చేసి గుర్తించారు. 3వేలకుపైగానే క్రాస్ రోడ్లు ఉన్నట్లు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. డేంజర్ స్పాట్లను గుర్తించినా వాటిలో పూర్తి స్థాయిలో ప్రమాదాలను నివారించడంలో ఆర్టీవో అధికారులు సైతం నిర్లక్ష్య ధోరణిలో వ్యవహరిస్తు న్నారన్న ఆరోపణలు ఉన్నాయి. రోడ్డు ప్రమాదాలపై ప్రజలకు నిరంతరం అవగాహన కల్పిస్తూనే ఉన్నామని పోలీసులు అంటున్నారు. అతివేగం ప్రమాదాలకు కారణమని పదే పదే తెలుపుతున్నా ప్రజలు ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు.

# కుప్పంలో నారా భువనేశ్వరి యాత్ర

**కుప్పం,ఫిబ్రవరి20(వెలుతురు):** టిడిపి అధినేత చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి చేపట్టిన 'నిజం గెలవాలి' యాత్ర కొనసాగుతోంది. మంగళవారం చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంలోని గుడిపల్లి మండలం కొడతనపల్లి గ్రామంలో పార్టీ కార్యకర్త వెంకటేష్ కుటుంబాన్ని ఆమె పరామర్శించారు. చంద్రబాబు అక్రమ అరెస్టును తట్టుకోలేక గతేడాది అక్టోబరు 10న వెంకటేష్ గుండెపోటుతో మృతిచెందారు. దీంతో ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చి, రూ. 3 లక్షల చెక్కును అందజేశారు. పార్టీ తరపున వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వెంకటేష్ ముగ్గురు పిల్లలను ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చదివించనున్నట్లు ప్రకటించారు.



# డాన్ 3లో కియారా..

రామ్ చరణ్ తో 'గేమ్ చెంజర్' సినిమా చేస్తున్న బాలీవుడ్ నటి కియారా అద్వానీ ఇప్పుడు మరో పెద్ద ఛాన్స్ కొట్టేసింది. దర్శకుడు ఫర్హాన్ అక్తర్ తీయబోయే 'డాన్ 3' సినిమాలో కియారా అద్వానీ చేస్తున్నట్టుగా అధికారికంగా ప్రకటన వచ్చింది. ఇందులో రణవీర్ సింగ్ కథానాయకుడిగా నటిస్తుండగా, అతనికి జోడీగా కియారా అద్వానీ చేస్తున్నట్టుగా చిత్ర నిర్వాహకులు ప్రకటించారు. ఇది ఇంతకు ముందు తీసిన 'డాన్' సినిమాకి రెండో సీక్వెల్ గా రావటం విశేషం. దర్శకుడు ఫర్హాన్ అక్తర్ సామాజిక మాధ్యమం ద్వారా ఈ విషయాన్ని చెపుతూ, మా డాన్ యూనివర్స్‌కి స్వాగతం అంటూ కియారా అద్వానీ కి చెప్పారు. కియారా మొదటిసారిగా రణవీర్‌సింగ్‌తో ఈ సినిమాలో నటిస్తున్నారు, ఇంతకు ముందు ఆమె రణవీర్ సింగ్ తో చెయ్యలేదు. ఇంతకు ముందు వచ్చిన రెండు సినిమాలలో షా రుఖ్ ఖాన్, ప్రియాంక చోప్రా నటించారు, ఇప్పుడు రణవీర్ సింగ్ ఈ మూడో సినిమాలో కథానాయకుడిగా నటిస్తున్నారు.ఇది ఒక యాక్షన్ సినిమాగా తెరకెక్కనుందని అంటున్నారు, ఇందులో కియారా అద్వానీ ఒక యాక్షన్ పాత్రలో కనిపించ నున్నారని తెలుస్తోంది. ఇదిలా ఉండగా, కియారా ఇంకో యాక్షన్ సినిమాలో కూడా నటిస్తున్నారు. హృతిక్ రోషన్, జూనియర్ ఎన్టీఆర్ కలిపి నటిస్తున్న 'వార్ 2'లో కూడా కియారా అద్వానీ కథానాయికగా నటిస్తోంది. ఇంతవరకు యాక్షన్ పాత్రలు చెయ్యని కియారా ఇప్పుడు ఈ 'డాన్ 3', 'వార్ 2' లతో, యాక్షన్ జానర్‌లో కూడా తన ప్రతిభ చూపించుకోవడానికే అవకాశం దక్కింది. అలాగే తెలుగులో 'గేమ్ చెంజర్' లో రామ్ చరణ్ పక్కన నటిస్తోంది. దీనికి శంకర్ దర్శకుడు. ఈ సినిమా తెలుగుతో పాటు అన్ని భాషల్లో విడుదలవుతోంది.



# కొత్త పూజాను చూస్తారంటున్న హెగ్డే

గత ఏడాది ఏప్రిల్‌లో విడుదలైన సల్మాన్ 'కిసీ కా భాయ్ కిసీకి జాన్' తర్వాత పూజా హెగ్డే సినిమా ఒక్కటి కూడా విడుదల కాలేదు. దాదాపు ఏడాది నుంచి తమ అభిమాన తార వెండితెరపై కనిపించకపోవడం పూజా అభిమానులను ఆవేదనకు గురి చేస్తున్న అంశం. అయితే.. ఈ బాధ ఈ ఏడాది అక్టోబర్ 11 వరకేనని, ఆరోజు షాహిద్‌కపూర్‌తో తాను నటిస్తున్న 'దేవ' విడుదల కానున్నదని, అందులో కొత్త పూజాని చూస్తారని మంగళూరు భామ పూజా హెగ్డే అంటున్నారు. తన కెరీర్‌లో ఇప్పటివరకూ చేయని భిన్నమైన పాత్రను 'దేవ'లో చేస్తున్నట్టు పూజ చెప్పారు. ఓ హై ప్రొ÷ల్ కేస్ ఇన్విస్టిగేషన్ నేపథ్యంలో ఈ సినిమా కథ నడుస్తుందని, కథనం షాక్‌కు గురిచేస్తుందని, తన పాత్ర తీరుతెన్నులు ఆడియన్స్‌ని షాక్‌కి లోనుచేస్తాయని పూజా తెలిపారు.




# పాత జ్ఞాపకాలు అమోఘం

## బికినీ ఫోటోలను విడుదల చేసిన ఇలియానా

గోవా బ్యూటీ ఇలియానాకు బీచ్ అన్నా, బాత్ టబ్ అన్నా ప్రాణం. కుదిరితే బీచ్ దగ్గర విహరిస్తుంటుంది. లేదా ఇంట్లో ఉన్న బాత్ టబ్‌నే బీచ్ గా భావిస్తూ నీటితో ఆడుతుంటుంది. కెరీర్ బిగినింగ్ నుంచి జీరో సైజ్ బాడీని మెయినటెన్ చేస్తున్న కథానాయిక ఈమె. గతేడాది ఆగస్ట్ ఒకటో తేదీని ఆమె పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. ప్రస్తుతం అమ్మతనాన్ని ఆస్వాదిస్తోంది. తాజాగా ఇలియానా పోస్ట్ చేసిన ఫొటోలు నెట్టింట వైరల్ అవుతోంది. ఆమె గర్భవతిగా ఉన్న సమయంలో బికినీ ధరించి బాత్రూమ్‌లో దిగిన ఫొటో ఒకటి ఇన్స్టాలో షేర్ చేసింది. ఈ మిర్రర్ సెల్ఫీ బ్లాక్ అండ్ వైట్‌లో ఉండటం విశేషం. బ్లాక్ బికినీలో ఓ చేత్తో తన బేబీ బంప్‌ను చూపిస్తూ సెల్ఫీ దిగింది. 'ఏడాది కిందట. నాలుగు నెలల ప్రెగ్నెంట్‌గా ఉన్న సమయంలో ఇలా' అనే క్యాప్షన్‌తో ఇలియానా ఈ ఫొటో షేర్ చేసింది. ప్రస్తుతం ఈ ఫోటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి.

ప్రస్తుతం తన పార్టనర్‌తో అమెరికాలో ఉన్న ఆమె గర్భవతిగా ఉన్నప్పటి ఫోటోలు చూసుకుంటూ ఆ జ్ఞాపకాలను నెమరువేసుకుంటోంది. ఆమె ఈ మధ్య తన పార్ట్‌నర్ మైఖేల్ డోలాన్‌తో కలిసి వాలెంటైన్స్ డే సెలబ్రేట్ చేసుకుంది. ప్రస్తుతం ఇలియానా హిందీలో రెండు చిత్రాల్లో నటిస్తోంది.

# నేడు గోవాలో నటి రకుల్ పెళ్లి



## హాజరు కానున్న పలువురు ప్రముఖులు

గత రెండేళ్లలో బాలీవుడ్‌లో ఎన్నో సెలబ్రిటీల పెళ్లిళ్లు జరిగాయి. ఇక ఇప్పుడు రకుల్ ప్రీత్ సింగ్ కూడా ఆ జాబితాలో చేరనుంది. హీరో, ప్రొడ్యూసర్ అయిన జాకీ భగ్నానీని రకుల్ ప్రేమించి పెళ్లి చేసుకోనుంది. ఫిబ్రవరి 21న గోవాలో రకుల్, జాకీ డెస్టినేషన్ వెడ్డింగ్‌ను ఏర్పాటు చేసుకున్నారు. ఇక దానికోసం రెండు రోజుల ముందే అక్కడికి చేరుకున్నారు. రకుల్, జాకీ.. ఇద్దరికీ బాలీవుడ్‌లో మంచి గుర్తింపు ఉంది. అందుకే హిందీ సినీ పరిశ్రమలో వీరిద్దరికీ క్లోజ్ అయిన నటీనటులు ఈ వివాహానికి హాజరు కానున్నారు. అంతే కాకుండా ఒక సీనియర్ నటి ఈ పెళ్లిలో డ్యాన్స్ చేయడంతో పాటు తనకు కాబోయే భార్య రకుల్‌కు ఒక స్పెషల్ సర్‌ప్రైజ్‌ను కూడా ప్లాన్ చేశాడట జాకీ. రకుల్ ప్రీత్ సింగ్, జాకీ భగ్నానీ మూడేళ్ల క్రితం తమ ప్రేమ గురించి సోషల్ మీడియాలో ప్రకటించారు. అప్పటినుండి వీరి పెళ్లి ఎప్పుడా అని ఫ్యాన్స్ ఎదురు చూస్తున్నారు. చివరగా గోవాలో వీరి డెస్టినేషన్ వెడ్డింగ్ జరగనుంది అని రూమర్ మొదలయ్యింది. అది రూమర్ కాదు.. నిజమే అని కన్ఫర్మ్ అయ్యింది. ఇక ఈ పెళ్లిలో తనకు కాబోయే భార్య రకుల్‌కు స్పెషల్ సర్‌ప్రైజ్‌ను ఎ÷-లాన్ చేశాడట జాకీ భగ్నానీ. అక్కడ తన కోసం పెర్ఫార్మెన్స్ ఇవ్వనున్నాడని సమాచారం. వారి లవ్ స్టోరీపై ఒక ప్రత్యేకంగా పాటను రాయించాడట జాకీ. మయూర్ పూరీ అనే రైటర్‌తో రకుల్, తన ప్రేమకథను 'బిన్ తేరే' అనే పాటను తయారు చేయించాడట. ఈ పాటపై పెళ్లిలో జాకీ స్పెషల్ పెర్ఫార్మెన్స్ ఉంటుందని సమాచారం. బిన్ తేరే' పాటకు తనిష్క్ బాగ్చీ సంగీతాన్ని అందించగా.. జాహ్రాహ్ ఎస్ ఖాన్, రోమిలాతో పాటు జాకీ స్వయంగా దీనిని పాడాడు. 'రకుల్ కోసం రాయించిన ఈ పాట కోసం జాకీ తన ప్రాణం పెట్టాడు. ఇది పెళ్లిలో ముఖ్యమైన ఘట్టం కానుంది. తనకు గుర్తుండిపోయే గిఫ్ట్ ఇవ్వాలనే ఆలోచనతో ఈ ఐడియాతో ముందుకొచ్చాడు. ఈ పాట వారి ప్రేమకథను సెలబ్రేట్ చేసే విధంగా ఉంటుంది' అని జాకీ సన్నిహితులు రివీల్ చేశారు. దీంతో పాటు పెళ్లికి వచ్చిన గెస్టులకు కూడా స్పెషల్ పర్ఫార్మెన్స్‌లు ఉండనున్నాయి. సీనియర్ నటి శిల్పా శెట్టి.. తన భర్త రాజ్ కుంద్రాతో కలిసి రకుల్, జాకీల పెళ్లిలో పెర్ఫార్మ్ చేయనున్నట్టు సమాచారం. లక్ష్మి మంచు, ప్రగ్యా జైస్వాల్, అజయ్ దేవగన్.. ఇలా ఎందరో సెలబ్రిటీలు రకుల్, జాకీల పెళ్లిలో సందడి చేయనున్నారు. పెళ్లి పనుల కోసం గోవాకు బయల్దేరే ముందు ముంబాయ్‌లోని సిద్ధి వినాయకుడి ఆలయాన్ని సందర్శించుకుంది ఈ జంట. దానికి సంబంధించిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి కూడా. 2021లో ముందుగా వీరి ప్రేమ గురించి బయటపెట్టారు రకుల్, జాకీ. అప్పటినుండి ఇప్పటివరకు వీరు పెద్దగా బయట కలిసి కనిపించకపోయినా.. సందర్భం వచ్చినప్పుడల్లా సోషల్ మీడియాలో ఒకరిపై మరొకరికి ఉన్న ప్రేమను బయటపెడుతూనే ఉన్నారు. గోవాలో జరగనున్న డెస్టినేషన్ వెడ్డింగ్‌లో కొందరు సినీ సెలబ్రిటీలతో పాటు ఇరువురి కుటుంబ సభ్యులు పాల్గొనున్నారు.



# ఆకట్టుకుంటున్న ఆపరేషన్ వాలెంటైన్ ట్రైలర్

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ నటించిన తాజా చిత్రం 'ఆపరేషన్ వాలెంటైన్ శక్తి ప్రతాప్ సింగ్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో మానుషి చిల్లర్ హీరోయిన్‌గా నటించింది. భారత వైమానిక దళ ధైర్య సాహసాలు, త్యాగాలను ఆవిష్కరిస్తూ యథార్థ సంఘటనల ఆధారంగా 'ఆపరేషన్ వాలెంటైన్' చిత్రాన్ని తెరకెక్కించారు. మార్చి 1వ తేదీన ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ నేపథ్యంలో తాజాగా చిత్ర బృందం ట్రైలన్‌ను విడుదల చేసింది తెలుగులో ఈ మూవీ ట్రైలర్‌ను టాలీవుడ్ పవర్ స్టార్ రామ్ చరణ్ విడుదల చేయగా.. హిందీలో సల్మాన్ ఖాన్ రిలీజ్ చేశారు. రామ్ చరణ్ ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేస్తూ తన తమ్ముడు వరుణ్ తేజ్‌పై ప్రశంసలు కురిపించారు. 'ఎప్పుడూ ప్రయోగాలు చేస్తూ గర్వించేలా చేస్తుంటావ్. ఈ సారి ఇండియా అంతా గర్వపడే సినిమా చేశావ్' అంటూ ఎక్స్‌లో పోస్టు చేశారు. ఈ ట్రైలర్‌లోని సీన్లు, విజువల్స్, యాక్షన్ సీన్స్ చూస్తే రోమాలు నిక్కబొడుచుకోవాల్సిందే. ఎయిర్‌ఫోర్స్ అధికారిగా వరుణ్ తేజ్ చేసిన సాహసాలు ఈట్రైలర్‌లో కళ్లకు కట్టినట్లు చూపించారు.

ముఖ్యంగా ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ శిబిరంపై జరిగిన దాడిన, తర్వాత భారత వైమానిక సైన్యం తిరుగుబాటు వంటి సన్నివేశాలతో ఈ ట్రైలర్ ఆద్యంతం ఆసక్తిగా ఉంది. ఈ చిత్రంలో వరుణ్ ఐఏఎఫ్ అధికారిగా నటిస్తుండగా, రాడార్ ఆఫీసర్‌గా మానుషి చిల్లర్ కనిపించనుంది. మంచినటిగా గుర్తింపు తెచ్చుకున్న రుహానీశర్మ కూడా ఇందులో కీలక పాత్ర పోషిస్తోంది. సోనీ పిక్చర్స్ ఇంటర్నేషనల్, రినైసన్స్ పతాకాలపై సందీప్ ముద్దా ఈ చిత్రాన్ని నిర్మించారు.

